ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

వరంగల్

fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 171 పేజీలు: 8+16 వెల: 6.50

నీరసంతోనే పడిపోయిన తమిళ సిఎం స్టాలిన్ 3

అన్నవరం దేవేందర్‌కు దాశరథి అవార్డు 7

# ఉపరాష్ట్రపతి రాజీనామా



అనారోగ్య కారణాలతో వైదొలగుతున్నట్లు ప్రకటించిన ధన్‌ఖడ్


2027లో ముగియనున్న పదవీకాలం..

**న్యూఢిల్లీ, జూలై 21:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజుననే ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ సంచలన ప్రకటనచేసారు. తన ఆరోగ్యకారణాల రీత్యా వైద్యుల సలహాలను అనుసరించి తాను తన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామాచేస్తున్నట్లుప్రకటించారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు పంపించిన ధన్‌ఖడ్ తన రాజీనామా వెంటనే అమలులోకి వచ్చినట్లు పరిగణించాలనికోరారు. వైద్యుల సలహామేరకు తన ఆరోగ్యపరిరక్షణకు ఇదే సరైన మార్గమని భావించి తాను ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని అన్నారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణం ప్రకారం తాను రాజీనామాచేస్తున్నట్లు ప్రకటించారు. తాను పదవిలో ఉన్నంతకాలం రాష్ట్రపతి తనకు సంపూర్ణమద్దతునిచ్చి >>2

# జస్టిస్ వర్మ అభిశంసన!

## 208 మంది ఎంపీలు స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌కు నోటీసులు

వర్మ తొలగింపు డిమాండ్ చేసిన కాంగ్రెస్, బిజెపి, టిడిపి, జెడియు, జనసేన, సిపిఎం తదితర పార్టీలు



జస్టిస్ వర్మపై సోమవారం న్యూఢిల్లీలో స్పీకర్ ఓంబిర్లాకు నోటీసులు అందజేస్తున్న ఎంపీలు

**న్యూఢిల్లీ,జూలై 21:** జస్టిస్‌వర్మ అభిశంసన తీర్మానం ప్రక్రియను పార్లమెంటులో ప్రారంభించారు. మొత్తం145 మంది లోక్‌సభ ఎంపిలు ఈ అభిశంసన తీర్మానంపై సంతకాలుచేసారు. రాజ్యసభలో కూడా 63 మంది విపక్ష ఎంపిలు సోమవారం రాజ్యసభ ఛైర్మన్ జగదీప్‌ధన్‌ఖడ్‌కు తమ నోటీసులు అందచేసారు. రాజ్యాంగంలోని 124,217, 218 అధికరణల ప్రకారం జస్టిస్ >>2

# జస్టిస్ వర్మ మీకు స్నేహితుడా?

న్యాయసూత్రాలు మాకు చెప్పకండి

న్యాయవాదిపై సుప్రీం చీఫ్‌జస్టిస్ ఆగ్రహం 7



# గిగ్ వర్కర్లకు సంక్షేమనిధి

ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్‌కూడా..

## 11 ఎటిసిల అభివృద్ధికి ప్రణాళిక: సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై21:** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. తెలంగాణ రైజింగ్- 2047కు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) అభివృద్ధి,పురోగతిపై సోమవారం సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఏటీసీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటిసిల అభివృద్ధి పనులు >>2

# వర్షాలపై అప్రమత్తం

## ముందు జాగ్రత్తలు తీసుకోండి



సోమవారం హైదరాబాద్‌లో విడియోకాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

యూరియా మళ్లిస్తే కేసులు పెట్టండి

కలెక్టర్లను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై21:** జులై, ఆగస్ట్ నెలల్లో వర్షాలు కురియనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాల్లో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుంచి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, రేషన్‌కార్డుల పంపిణీ పురోగతి అంశాలఅపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో రోజు ఒక్కో చోట అంచనాలకు మించిన భారీ వర్షం కురుస్తుంది. అందుకే వర్షాలు కురిసే ఈ రెండునెలల సీజన్లో అన్ని విభాగాల అధికారులు జిల్లాల్లో అందుబాటులో ఉండాలి. అదమరచి ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.. ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ అందించే వర్ష సూచనలను వెంటనే అన్ని గ్రామాలకు చేరవేసేలా కలెక్టర్లు బాధ్యత వహించాలి. దీంతో కనీసం మూడు గంటల ముందే రైతులు, ప్రజలను అప్రమత్తం చేసే వీలుంటుందని చెప్పారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 21 శాతం వర్షపాతం తక్కువగా నమోదైంది. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. వర్షాల కారణంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు, నీరు నిల్వ ఉన్నచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని విభాగాలు మరింత సమర్థంగా పని చేయాలని చెప్పారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేలా జీహెచ్‌ఎంసీతో పాటు పోలీస్, ట్రాఫిక్ విభాగాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా అధ్వర్యంలోని 150 టీమ్లు వెంటనే రంగంలోకి దిగాలని చెప్పారు. సిబ్బందితో పాటు అధికారులు నేరుగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో పోలీస్ కమిషనర్లతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా జిల్లాకలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలి. వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూం నుంచి సమన్వయం చేసుకోవాలని చెప్పారు. జిల్లాల పరిధిలో వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలి. >>2

# ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా ప్రపంచానికి తెలిసింది 7



22 నిమిషాల్లో ఉగ్రశిబిరాలు ధ్వంసం

పార్లమెంటువద్ద మీడియాతో ప్రధాని మోడీ

# స్థానిక ఎన్నికలకు రెడీ

## త్వరలోనే నియోజకవర్గస్థాయి బిఆర్ఎస్ సమావేశాలు: కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై21:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు నిర్ణయించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ నిర్వహించే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈ సమావేశాలు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్‌లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీను అమలుచేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో పాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రైతు బంధు ఇవ్వకుండా అన్నదాతలకు రేవంత్ సర్కార్ చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా వేధిస్తున్నా కూడా ఈ ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనాన్ని తెలియచేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల నుంచి సాగునీటి నుంచి విద్యుత్ సరాఫరా దాకా అన్నదాతలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని చెప్పాలన్నారు. రేవంత్ ప్రభుత్వ చేతకానితనంతో పాలన అస్తవ్యస్తంగా మారి గ్రామాల్లో పారిశుద్ధం పడకేసిందన్న సంగతిని చెప్పాలన్నారు. బీసీలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ పేరుతో ఆడుతున్న డ్రామాలను ప్రజలకు విడమిర్చి చెప్పాలన్నారు. ఇంతేకాకుండా వివిధ రంగాలకు డిక్లరేషన్‌ల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆయా రంగాలను మోసం చేసిన తీరును వివరించాలన్నారు. >>2



కమ్యూనిస్టు కురువృద్ధుడు

# అచ్యుతానందన్ కన్నుమూత

ఎమ్మెల్యేగా ఏడు సార్లు ఎన్నికైన కేరళ మాజీ సిఎం

**తిరువనంతపురం, జూలై 21:** కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు కురు వృద్ధుడు వి.ఎస్. అచ్యుతానందన్ కన్నుమూశారు. గతనెల గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిన అచ్యుతానందన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో >>2

# రేషన్ కార్డుల్లో రికార్డు

## 93 లక్షల కుటుంబాలకు ఇస్తున్నాం: డి.సిఎం భట్టి



**బోనకల్, ప్రభాతవార్త :** రేషన్ కార్డు అంటేనే ఆహార భద్రత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. అత్యంత పేదలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతి వర్గాలకు కూడా ఇందిరమ్మ ప్రభుత్వంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాదు, సన్న బియ్యం కూడా ప్రజా ప్రభుత్వంలో పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వడం భారతదేశ చరిత్రలో నే ఒక రికార్డు అని అన్నారు. లబ్ధిదారుల సంఖ్య రీత్యా చూసినా, సన్న బియ్యం వారీగా చూసిన ఈ దేశంలో ఆహార భద్రత విషయంలో తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా నిలిచిందని తెలిపారు. కొత్తగా పెళ్లి అయిన వాళ్ళు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు పేరు నమోదు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం గత పది సంవత్సరాలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఫలితం కనిపించలేదని తెలిపారు. మధిర నియోజకవర్గం లోనే కొత్తగా 13,767 మంది లబ్ధిదారులకు ఒకేరోజు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సంతోషించదగిన అంశం అన్నారు. రేషన్ కార్డులో జారీ అనేది ఉమ్మడి రాష్ట్రంలో నిరంతర ప్రక్రియ కాగా ప్రతి సంవత్సరాలు పరిపాలించిన వారు ఈ విషయాన్ని పూర్తిగా నిరక్ష్యం చేశారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండగా ఈ పథకం కింద రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు.

681 మంది డయాలసిస్

# పేషెంట్లకు పెన్షన్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై21:** డయాలసిస్ పేషెంట్లకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నూతనంగా 681 మంది డయాలసిస్ పేషెంట్లకు తెలంగాణ సర్కార్ చేయూత పెన్షన్లని మంజూరు చేయనుంది. దీంతో లబ్ధిదారుల సంఖ్య మెత్తం 4,710కి చేరింది. ఈ మేరకు పెన్షన్ మంజూరు ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 4,011 మంది డయాలసిస్ పేషెంట్లకు సామాజిక పెన్షన్లని బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 4,029 మంది డయాలసిస్ పేషెంట్లకు చేయూత పెన్షన్లని మంజూరు చేశారు. తాజాగా నిర్ణయంతో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగింది. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న డయాలసిస్ పేషంట్లను ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వం గుర్తిస్తోంది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ గుర్తించిన 681 మంది డయాలసిస్ పేషెంట్ల వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాత పెన్షన్లను సెర్ప్ మంజూరు >>2

కృష్ణా, గోదావరి పొంగుతున్నా..

# అలుగుపారని చెరువులు





వేల టిఎంసిల నీరు సముద్రంపాలు

వర్షాభావంతో అన్నదాతల్లో నైరాశ్యం

బోర్లతో సాగు వల్ల పెరిగిన విద్యుత్ వినియోగం

**హైదరాబాద్,జూలై 21,ప్రభాతవార్త:** గోదావరి కృష్ణా నదులలో ఉధృత ప్రవాహం ఉన్నప్పటికి అలుగు పారని చెరువులతో ఆశలు అడుగంటుతున్నాయి. కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇప్పటికే వేల టిఎంసిల నీరు సంద్రం పాలవుతున్నాయి. కృష్ణాగోదావరి ఉరకలెత్తుతంటే మరోవైపు బేసిన్‌లోని చెరువులు చూస్తే ఆశించిన రీతిలో నీరు లేక వెలవెలపోతున్నాయి. తెలంగాణ అంతటా వర్షాభావం కొనసాగుతుండటంతో అన్నదాతలలో నైరాశ్యం నెలకొంది. బోర్లపై సాగు చేస్తుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. మహబూబాబాద్,కామారెడ్డి, వికారాబాద్, నల్లగొండ,రాజన్నసిరిసిల్ల, హైదరబాద్,వరంగల్, మెదక్,మేడ్చల్ మల్కాజ్‌గిరి,హనుమకొండ, కరీంనగర్, నిజామాబాద్, సూర్యపేట, నిర్మల్, ములుగు, జనగాం, సంగారెడ్డి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో నేటికి లోటువర్షాపాతం ఉండటంతో అక్కడ చెరువుల్లో పదిశాతం మించి కూడా కొత్త నీరు చేరలేదు. యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్, నారాయనపేట, సిద్దిపేట, >>2

రాజకీయ పోరాటాలు

# మీకెందుకు?

## అధికార దుర్వినియోగం చేయకండి

కర్ణాటక 'ముడా' కేసులో హైకోర్టు తీర్పును ఇడి సవాల్ చేయడాన్ని తిరస్కరించిన 'సుప్రీం'

హైకోర్టు సింగిల్ జడ్జి నిర్ణయంలో లోపం లేదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,జూలై 21:** కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై సుప్రీంకోర్టు మండిపడింది. రాజకీయ పోరాటం చేయడం అధికార దుర్వినియోగం కిందకు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టపరమైన చర్యల ద్వారా రాజకీయ పోరాటాలు చేయడానికి ప్రయత్నించినందుకు ఈడీపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది. ముడా కుంభకోణం సహా మరో కేసులో విచారణ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ఈడీపై తీవ్రంగా స్పందించింది. మైసూర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణానికి సంబంధించిన కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, రాష్ట్ర మంత్రి సురేశ్‌లపై జారీ చేసిన సమన్లను కర్ణాటక హైకోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ క్రమంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా ఈడీపై మండిపడింది. రాజకీయ యుద్ధాలు కోర్టు బయట చేసుకోవాలని తెలిపింది. అలాంటి పోరాటాలకు ఈడీని ఎందుకు వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దిగువ కోర్టు, కర్ణాటక హైకోర్టు ముడా స్కామ్ కేసుకు సంబంధించి ఏకకాలంలో >>2

# విమాన ప్రమాదంపై విచారణ జరుగుతోంది 3

ప్రాథమిక నివేదికతోనే అవగాహనకు రాలేం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

# విచారణకు రండి 2

సినీ నటులు రాణా, ప్రకాశ్‌రాజ్, దేవరకొండ విజయ్, మంచులక్ష్మికి నోటీసులు ఇచ్చిన ఇడి



న్యూఢిల్లీలోని పార్లమెంట్ సిపిపి కార్యాలయంలో సోమవారం ఖర్గేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు నేతలు

## కమ్యూనిస్టు కురువృద్ధుడు అచ్యుతానందన్ కన్నుమూత

>> సోమవారం తుది శ్వాస విడిచారు. 101 ఏళ్ల వయ సున్న అచ్యుతానందన్, 2006 నుంచి 2011 వరకు కేరళ సీఎంగా పనిచేశారు. 1923 అక్టోబర్ 20న కేరళలో జన్మించిన అచ్యుతానందన్ ఏడుసార్లు ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్ని కయ్యారు. మూడుసార్లు కేరళ విప క్షనేతగా వ్యవహరించారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సిపిఐఎం స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. కేరళ రాజకీయ చరిత్రలో కీలక నేత ఆయన అచ్యుతానందన్ దేశంలోనే అత్యంత గౌరవనీయ కమ్యూనిస్టు నేతల్లో ఒకరిగా పేరుగాంచారు. కార్మికుల హక్కులు, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం కోసం ఆయన ఎంతో కృషి చేశా రు. లెనిన్, స్టాలిన్, మావో జీవితాలతో పాటు ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేతగా పేరుంది. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేశారు అచ్యుతానందన్. ఆ తర్వాత దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ జీవనం సాగించారు. కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టి 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడ య్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సిపిఐ జాతీయ కౌన్సిల్ నుంచి వైదొలగి, సిపిఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 వరకూ కేరళ అసెంబ్లీకి ఎన్నికైన అచ్యుతానందన్, ఒకసారి (2006-2011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. అవినీతికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎన్నడూ వెనకడుగు వేయని అచ్యుతానందన్, రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా సీఎంగా ఉక్కు పాదం మోపారు. ఈ చర్యలతో పార్టీ నుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నా ఆయన వెనుకడుగు వేయలేదు. ప్రజలు, పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణను పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికి పెద్దపీట వేశారు. ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ ఆయన విడిచిపెట్టలేదు. 1923లో పుట్టినా ఆధునిక అవసరాలను కూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి అచ్యుతానందన్. పాతతరంలో భూమి కొంత మంది చేతుల్లో కేంద్రీకృతమైనట్లుగానే, సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన, అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమాలు చేశారు. 2016లో 93వ ఏట ప్రవేశించినా కమ్యూనిస్టులకు అచ్యుతానందన్ విజయవంతమైన నేతగా నిలిచారు.

## జస్టిస్ వర్మ అభిశంసన!

>> వర్మను తొలగించాలంటూ ఎంపిలు నోటీసులు జారీచేసారు. కేంద్రమాజీ మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌తోపాటు వివిద పక్షాల నాయకులు ఈ తీర్మానంపై సంతకాలుచేసారు. స్పీకర్ ఓంబిర్లాకు ఈ నోటీసులను అందచేసారు. ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, టిడిపి, జెడియు, జెడిఎస్, జనసేనపార్టీ, ఎజిపి, శివసేనషిండేవర్గం, ఎల్జేఎస్‌పి, ఎస్‌కెపి, సిపిఎం ఇతరులు ఈ తీర్మానంపై సంతకాలుచేసారు. ఎంపిలు అనురాగ్‌సింగ్ ఠాకూర్, రవిశంకర్‌ప్రసాద్, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, రాజీవ్‌ప్రతాప్‌రూడీ, పిపి చౌదరి, సుప్రియా సూలే,కెసి వేణుగోపాల్ తదితరులు స్పీకర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపి కెసురేష్ మాట్లాడుతూ తమ పార్టీ జస్టిస్‌వర్మపై ప్రవేశపెట్టిన తీర్మానానికి సంపూర్ణమద్దతు ఇస్తోందని అన్నారు. ఇండియా కూటమి పార్టీలు కూడా వర్మపై అభిశంసన తీర్మానానికి సంపూర్ణ మద్దతుప్రకటించాయన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే 40 మంది ఎంపిల సంతకాలను సేకరించిందని, ఇతర విపక్ష పార్టీలసభ్యులతోకలిసి సమిష్టికృషిచేస్తుందని చెప్పారు. ఈఏడాది మార్చి 15వ తేదీ జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో 500 రూపాయలనోట్లు కాలిన కట్టలు లభించిన అంశం తీవ్ర వివాదాస్పదం అయింది. వీటిపైసుప్రీం సిజెఐ నియమించిన త్రిసభ్య కమిటీ నివేదిక, ఆపై ఆనాటి చీఫ్‌జస్టిస్‌సంజీవ్‌ఖన్నా సిఫారసులతో పార్లమెంటు ప్రస్తుతం అభిశంసనకకు ముందుకువచ్చింది. అయితే వర్మ తన రాజీనామాచేసేందుకు తిరస్కరించారు. దీనితో ఇపుడు ఆయన తొలగింపు అనివార్యం అయింది. అయితే తనపద వీచ్యుతి తీర్మానంసవాల్‌చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్ విచారణకు రానున్నది. ఏకపక్షంగా విచారణజరిగిందని, తన అభిప్రాయాలకు గౌరవం ఇవ్వలేదని, నోట్లకట్టలకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తన వాదనలు వినిపిస్తున్నారు.

## గిగ్ వర్కర్లకు సంక్షేమనిధి

>> పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు సిఎంకు తెలిపారు. ఫేజ్1 లో 25, ఫేజ్ 2 లో 40, ఫేజ్3 లో 46 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఫేజ్1, ఫేజ్2 లో ఇప్పటి వరకు 49 అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తిగా చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని అధికారులకు సిఎం సూచించారు. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసిని ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సిఎం వద్ద జరిగిన సమీక్షలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఏటీసీ పురోగతిపై సమీక్ష తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి గిగ్ వర్కర్స్ ప్రతిపాదిత పాలసీని సమీక్షించారు. ఈ సందర్భంగా గిగ్ వర్కర్స్ కు చట్టబద్ధమైన గుర్తింపు అంశాన్ని పాలసీలో అధికారులు ప్రతిపాదించారు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదన చేశారు. కాగా, గిగ్ వర్కర్స్ పాలసీపై సిఎం అధికారులకు పలు సూచనలు చేశారు. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్ లైన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్స్యూరెన్స్ సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు.

### ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్
## రాజీనామా

>> ప్రోత్సహించారని ఆమెతో కలిసి పనిచేసిన కాలం తనకు జీవితంలో గుర్తుండిపోతుందని ఆయన అన్నారు. అలాగే ఆయన ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రివర్గసభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవిలో ఉన్నంతకాలం ప్రధానిమోడీ ఇచ్చిన సహకారం వెలకట్టలేనిదని పదవిలో ఉన్నకాలంలో తాను ఎంతో నేర్చుకున్నానని ఆయన అన్నారు. ఈ ఏడాది మార్చిలో ఆయన ఛాతీనొప్పి అసౌకర్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందారు జూన్‌లోనూ ఉత్తరాఖండ్‌లోని కుమావు విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవంలో ధన్‌ఖడ్ స్పృహ తప్పిపడిపోయారు. ఈ క్రమంలోనే ఆరోగ్యపరిరక్షణకోసం రాజీనామాచేస్తున్నట్లు ధన్‌ఖడ్‌ప్రకటించారని ఆయన సన్నిహితులు బిజెపి నేతలు చెపుతున్నారు. రాజస్థాన్‌లోని ఓబిసి సామాజిక వర్గానికి చెందిన ధన్‌ఖడ్ మూడు దశాబ్దాలుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నారు. సాధారణ రైతు కుటుంబంనుంచి వచ్చిన ఆయన దేశంలోనే రెండో అత్యున్నతస్థానానికి ఎదిగారు. 1951 మే 18న రాజస్థాన్‌లోని ఝున్‌ఝునుజిల్లాకిథనా గ్రామంలో జన్మించిన ధన్‌ఖడ్ ఎల్ఎల్‌బి కోర్సుతర్వాత 1979లో నవంబరులో రాజస్థాన్ బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌గా నమోదయ్యారు. రాజస్థాన్ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీసుచేసారు. 1989లో జనతాదళ్ తరపున ఝున్‌ఝును లోక్‌సభ స్థానంనుంచి ధన్‌ఖడ్ గెలిచారు. 1990లో ప్రధాని చంద్రశేఖర్ కేబినెట్‌లో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా పనిచేసారు. 1993-98 మధ్య ఎమ్మెల్యేగా కొనసాగారు. పివినరసింహారావుప్రధానిగా ఉన్న కాలంలో కాంగ్రెస్‌లోచేరారు. 1998నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ న్యాయవాద వృత్తిలోనే కొనసాగారు. 2008 తర్వాత బిజెపిలో చేరిన ధన్‌ఖడ్ 2019లో అనూహ్యంగా పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆనాడు బెంగాల్ గవర్నర్‌గా సీఎం మమతా బెనర్జీకి చుక్కలుచూపించారన్న ప్రచారం ఉంది. యూనివర్సిటీ ఛాన్సలర్‌గా గవర్నర్‌ను తొలగిసూనత మమత ప్రవేశపెట్టిన ఆర్డినెన్స్‌లతోసహా అన్ని బిల్లులను కూడా సందేహాలు నివృత్తిచేయాలంటూ పెండింగ్‌లోనే ఉంచడంతో మమతా దీదీకి ధన్‌ఖడ్‌మధ్య కోల్డ్‌వార్ నడిచింది. 2022లో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అధికార ఎన్డీయేకూటమి ఆయనను అభ్యర్థిగా దించింది. విపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆళ్వాపై 346 ఓట్లతేడాతో విజయం సాధించారు. భారత 14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలుచేపట్టారు.

### వారం - వర్జ్యం

22-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
ద్వాదశి ఉ.7.06, త్రయోదశి తె.4.40
మృగశిర రా.7.26
వర్జ్యం : రా.3.19-తె.4.49
దు.ఉ.8.22-9.14, 2) రా.11.55-12.47
శుభసమయం: ఉ.7.30-8.15, సా.6.46-7.30
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు. పెట్టుబడులకు తగిన సమయం.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు. వివాహ యత్నాలు నిదానంగా సాగుతాయి.

**మిథునం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కర్కాటకం :** ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**సింహం:** ఆర్థిక వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఇంటా బయటా చికాకులు ఎదురైనా సన్నిహితులు సాయం అందిస్తారు.

**కన్య :** బంధువులతో ఏర్పడిన మనస్పర్థలు పరిష్కరించుకొంటారు. పెట్టుబడులలో స్వల్పలాభాలు పొందుతారు.

**తుల :** ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎదురైన చికాకులు తొలగించుకొంటారు. అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** దీర్ఘకాలిక సమస్యలు చాకచక్యంగా పరిష్కరించుకొంటారు. సంతానం అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు.

**ధనుస్సు:** మిత్రుల సాయంతో ముందుకు సాగుతారు. కాంట్రాక్టులు పొందుతారు. వృత్తి,వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** ఆర్థిక వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

**కుంభం:** బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా సాగుతాయి.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. సోదరుల నుండి ఆస్తిలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వర్షాలపై అప్రమత్తం


>> కొన్ని చోట్ల పిడుగు పాటుతో చనిపోతున్న వార్తలు వస్తున్నాయని చెప్పారు. అటువంటి వివరాలను కూడా నమోదు చేయాలి.భవిష్యత్తులో వారికి ప్రభుత్వ పరంగా సాయం అందించే వీలుంటుందన్నారు.

వర్షాల సీజన్లో డెంగీతో పాటు సీజనల్ జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. గిరిజన ప్రాంతాలు, ఐటీడీఏ ఏజెన్సీ ఏరియాలు, మారుమూల ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. పీహెచ్ సీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని చెప్పారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ప్రజలకు ఆపద వచ్చినా కలెక్టర్లు వెంటనే స్పందించాలి. ప్రతి జిల్లా కలెక్టర్ ఖాతాలో రూ. కోటి అత్యవసర నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని చెప్పారు. కలెక్టర్లు తమ జిల్లా పరిధిలోని పీహెచ్సీల నుంచి జిల్లా ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీలు చేయాలి. ప్రతి రోజు ఉదయం పూట క్షేత్రస్థాయి పర్యటన చేపట్టాలని చెప్పారు. ప్రతీ రోజు కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి సీఎస్ ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని, అజాగ్రత్తగా ఉంటే అధికారులు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

జిల్లాల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు, చెర్వులు, కుంటల నీటిని జాగ్రత్తగా ఒడిసిపట్టుకోవాలి. నీటి నిల్వలను అంచనా వేసుకోవాలి. వర్షాలకు అనుగుణంగా నీటి వినియోగ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు.చెరువులు, కుంటలకు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కృష్ణా బేసిన్ పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైంది. త్వరలోనే నాగార్జునసాగర్ నీటిని విడుదల చేస్తామని చెప్పారు. గత ఏడాది రికార్డు స్థాయిలో 2కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తితో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. యూరియా కృత్రిమ కొరత ప్రచారానికి కలెక్టర్లు అడ్డుకట్ట వేయాలని, కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆగస్ట్ కోటా కూడా త్వరలోనే రాష్ట్రానికి సరఫరా అవుతుందన్నారు. యూరియా స్టాక్ వివరాలను డీలర్లు, షాపుల వద్ద బోర్డుపై డిస్ ప్లే చేయాలి. స్టాక్ డిటైల్స్ ఆన్ లైన్ లో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూరియా అమ్మకాలు సాఫీగా సాగేలా రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని చోట్ల డీలర్లు, షాపుల వద్ద ఇద్దరు అధికారులు, ఇద్దరు పోలీసులను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియాను మళ్లిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇటీవలే కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు యూరియాను మళ్లిస్తే కఠినంగా వ్యవహరించాలి. ఎంతటి వారైనా ఉపేక్షించవద్దు. కేసులు పెట్టాలి ఆదేశించారు. ఎరువులకు సంబంధించి టోల్ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని చెప్పారు. రైతులు, పేద ప్రజల కంటే తమ ప్రభుత్వానికి ఏదీ ముఖ్యం కాదన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలో విజయవంతంగా ప్రారంభమైందన్నారు. సన్న బియ్యం పంపిణీతో గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డులు, రేషన్ షాపుల విలువ పెరిగిందన్నారు. రాష్ట్రంలో దాదాపు 7 లక్షల కొత్త కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దీంతో దాదాపు 31 లక్షల కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతారని చెప్పారు.. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. పేద ప్రజలు ఆహార భద్రత గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 96లక్షల కార్డులతో 3.10 కోట్ల మంది సన్న బియ్యం తీసుకుంటున్నారని, పేదలకు సన్న బియ్యం అందించే ఈ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్ట్ 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని చెప్పారు.జిల్లా ఇన్ ఛార్జీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ కొత్త కార్డుల పంపిణీలో పాల్గొనాలి.ప్రతీ మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొనాలని చెప్పారు. జిల్లాలో ఉన్న ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక చోట జిల్లా ఇన్చార్జీ మంత్రి కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలి. అందుకు వీలుగా షెడ్యూలును కలెక్టర్లు తయారు చేసి రేషన్ కార్డుల పంపిణీ విజయవంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. సెక్రటేరియట్లో నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఏర్పాటు చేసిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సీతక్క, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొత్తగూడెం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఖమ్మం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అలుగుపారని చెరువులు

>> కుమురంభీం జిల్లాలో సాధారణ వర్షాపాతం నమోదైనా 15శాతం కొత్త నీరు చెరువుల్లోకి వచ్చి చేరలేదు. భద్రాదికొత్తగూడం,ఖమ్మం జిల్లా నుంచి గోదావరి ఉరకలై పరుగులు పెడుతున్నా స్థానికంగా చెరువులు కుంటలలో ఆశించిన నీరు చేరుకోలేదు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 44వేల చెరువుల్లో సగటునా 17శాతం నీరు కూడా నిండలేదు.సాగు కాలం దాటుతున్నా చెరువులు, కుంటల్లో నీరు లేక పంటల సాగు సందేహంగా మారింది. లక్షల ఎకరాల్లో సాగు కావాల్సిన పంటలు వందల ఎకరాల్లోనూ సాగవలేదు. గోదావరి కృష్ణా బేసిన్ లోని అనేక గ్రామాల్లో చెరువులు జలం లేక ఎండి నెర్రలువాచాయి.ఎస్సారెస్పీ. కాళేశ్వరం ప్రాజెక్టుల నుంచి నీరు రాకున్నావాటి దిగువ నుంచి ప్రవహించే నీటితో దేవాదుల ప్రాజెక్టులో నీటిని నిల్వ చేసుకోవచ్చు. దేవాదుల, ప్రాజెక్టు మూడో దశలో నిలిచిన అసంపూర్తి పనులు పూర్తిచేస్తే 38 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవడంతోపాటు, ఆ నీటిని చెరువులకు మళ్లించాలని రైతులు కోరుతున్నారు. ఐనాపూర్ శివారులోని తపాసుపల్లి జలాశయం నుంచి గత ఎనిమి సంవత్సరాలుగా నీటిని కాలువలు, గొట్టాపు మార్గాల ద్వారా తరలించి చెరువులు నింపడంతో చేర్యాల సబ్ డివిజన్లో భూగర్భజల మట్టం పెరిగింది. ఎండిపోయిన వ్యవసాయ బావుల్లో నీట ఊటలు పుట్టుకొచ్చాయి. ఈ ఏడాదిలో గత వారం కేవలం రెండు రోజులు మాత్రమే గోదావరి ఎత్తిపోయించారు. ఆ తర్వాత నిలిపేశారు. రైతులు నాట్ల కోసం వరి నారు పోసి సాగునీటికి ఎదురుచూస్తున్నారు. దీంతో గోదావరి జలాలతో తపాసుపల్లి రిజర్వాయరు నింపి చెరువుల్లోకి తరలించాల్సిన అవసరం పెరిగింది.గత ఎనిమిది సంవత్సరాలుగా ఏటూరానాగారం వద్ద గోదావరి నీటిని గొట్టాల ద్వారా తపాసుపల్లి జలాశయంలోకి ఎత్తిపోసి అక్కడి నుంచి నిరుటి వరకు చెరువుల్లోకి తరలించారు. అలా గతంలో చేర్యాల, కొండపాక, కొమురవెల్లి, ధూల్మిట్ట, మద్దూరు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల్లో సుమారు 50 చెరువులకు పైగా నింపేవారు. ఇపుడు ఆపరిస్థితి లేదు. ఇటు వర్షాభావ పరిస్థితులు, గోదావరి జలాల తరలింపు ఆలస్యంతోచెరువులు నిండుకున్నాయి. నీటి గుంతల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో 50 వేల ఎకరాల ఆయకట్టు సాగు పరిస్థితి దయనీయంగా మారింది. తాగునీటికి సైతం ఇబ్బంది ఏర్పడే పరిస్థితులు ఎదురవుతున్నాయి. లక్నవరంలో 12అడుగులలో నీరు ఉంది. రామప్ప,గణపసముద్రం,బయ్యారం పెద్దచెరువు,పాకలసరస్సు,మైలారం రిజర్వాయర్ నీటి మట్టం తక్కువగా ఉంది. కామారెడ్డి,నిజామాబాద్ జిల్లాలో నీటిజాడలు కానరావడం లేదు. ఎస్సారెస్పీలో 21 టిఎంసిలు మాత్రమే నీరు ఉండటంతో ఉత్తర తెలంగాణలో చెరువులు నింపలేదని పరిస్థితి ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తేనే నిజాంసాగర్ జలాశయం ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుంది. ఇటీవల నిజామాబాద్ నగరం, బోధన్ పట్టణ ప్రజల తాగు అవసరాలకు నీటిని విడుదల చేయడంతో నిల్వలు తగ్గుముఖం పట్టాయి. జలాశయంలో ఉన్న కొద్దిపాటి నీటిని 149 డిస్ట్రిబ్యూటర్ అలీసాగర్ ఎత్తిపోతల పథకం వరకు 1.15 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందించడంతో రైతులు వరితోపాటు ఇతర పంటలు వేస్తున్నారు.నిజామ్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు అందులో 17.802 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 1391 అడుగుల ఎత్తులో4.703 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. జలాశయం నుంచి నిజామాబాద్, బోధన్ పట్టణ ప్రజల తాగునీటి కోసం జూన్ 18 నుంచి 25వ తేదీ వరకు 0.75 టీఎంసీలు, వానాకాలం పంటలకు ఇప్పటివరకు 0.72 టీఎంసీలను విడుదల చేశారు. పంటల సాగుకు ప్రస్తుతం రెండోసారి 1200 క్యూసెక్కుల నీటిని అధికారులు వారబందీ పద్ధతిలో విడుదల చేస్తున్నారు. ఎగువన వర్షాలు కురవకపోతే నిజామ్‌సాగర్ నుంచి ఆయకట్టుకు మరో రెండు విడతలు మాత్రమే నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి రాక కోసం ఎదురుచూస్తున్నారు. కొండపోచమ్మ నుంచి వయా హల్దివాగుతో నిజామ్‌సాగర్ నీరు తరలించేందుకు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో అవకాశం ఉన్నా గత పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపే క్రమంలో ఉపయోగించడానికి ప్రస్తుత పాలకులు వాడుకొంటున్నారు.దీనితో రైతులకుఇబ్బంది కలుగుతోంది. నల్గొండ సూర్యాపేట జిల్లాల్లో భూగర్భ జలాల లభ్యత కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ, చిన్న,మధ్యతరహా నీటివనరులలో నీరు లేకుండా పోయింది. యాదాద్రిలో పరిస్థితి తీవ్రంగా ఉంది. యాదాద్రి జిల్లాలో గతేడాది జూన్లో భూగర్భ జలాల లభ్యత 10.41 మీటర్లు ఉండగా. ఈ ఏడాది జూన్లో 12.22మీటర్లుగా నమోదైంది. ప్రస్తుతం సాగునీటి విడుదల లేకపోవడంతో.. పంటల సాగు కోసం బోర్లు, మోటార్లను ఆశ్రయించాల్సి రావడంతో జలాలు మరింత లోతుకు పడిపోయే ప్రమాదముందని నిపుణులు భావిస్తున్నారు. జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1 నుంచి జులై 15 వరకు అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 47 శాతం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నల్గొండలో 37శాతం, యాదాద్రిలో 36 శాతం తక్కువగా నమోదైంది. యాదాద్రి జిల్లాలో భువనగిరిలో 65 శాతం, బీబీనగర్, గుండాలలో 62శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లా నారాయణపురం మండలంలో సాధారణం కంటే 71 శాతం అదనంగా వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో వర్షాభావం పెరిగిన ఊష్ణోగ్రత కారణంగా వ్యవసాయంతోపాటు గృహ అవసరాలకు విద్యుత్ వినియోగం పెరిగింది. జిల్లాలో 77 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. జులైలో ప్రతి రోజు 5.8 మిలియన్ యూనిట్ల విద్యుత్తు డిమాండ్ లక్ష్యం ఉంది. గత ఆరు రోజుల వినియోగం పరిశీలిస్తే డిమాండ్కు సమీపిస్తోంది. 14జులైన జిల్లాలో 5.07 మిలియన్ యూనిట్లు వాడారు. వర్షాలు లేకపోవడం, బోర్ల నీటిని వినియోగించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇలానే ఉంటే విద్యుత్తు కోతల ప్రమాదం పొంచి ఉండనుంది.



ముంబయిలో సోమవారం భారీ వర్షానికి వరద నీటిలో మునిగిపోయిన అంధేరి సబ్‌వే దృశ్యం

## 681 మంది డయాలసిస్ పేషెంట్లకు పెన్షన్లు

>> చేయనుంది. 681 మంది డయాలసిస్ పేషెంట్లలో అత్యధికంగా హైదరాబాద్‌లోనే 629 మంది చికిత్స పొందుతున్నారు. మిగిలిన అన్ని జిల్లాల్లో కలిపి 52 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. వీరు పూర్తిస్థాయిలో పని చేసుకోలేకపోవడంతో వారి ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా మారాయి. ఈ మేరకు వారిని గుర్తించిన రేవంత్ ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసేందుకు సన్నద్ధం అయ్యింది. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్‌దారులు పెన్షన్ అందుకోనున్నారు.

## స్థానిక ఎన్నికలకు రెడీ

>> వృద్ధులకు పెంచుతానన్న రూ.4 వేల పెన్షన్ తో పాటు ఆడబిడ్డలకు నెలకు ఇస్తానన్న 2500 రూపాయలతో పాటు ఇతర హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న ద్రోహాలను విడమరిచి చెప్పాలన్నారు కేటీఆర్. అన్ని వర్గాల ప్రజల తరఫున గత 20 నెలల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ పైన భారత రాష్ట్ర సమితి చేస్తున్న ప్రజా పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు.

# విచారణకు రండి
### సినీ నటులు రాణా, ప్రకాశ్‌రాజ్, దేవరకొండ విజయ్, మంచులక్ష్మికి నోటీసులు ఇచ్చిన ఇడి

హైదరాబాద్, జులై 21, ప్రభవార్త: దేశ వ్యాప్తంగా అనేక మంది అమాయకులను బలిగొన్న బెట్టింగ్ యాప్‌లపై తెలుగు రాష్ట్రాల్లో నమోదైన కేసుల కు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సినీ తారలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. దక్షిణాది సినీ తారలకు ఇప్పటికే ఒకసారి నోటీసులు ఇచ్చిన ఈడీ సోమవారం నాడు మరోసారి తాఖీదులు జారీ చేయడంతో పాటు వరుసగా విచారణకు రావాలని ఆదేశం చింది. ఇందులో మొదటగా టాలీవుడ్ నటుడు రానాను ఈ నెల 23వ తేదీన విచారణకు రావాలని కోరగా ప్రకాష్ రాజ్‌ను ఈ నెల 30వ తేదీన విచారణకు రావాలని ఆదేశించింది. ఆగస్టు ఆరవ తేదీన విజయ్ దేవరకొండను, వచ్చే నెల 13వ తేదీన మంచు లక్ష్మీని విచారణకు రావాలని ఆ నోటీ సుల్లో పేర్కొంది. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి తెలంగాణలోని పంజాగుట్ట, మియాపూర్, సూర్యాపేట్, ఏపీలోని వైజాగ్‌లో నమోదైన కేసులను ఈడీ విచారిస్తుంది. ఇదే కేసుకు సంబంధించి ఈడీ అధికారులు ప్రముఖ టెక్ కంపెనీలు గూగుల్, మెటా సంస్థలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసి విచారణకు రావాలని ఆదేశించడం విదితమే. ఈ రెండు సంస్థలు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నట్లు ఈడీ ఆరోపించింది. ఈ రెండు కంపెనీల కు చెందిన వెబ్‌సైట్లలో బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన ప్రకటనలు వస్తూనే వున్నాయని, ఇది అక్రమ కార్యకలాపాల విస్తృతికి దోహదం చేస్తోంద ని ఈడీ పేర్కొంది. ఇందుకు సంబంధించి ఈ నెల 21వ తేదీన విచారణకు రావాలని ఈడీ అధికారులు ఆ సంస్థలను ఆదేశించారు.

# మీకెందుకు?

>> నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆ తీర్పును సుప్రీంకోర్టులో ఈడీ సవాల్ చేయడాన్ని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. సింగిల్ జడ్జి ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సమర్థించారని ఈడీకి బాగా తెలుసన్నారు. ఎన్నికల్లో రాజకీయ యుద్ధాలు చేసుకోనివ్వండని, ఈడీని ఎందుకు వాడుతున్నారని ప్రశ్నించారు. దురదృష్టవశాత్తూ మహారాష్ట్రలో నాకు అనుభవం ఉంది. దయచేసి మేము మాట్లాడేటట్లు ఒత్తిడి చేయవద్దు. ఒకవేళ అలాచేస్తే, మేము ఈడీ గురించి కఠిన విషయాలు చెప్పాల్సి ఉంటుందని సీజేఐ జస్టిస్ బిఆర్‌గవాయ్ వ్యాఖ్యానించారు. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు స్పందిస్తూ తాము పిటిషన్‌ను ఉపసంహరించుకొంటామని సుప్రీంకోర్టు ధర్మాసనానికి వెల్లడించారు. ఆ తర్వాత కోర్టు ఈ పిల్‌ను తిరస్కరించింది. హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి తీసుకొన్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని స్పష్టం చేసింది. మైసూరు సమీపంలోని కెసరె గ్రామంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య సతీమణి పార్వతికి 3 మూడు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆమె తన సోదరుడు మల్లికార్జునస్వామి 2010లో బహుమతిగా ఇచ్చారు. అయితే అభివృద్ధి పనుల్లో భాగంగా ముడా ఆ ల్యాండ్ స్వాధీనం చేసుకుని, పరిహారంగా 2021లో విజయనగర ప్రాంతంలో 38,283 చదరపు అడుగుల ప్లాట్లను ఇచ్చింది. కెసరెలోని భూమితో పోలిస్తే విజయనగరలో ల్యాండ్ మార్కెట్ ధర చాలా ఎక్కువ. ఈ కుంభకోణం మొత్తం విలువ రూ.3,000 రూ.4,000 కోట్ల వరకు ఉంటుంది ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ క్రమంలో సిద్దరామయ్య భార్య పార్వతికి ఈడీ సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను కర్ణాటక హైకోర్ట్ సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ ఎం.నాగప్రసన్న క్వాష్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఈ తీర్పును ఈడీ సుప్రీంలో అప్పీల్ చేయగా ఎదురుదెబ్బ తగిలింది. దర్యాప్తు సంస్థపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు, కేసు దర్యాప్తు సమయంలో కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు విచారణ సంస్థలు సమన్లు జారీచేయడాన్ని సుమోటోగా స్వీకరించిన న్యాయస్థానం సోమవారం విచారణ జరిపింది. ఈ క్రమంలో ఈడీ చర్యలు న్యాయవాద వృత్తిపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయని సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ధర్మాసనానికి తెలిపారు. తుర్కియేలో మొత్తం బార్ అసోసియేషన్ రద్దు అయ్యిందని, చైనాలో కూడా ఇలాంటి పరిస్థితులే చూశామన్నారు. భారత్ అలాంటి దిశలో వెళ్లకూడదని, కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు.

ఈ కేసుపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవాది ఇచ్చిన సలహా తప్పు అయినప్పటికీ, అతనికి ఎలా సమన్లు జారీ చేస్తారు. ఈ విషయంపై కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించాలి. జోక్యాలను క్రోడీకరించడానికి కోర్టు ఒక అమికస్ క్యూరిని నియమిస్తుంది. రాబోయే వారంలో ఈ కేసును విచారిస్తుందని సీజేఐ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. కాగా ఓ వ్యక్తి హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని ఎలా దాచాలని సీనియర్ న్యాయవాదులు అరవింద్ దతార్, ప్రతాప్ వేణుగోపాల్ న్యాయ సలహా కోరినట్లు ఆరోపణలు రావడంతో వారికి ఈడీ సమన్లు జారీచేసింది. ఈ క్రమంలో కోర్టు విచారణ జరిపింది.



# కళాశాల భవనం ఢీకొట్టిన ఎయిర్‌ఫోర్స్ విమానం

## 19 మంది మృతి, 160 మందికిపైగా గాయాలు

**డాకా, జూలై 21:** బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 'ఎఫ్7బిజిఐ' విమానం సోమవారం కళాశాల భవనంపై కూలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది ప్రాణాలు కోల్పోగా 160 మందికిపైగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో మైల్‌స్టోన్ కళాశాలలో విద్యార్థులు ఉన్నారు. విమానం కూలిన తర్వాత కళాశాలలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత సంఘటనా స్థలానికి అగ్ని మాపక, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. నేషనల్ బర్న్ ఇన్‌స్టిట్యూట్ అధికారి ప్రొఫెసర్ మొహమ్మద్ సైదుర్ రెహమాన్ మాట్లాడుతూ, మైల్‌స్టోన్ కళాశాల క్యాంపస్‌లో వైమానిక దళ విమానం కూలిపోయిందని చెప్పారు. విమానం పైలట్ సహా కనీసం 19 మంది ఈ ప్రమాదంలో మరణించారన్నారు. హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయం సీనియర్ అధికారి ప్రమాదాన్ని ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న బంగ్లాదేశ్ ఆర్మీ బృందం, అగ్నిమాపక దళం, సివిల్ డిఫెన్స్ టీమ్ వాహనాలను మోహరించి సహాయక చర్యలు చేపట్టాయి. ఢాకాలోని ఉత్తర ప్రాంతంలోని దియాబారి ప్రాంతంలోని మైల్‌స్టోన్ స్కూల్, కళాశాల క్యాంపస్‌లో వైమానిక దళ శిక్షణ విమానం కూలిపోయిందని బంగ్లాదేశ్ ఆర్మీ పబ్లిక్ రిలేషన్స్ విభాగంప్రకటన విడుదలచేసింది. మధ్యాహ్నం 1.06 గంటలకు శిక్షణ విమానం టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయిందని అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత విమానం మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పడానికి ఎనిమిది అగ్నిమాపక దళాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. మైల్‌స్టోన్ స్కూల్, కళాశాల ప్రతినిధి మాట్లాడుతూ విమానం పాఠశాల గేటు దగ్గర పడిపోయిందని చెప్పారు. విమానం కూలిపోయిన పాఠశాల ఆవరణలో తరగతులు జరుగుతున్నాయన్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విమానం పాఠశాల భవనాన్ని ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షి సద్మాన్ రుహ్సాన్ తెలిపారు. సైన్యం, అగ్నిమాపక దళం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను తల్లిదండ్రులను సురక్షితమైన ప్రదేశానికి తీసుకెళ్లారు.

## రేవంత్ 46 సార్లు ఢిల్లీకి వస్తే ప్రధానిని కలిశారు..

# రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దక్కలేదు

## పిఎం సహా కేంద్రమంత్రులంతా ఎప్పుడు సమయం కోరినా ఇచ్చారు: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 21:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 46 సార్లు ఢిల్లీకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ లభించలేదని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను మాత్రం కలిశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. ప్రధాని, కేంద్ర మంత్రులు ఆయన ఎప్పుడు కోరినా సమయం ఇచ్చారని గుర్తు చేశారు. కానీ సొంత పార్టీ ముఖ్యమంత్రికి రాహుల్ గాంధీ ఎందుకు సమయం ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చడం కేంద్రం బాధ్యత అని చెబుతున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ ఎలా తీసుకువచ్చారని నిలదీశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని అన్నారు. అసాధ్యమని తెలిసినప్పటికీ బిల్లు తీసుకురావడం సరికాదని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బిల్లు తీసుకువచ్చారని ఆరోపించారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై నిందలు వేస్తే సహించేది లేదని అన్నారు. ముస్లింలకు ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్ తొలగించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే సుప్రీంకోర్టు కూడా అనుమతించదని రామచందర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని ఎలా నడపాలనే విషయమై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు తాను ఢిల్లీ వచ్చానని ఆయన వెల్లడించారు.



# లైంగిక దాడికేసులో ఒడిశా ఎన్‌ఎస్‌యుఐ చీఫ్ అరెస్ట్

**భువనేశ్వర్, జూలై 21:** విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కాంగ్రెస్ పార్టీ ఒడిశా యూనిట్ విద్యార్థి నాయకుడు ఉదిత్ ప్రధాన్‌ను భువనేశ్వర్‌లోని మంచేశ్వర్ పోలీసులు అరెస్ట్ చేశారు. 19 ఏళ్ల విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం మార్చి 18న ఈ ఘటన జరగ్గా, జులై 20న రాత్రి 8.30 గంటలకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తన ఇద్దరు స్నేహితులతో కలిసి మాస్టర్ క్యాంటీన్ చౌక్‌లో ఉన్నప్పుడు ఉదిత్ ప్రధాన్‌ను కలిసింది. ఒక స్నేహితుడు ఆమెను ఉదిత్‌కు పరిచయం చేశాడు. అతడు తనను తాను నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) ఒడిశా అధ్యక్షుడిగా పరిచయం చేసుకున్నాడు. తర్వాత వారు ఉదిత్ వాహనంలో నయాపల్లిలోని ఒక హోటల్‌కు వెళ్లారు. అక్కడ వారు మద్యం తాగారు. బాధితురాలు మద్యం తాగేందుకు నిరాకరించింది. దీంతో ఉదిత్ ఆమెకు కూల్‌డ్రింక్ ఇచ్చాడు. అది తాగిన కాసేపటికి బాధితురాలికి మైకం కమ్మినట్టు అనిపించడంతో ఇంటికి తీసుకెళ్లమని కోరింది. అయితే, ఉదిత్, అతడి స్నేహితులు ఆమె అభ్యర్థనను తిరస్కరించారు. ఆ తర్వాత కాసేపటికే ఆమె స్పృహ కోల్పోయింది. స్పృహ వచ్చాక తనపై లైంగికదాడి జరిగినట్టు గుర్తించింది. దీంతో ఉదిత్‌ను ఆమె ప్రశ్నించగా, ఈ విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. బాధితురాలు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ నేపథ్యంలో గత రాత్రి ఉదిత్ ప్రధాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ రోజు కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఇటీవల గంజాం జిల్లాలోని గోపాల్‌పూర్ బీచ్‌లో ఒక కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం, బాలాసోర్‌లో ఫకీర్ మోహన్ కళాశాల విద్యార్థిని ఆత్మహత్య, పూరీలోని బలంగా ప్రాంతంలో 15 ఏళ్ల బాలికను చంపే ప్రయత్నం వంటి ఘటనలు ఒడిశాలో మహిళల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

# విమానప్రమాదంపై విచారణ సాగుతోంది

## ప్రాథమిక నివేదికతోనే అవగాహనకు రాలేం..

## పార్లమెంటులో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీ, జూలై 21:** అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై విచారణ జరుగు తోందని, తుది నివేదిక వచ్చేంత వరకు వేచి చూడాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. రాజ్యసభలో విమాన ప్రమాదంపై మాట్లాడిన రామ్మోహన్, విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ నిబంధనల ప్రకారమే విచారణ జరుపుతోందని తెలిపారు. ప్రాథమిక నివేదికతో ఇపుడే ఒక అవగాహనకు వచ్చినట్లు కాదని కేంద్రమంత్రి అన్నారు. విమాన ప్రమాదంపై పెద్ద ఎత్తున అసత్య ప్రచారం జరుగుతోందని విమర్శించారు. ప్రాథమిక నివేదిక, కేవలం ప్రమాదం ఎలా జరిగిందని తెలిపేందుకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. బ్లాక్‌బాక్స్‌ను విజయవంతంగా వెలికి తీశారని, దాన్ని డీకోడ్ చేసే ప్రక్రియ పూర్తిగా భారత్‌లోనే జరుగుతోందని వెల్లడించారు. తుది నివేదిక వచ్చాక మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై విదేశీ మీడియా అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సొంత అభిప్రాయాలు చెప్పకూడదని, నిబంధనల ప్రకారమే దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. విమానాలు, ఎయిర్‌పోర్ట్‌ల్లో నిత్యం తనిఖీలు జరుగుతాయన్నారు. ప్రతికూల వాతావరణం, పక్షుల వల్ల కొన్ని ప్రమాదాలు జరగవచ్చని తెలిపారు. కొన్నిసార్లు అనుకోని ఇబ్బందులు ఎదురవుతాయి. కాబట్టి నిబంధనల ప్రకారం అన్నీ తనిఖీ చేశాకే విమానం టేకాఫ్ అవుతుంది. ఎక్కడైనా నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రామ్మోహన్ అన్నారు. 90 శాతం వరకు పోస్టులు భర్తీ జరిగేలా చూస్తామని వెల్లడించారు. దేశంలో రోజుకు 5 లక్షల మంది విమానాల్లో సురక్షితంగా ప్రయాణిస్తున్నారని, విమానయానశాఖకు ప్రపంచ దేశాలతో అనేక సంబంధాలు ఉంటాయని తెలిపారు. ఇతర దేశాల నియమాలు, నిబంధనలు కూడా పాటించాలని పేర్కొన్నారు. ఈ పదేళ్లలో దేశంలోని విమానాశ్రయాలు రెండింతలు అయ్యాయని తెలిపారు. విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని విమానాశ్రయాల విస్తరణకు స్థానికంగా అనేక ఇబ్బందులు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.



## మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే

# కాళేశ్వరం కూలిందన్న ప్రచారం సిగ్గుచేటు

## కూలితే రంగనాయకసాగర్‌కు నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఆగమవుతున్నది: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే కాళేశ్వరం కూలిందని ప్రచారం చేయడం సిగ్గుచేటని.. కాళేశ్వరం కూలితే రంగనాయకసాగర్‌కు నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఆగమవుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సిద్దిపేట రూరల్ మండల ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలువల ద్వారా నీళిచ్చి కడుపు నింపిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేయడం లేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని 50 శాతం కూడా చేయలేదని..రూ.50 వేలు, రూ.లక్ష, రెండు లక్షలలోపు వారికి సైతం పూర్తిగా రుణమాఫీ కాలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని నిబంధనల పేరుతో 2 లక్షల పెన్షన్‌లు తొలిగించారని తెలిపారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేశారని సిఎం రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీలు గన్‌మెన్‌లు లేకుండా హైదారాబాద్ లోని అశోక్‌నగర్‌కు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించు కోవాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ కోసం నాకోసం పని చేసిన వారిని కాపాడుకుంటానని వచ్చేది మన ప్రభుత్వమే.. కెసిఆర్ సిఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ లక్కరసు ప్రభాకర్‌వర్మ, బూర విజయ, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య నాయకుల విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

# నీరసంతో పడిపోయిన తమిళనాడు సిఎం స్టాలిన్

## హుటాహుటిన అపోలో ఆస్పత్రికి తరలింపు



**చెన్నై, జూలై 21:** తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఉదయం చెన్నైలోని తన నివాసంలో మార్నింగ్ వాక్ చేస్తుండగా ఆయనకు ఒక్కసారిగా నీరసం వచ్చింది. దీనితో ఆయన కళ్ళు తిరిగి నేలపై పడి పోయారు. వెంటనే అతని సిబ్బంది అప్రమత్తమై ఆయన్ను చెన్నైలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆయన వెంట కుమారుడు మంత్రి ఉదయనిధి మారన్‌కూడా ఉన్నారు.వైద్య సిబ్బంది హుటా హుటిన అందుబాటులోకి వచ్చి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. స్టాలిన్‌కు సంబంధించి ప్రస్తుతం వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆయనకు ఉన్న అస్వస్థత కారణాలు అంచనా వేయడం కోసం బిపి, షుగర్, ఈసీజీ, సిటి స్కాన్ వంటి ముఖ్య పరీక్షలు చేస్తున్నారు. ఆసుపత్రి వర్గాలు ఒక హెల్త్ బులిటెన్ విడుదల చేస్తూ, ప్రస్తుతం సీఎం పరిస్థితి స్థిరంగా ఉందని వెల్లడించాయి. ఐనా సరే ముందస్తుగా జాగ్రత్త చర్యలలో భాగంగా ఆయనను పూర్తి వైద్యపర్యవేక్షణలో ఉంచామన్నారు. అపోలో మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ స్పందిస్తూ ఆరోగ్యపరంగా స్టాలిన్ కు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఆయన లక్షణాలను పరిశీలించామని, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించామని వెల్లడించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అస్వస్థత వార్త తెలిసిన వెంటనే డిఎంకె శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. మంత్రులు, పార్టీ నేతలు, అభిమానులు అపోలో ఆసుపత్రి వద్దకు చేరుకుంటున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రార్థనలు చేస్తున్నారు. డిఎంకె అధికార ప్రతినిధులు స్టాలిన్ ఆరోగ్యంపై రెగ్యులర్ అప్డేట్స్ ఇస్తున్నట్లు తెలి పారు. పలువురు రాజకీయ నాయకులు కూడా ఆయన ఆరోగ్యంపై విచారం వ్యక్తంచేస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నేడు టెట్-2025 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-జూన్-2025 ఫలితాలను నేడు(మంగళవారం) విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు విద్య శాఖ కార్యదర్శి యోగితారాణా టెట్ ఫలితాలను విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్య శాఖ అధికారులు తెలిపారు. టెట్ -జూన్-2025 పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని పాఠశాల విద్య శాఖ ఈ నెల 5న విడుదల చేసింది. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 8 సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేయడానికి అవకాశం కల్పించారు. అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు నేడు ఫలితాలను విడుదల చేయను న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు జూన్ 18 నుంచి 30వరకు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలకు 74 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 66 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. టెట్ పరీక్షలకు రాష్ట్రంలో 1,83,653 దరఖాస్తులు రాగా.. అందులో పేపర్-1కి 63,261 మంది, పేపర్-2కి 1,20,392మంది దరఖాస్తు చేసుకున్నారు. 2 పేపర్లకు 15,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షలకి 63,261 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 47,224 మంది (74.65 శాతం) పరీక్షకు హాజరయ్యారు. పేపర్-2లో భాగంగా గణితం అండ్ సైన్స్ పరీక్షకి 66,686 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 48,998 మంది(73.48 శాతం) మంది హాజరయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 53,706 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 41,207 మంది(76.73శాతం) పరీక్షలకి హాజరయ్యారు.

# అచ్యుతానందన్ మరణం తీరనిలోటు

## పిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** కేరళ మాజీ ముఖ్యమంత్రి కమ్యూనిస్టు యోధుడు వి.ఎస్ అచ్యుతనందన్ మరణం పట్ల టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న శతాధిక కమ్యూనిస్టు నేత అచ్యుతనంద్ మరణం రాజకీయాలకు తీరని లోటు అని ఆయన అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన బంధువులకు ఆయన లేని లోటు పూడ్చుకొనేందుకు సర్వశక్తివంతుడైన దైవం వారికి మనోధైర్యం నింపాలని మహేష్ కుమార్ గౌడ్ కోరుకున్నారు.

# కల్తీ మద్యం తయారీ ముఠా గుట్టురట్టు

## ఆంధ్ర పోలీసుల సమాచారంతో తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు దాడులు

## మేళ్లచెరువు, వేపల మాదారం, రామాపురంలో తయారుచేస్తున్న వైనం

## భారీఎత్తున లభ్యమైన కల్తీ మద్యం, స్పిరిట్ క్యాన్లు

## మద్యం దుకాణంలో పనిచేస్తున్న వారే సూత్రధారులు



**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), జూలై 21, ప్రభాతవార్త :** హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెరువు మండలంలో కల్తీ మద్యం తయారు చేసే ముఠా గుట్టు రట్టయింది. ఆంధ్ర పోలీస్ సమాచారంతో తెలంగాణ ప్రాంతంలోని హుజూర్నగర్ ఎక్సైజ్ పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి మూడు ప్రాంతాల్లో కల్తీ మద్యం తయారు చేసే ముఠాను పట్టుకున్నారు. కల్తీ మద్యం తయారు చేస్తున్న ప్రాంతంలో కనిపించిన స్పిరిట్ కల్తీ మద్యం సీసాలు 20 లీటర్ల క్యాన్లు కనిపించిన తీరు ఎక్సైజ్ పోలీసులను కంగు తినిపించింది. మేళ్లచెరువు మండల కేంద్రంలో, మండల పరిధిలోని వేపల మాదారం, రామాపురం గ్రామంలో ఈ కల్తీ మద్యం దందా నిర్వహిస్తున్న తీరు చూసి పోలీసులే అవాక్కయ్యారు. ఈ మూడు ప్రాంతాల్లో వివిధ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు కల్తీ మద్యాన్ని తయారు చేస్తూ రెడ్ హ్యాండెడ్ గా దొరికారు. వీరందరూ తయారు చేస్తున్న కల్తీ మద్యాన్ని ఆంధ్ర ప్రాంతానికి తరలించగా గుంటూరు జిల్లా రేపల్లెలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దీంతో తీగలాగితే డొంకంతా కదిలినట్టు దొరికిన వ్యక్తులు మేళ్లచెరువు మండలం నుంచి వచ్చినట్లు సమాచారం ఇవ్వగా, ఆ సమాచారాన్ని హుజూర్నగర్ ఎక్సైజ్ పోలీసులకు అందించారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు మేళ్లచెరువు, వేపల మాదారం, రామాపురం గ్రామంలో దాడులు చేసి కల్తీ మద్యం తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో శంకర్ అనే వ్యక్తి స్థానికంగా ఉన్న నూకల ప్రకాష్ వ్యక్తి యొక్క రైస్ మిల్ లో కల్తీ మద్యం తయారు చేస్తూ ఆంధ్ర ప్రాంతానికి సరఫరా చేస్తున్నట్లు తేలింది. రైస్ మిల్లులో భారీ ఎత్తున కల్తీ మద్యం లభ్యమయింది. కల్తీ మద్యం తో పాటు 40 కాటన్ల కల్తీ మద్యం సీసాలు, మద్యం తయారీకి ఉపయోగించే 830 లీటర్ల స్పిరిట్ కూడా లభ్యమైనట్టు తెలిసింది. వేపల మాదారం గ్రామంలో లొడంగి నవీన్ ఇంట్లో కూడా కల్తీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు మండల కేంద్రమైన మేళ్లచెరువులో నాగరాజు అనే వ్యక్తి నుంచి కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ముగ్గురు వ్యక్తులు కూడా వివిధ మద్యం దుకాణాల్లో పనిచేసిన అనుభవాన్ని ఆధారంగా చేసుకుని ఈ కల్తీ మద్యం దందాకు పాల్పడ్డట్టు తెలుస్తోంది. కల్తీ మద్యం తో పాటు ఏపీ 07 డి జెడ్ 6789 నెంబర్ గల కారు ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ కల్తీ మద్యం తయారీ హుజూర్నగర్ తో పాటు కోదాడ నియోజకవర్గంలో కూడా పలు ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం. వీటిపై కూడా ఎక్సైజ్ పోలీసులు కూపి లాగుతున్నట్లు తెలిసింది.

# హెచ్‌సిఎ అక్రమాల్లో కెటిఆర్, కవిత ప్రమేయం

## తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి ఆరోపణ

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాల్లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ప్రమేయముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) కార్యదర్శి గురువారెడ్డి ఆరోపిం చారు. పదేళ్లుగా రాష్ట్రంలోని క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారని.. చాలా మందికి క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారని విమర్శించారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కెటీఆర్, కవితతో పాటు హెచ్సీఏ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంపత్‌కుమార్‌ను తక్షణమే విచారించాలన్నారు. వారి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరిగిందన్నారు. సమ్మర్ క్యాంపులను ఉచితంగా నిర్వహించాలని కానీ డబ్బులు తీసుకున్నారని దానికి మావద్ద ఆధారాలున్నాయని ఆడబ్బంతా ఎక్కడికి పోయిందో సమాదానం చెప్పాలన్నారు. అవకాశాల కోసం తెలంగాణ క్రికెటర్లు ఎదురు చూస్తున్నారని హెచ్‌సిఏలో జరిగిన అక్రమాల వివరాలను సీఐడీ, ఈడీకి అందజేస్తామన్నారు. హెచ్సీఏ కార్యవర్గాన్ని రద్దు చేయాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. క్రికెట్‌కు సంబంధం లేని జగన్మోహన్ రావు, ఎలా అధ్యక్షుడు అయ్యారు? ఆయన వెనుక కేటీఆర్, కవిత ఉన్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా ఓట్లు వేస్తారు? ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ఎన్నికల్లో పాల్గొన్నారు. 155 క్రికెట్ అసోసియేషన్లు యాక్టివ్‌లో లేవని అలాంటి వాటికి ఎన్నికలు ఎలా నిర్వహించారు? వెంటనే ఎన్నికలు రద్దుచేసి క్లబ్బులను ప్రక్షాళన చేయాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు.

# వివేకా హత్య కేసులో సిబిఐ అభిప్రాయాన్ని కోరిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు పలు అంశాలపై సిబిఐ తన అభిప్రాయాలను తెలపాలని కోరింది. వివేకా హత్య కేసులో కడప ఎంపి వై.ఎస్ అవినాష్ రెడ్డి సహా పలువురు నిందితులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ ఇవ్వడం తెలిసిందే. తెలంగాణ హైకోర్టు తీర్పును వివేకా తనయ సునీత రెడ్డితో పాటు సిబిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేయడం విదితమే. వివేకా హత్య కేసులో కీలక నిందితులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ ఇవ్వడం సరికాదని సునీతా రెడ్డితో పాటు సిబిఐ వేరు వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా ఇదే అంశమై సుప్రీం కోర్టులో సోమవారం ఉదయం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం సిబిఐ నుంచి కొన్ని అంశాలలో అభిప్రాయాలను కోరింది. వివేకా హత్య కేసులో ఇంకా వి చారణ అవసరం అని సిబిఐ భావిస్తోందా...? దీంతో పాటు కడప సెషన్స్ కోర్టులో ఏపి ప్రభుత్వం వేసిన క్లోజర్ రిపోర్టుపై మీ అభిప్రాయం ఏమిటి...? కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏకకాలంలో కొనసాగించే అవకాశం వుందా? ఈ అంశాలపై సిబిఐఅభిప్రాయాలను తెలపాలని సుప్రీంకోర్టు కోరింది.వీటిపై సిబిఐ అభిప్రాయాలను వెల్లడించిన తరువాత వైసిపి ఎంపి అవినాష్ రెడ్డి సహా ఇతరుల బెయిల్ రద్దుపై విచారి స్తామని ధర్మాసనం తెలిపింది. దీనిపై తదుపరి విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది.



ఆస్పత్రిలో చికిత్స అందుకుంటున్న మోర్గి మోడల్ స్కూల్ విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# మోర్గి మోడల్ స్కూల్‌లో ఫుడ్ పాయిజన్

## 11 మంది విద్యార్థినులకు అస్వస్థత

**నాగల్‌గిద్ద, జూలై 21, ప్రభాతవార్త:** ఫుడ్‌పాయిజనింగ్‌తో 11 మంది విద్యార్థినులు అస్వస్థలకు గురైన సంఘటన సోమవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజక వర్గంలోని నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి గ్రామంలోని చోటు చేసుకుంది. కళాశాలలో 70 విద్యార్థినులు విద్యను అందుకుంటున్నారు. ఆదివారం విద్యార్థినులకు భోజనంలో అందించేందుకు చికెన్ తెచ్చి రాత్రి 9 గంటలకు వండేందుకు చికెన్‌ను కడుగుతుండగా దుర్వాసన రావడంతో విద్యార్థినులు అక్కడికి చేరుకుని చికెన్ వండవద్దని సూచించినా అవేమి పట్టించుకోకుండా వంట మనిషి చికెన్‌కు వండి విద్యార్థినులకు వడ్డించారు. రాత్రి10 గంటలకు చికెన్ భోజనం చేసిన విద్యార్థులకు ఫెడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లో మెట్రిన్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ సువర్ణలు లేకపోవడంతో విద్యార్థినులకు వాచ్‌మెన్ ఆటోలో నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో విద్యార్థినులు చికిత్స అందుకుం టున్నారు.

**పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

నారాయణఖేడ్‌లోని ఏరియా ఆసుపత్రిలో మోర్గి మోడల్ కళాశాల విద్యార్థినులు ఫుడ్ పాయిజనింగ్‌లో అస్వస్థతకు గురై చికిత్స అందుకుంటున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం ఆసుపత్రికి చేరుకుని విద్యార్థినులకు అందుతున్న వైద్య సేవలపై విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటిడెంట్ రమేష్‌కు ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థినులు అస్వస్థతకు గల కారణాలను ఎమ్మెల్యే కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణను అడిగి తెలుసుకున్నారు.


తెలంగాణ ప్రభుత్వం

నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ

హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో గల జలసౌధ భవన సముదాయము యొక్క వార్షిక నిర్వహణ సంవత్సరం 2025-26 (సివిల్, వాటర్ సప్లై వర్క్స్, హౌస్ కీపింగ్ మరియు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్స్, రోడెంట్ కంట్రోల్ ట్రీట్‌మెంట్ మరియు శానిటైజేషన్). ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నెం. 02/2025-26, తేదీ: 11.06.2025 ద్వారా బిడ్లను ఆహ్వానించడమైనది. టెండరు స్వీకరించు ఆఖరు తేదీ మరియు సమయం: 30.07.2025 మ.3.00గం. వరకు. అంచనా విలువ: రూ.60.33 లక్షలు. గమనిక: మిగతా వివరముల కొరకు తేది: 22.07.2025 www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/-, పుష్కర్ కుమార్, పర్యవేక్షక అభియంత, I&CADD., ఇరిగేషన్ సర్కిల్, రెడ్‌హిల్స్, హైదరాబాద్. ఫోన్: 040-23394218.

DIPR.NO. 5313-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 19.07.2025

వార్త

ఏ రాయిని విసిరాం అని కాదు చూడాల్సింది. యుద్ధానికి అది తనవంతు సాయం చేసిందా లేదా అనేది చూడాలి.

న-విండ్సర్

# ఉరి గురి?

పాకిస్థాన్‌లో ఇక మరణ శిక్షలుండవు. ఇక నేరగాళ్లు చెల్లాచెదురుగా విజృంభించవచ్చునేమో! అనుమానం రాక తప్పదు. పాక్ పార్లమెంటు క్రిమినల్ (అమెండ్‌మెంట్) 2025 చట్టంగా ఆమోదం పొందిన 'న్యాయ సవరణలు' మంచివే అనుకుందాం. కానీ భయం భక్తీ లేకపోతే ఎవరైనా, ఎంతకైనా తెగించి రెచ్చిపోయే కలికాలంలో ఉన్నాం కదా! ఆలోచించాలి. అవి ఎవరి సంస్కరణకు ఉపయోగపడతాయో! ప్రస్తుత పాకిస్థాన్‌లో సవరణ బిల్లు టెర్రరిస్టులకు హైజాకర్లకు ఆశ్రయం ఇవ్వడం, మహిళలకు బహిరంగంగా వలువలూడదీయడం వంటి నేరాలకు గతంలో ఉన్న మరణశిక్షను యావజ్జీవ ఖైదుగా మార్చారు. ఈ బిల్లును పాక్ హోంశాఖ సహాయ మంత్రి తలాల్ చౌదరి పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 354 ఎ, 402సి లలో సవరణ బిల్లు ప్రతిపాదించి నెగ్గించుకున్నారు. ఈ బిల్లు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించేవారికీ మరణశిక్ష రద్దు చేస్తోంది. అంటే భారతదేశం భయపడుతున్నట్లుగానే ఏ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టినా పాక్ రక్షణలో ఉన్న ఉగ్రవాదులకు పాకిస్థాన్ దేశ చట్టాల ప్రకారమే శిక్షలు ఉంటాయనే మిషతో వారిని జీవించినంతకాలం బతికించాలనే ఉద్దేశం కనపడుతోంది. మహిళలను వివస్త్రను చేసిన వారికి ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన వారికి మరణశిక్ష లేదంటే ఇకపై దుష్కృత్యాలకు పాల్పడే వారిని పరోక్షంగా కఠినశిక్షల నుంచి తప్పించినట్లే. అంతే కాదు ఇలాంటి నేరాలకు ఇక ఎంతో తేలికగా పాల్పడవచ్చునని దాయాది దేశ సంజాతులకు పరోక్ష వెసులుబాటే కదా! మరో అర్థం తారసిల్లదు. పాక్ సెనేట్‌లో తీవ్రంగా చర్చించినా వ్యతిరేకించిన వారి అభిప్రాయాలకు విలువ లేకుండా పోయింది. ఇలా ఎందుకు జరిగిందో పాకిస్థాన్ నడిగితే 'యూరోపియన్ యూనియన్‌తో పాకిస్థాన్‌కు ఉన్న 'జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ ప్లస్' వాణిజ్య ఒప్పందమేనంటారు. కానీ ప్రపంచమంతా నివ్వెరపోయేటట్లు 'ఉగ్రవాదులను ఉరి' నుంచి తప్పించే చర్యగా భావించాలి. ఎన్నో కేసుల క్షమాభిక్ష విషయంలో కూడా రాష్ట్రపతిని కోరేవారెవరూ తాము అమాయకుడిని కావున తమ శిక్షరద్దు చేయమని అడగడం కన్నా తమకు న్యాయం జరుగనందున కోర్టులు వేసిన కఠిన శిక్షల్ని తగ్గించమనే కోరుకుంటారు. ఎందుకంటే 'క్షమ' అనేది శిక్షల్ని రద్దు చేసేందుకు కాదు. కఠిన శిక్ష సాధారణ శిక్షల మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించి వ్యక్తుల్ని సంస్కరించడానికి కాన న్నది న్యాయ శాస్త్రాలు చెబుతున్నాయి. కుటుంబపరువు దక్కించుకోవాలనే. అదేదో తీవ్రమైన నేరాలు చేసిన వారి శిక్ష రద్దు చేయడమంటే ఎన్ని ఘోరాలు నేరాలు చేసినా ఎక్కడో అక్కడ ఉపశమనం దొరుకుతుందిలే అనే తప్పుడు సంకేతాలు నేరస్తులకు వెళ్తాయనే. ఆంధ్రప్రదేశ్‌లోని చిలుకలూరి పేట బస్సు దహనం కేసులో ముద్దాయిలకు క్షమాభిక్ష లభించినా, పార్లమెంట్‌పై దాడి కేసులో అఫ్జల్ గురుకి క్షమాభిక్ష తిరస్కరించినా ఈ సిద్ధాంతాలకులోబడే జరిగింది. తనవారు పరవారని కాదు. ఆదిమ యుగంలో ఉన్నట్లు కన్నుకుకన్ను, పన్నుకుపన్ను అనే శిక్షలు కాల క్రమేణా మారిపోయి కారాగారా వాసానికి పరిమితమయ్యాయి. అందులోనే నేర తీవ్రతను బట్టి మరణశిక్ష, యావజ్జీవ ఖైదులుగా పొడిగించారు. ఏది ఏమయినా జీవించేహక్కు, యావజ్జీవం బందిఖానాలో ఉండడం వీటిలో ఏదైనా కఠినత్వమే. ఎవరూ కావాలని జీవించే హక్కును కాలరాసుకోరు అనే సూత్రానికి లోబడి 'ఉరిశిక్ష'లు రద్దుచేయాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారు ఎంతో కాలంగా పోరాడుతున్నారు. భారీ జరిమానాలకు, జీవిత ఖైదులకు లొంగని, భయపడని నేరస్థులకు మరణశిక్ష వేయడం ఎంతమాత్రమూ అభ్యంతరం ఉండకూడని విషయం. మనిషిలోనే నేరాలోచన రాకుండా ఉండేందుకు, నేర ప్రవృత్తిని దూరం చేసేందుకు ఉపయోగపడే 'కఠిన శిక్ష'లే లేకుంటే కట్టుబాటుకో చట్టానికో లొంగే పరిస్థితి ఉండదు. ఎందుకంటే ఇతిహాసాల నీతి వాక్యాలకో, ఉప నిషత్తుల సారాంశాలకో, పేదరాశి పెద్దమ్మల కథల నీతి వాక్యాలకో లొంగే పరిస్థితులు కనపడటం లేదు. యూరోపియన్ దేశాలతో వాణిజ్య సంబంధాలను పెంపొందించ డానికి, అంతర్జాతీయ వేదికపై పాక్ విశ్వసనీయలకు రెండు తీవ్రమైన శిక్షలను తప్పించాలనుకోవడం తిరోగ మన చర్య. అడుగడుగునా పరిశోధనల్లో అధునాతన సాంకేతికతను స్వీకరిస్తున్నా భారతీయులకు దాయాది దేశం చేస్తున్న న్యాయసంస్కరణలు ఏమాత్రం రుచించడం లేదు. మహిళలను వివస్త్రను చేయడమంటే ఆ నేరం హత్యతో సమానమైన నేరంగా పరిగణించాలని అందుకు మరణశిక్షే సమంజసమని సెనేటర్లు వాదించినా పాక్ సభలో ఆ దేశపు న్యాయశాఖామంత్రి అందుకు అంగీకరించలేదు. దానికి కారణం తమ రహస్య అజెండా కారణం గానే. సభలో జరిగిన చర్చకు ఆమాత్యుల వారి సమాధానమేమిటంటే మరణశిక్షల అమలులో లేని యూరప్‌లో నేర నియంత్రణ సజావుగానే ఉందికదా! అని సరిపెట్టుకున్నారు. ఇక్కడ యెమెన్‌లో 2017 నుండి ఒక హత్య కేసులో సనా సెంట్రల్ జైల్లో మగ్గుతున్న కేరళ నర్సు 'నిమిష ప్రియ' కేసు కూడా ప్రస్తావనార్హం. మరణశిక్ష పడిన 'నిమిష'ను ఆ శిక్షనుంచి తప్పుకోవాలంటే షరియా ప్రకారం ఉన్న ఒక అవకాశం దక్కినట్లయింది. కేవలం బ్లడ్‌మనీ (దియా)తో హతుని కుటుంబం నుంచి క్షమాభిక్ష లభిస్తే 'ఉరి' తప్పుతుంది. ఆమెకున్న అన్ని అవకాశాలు మూసుకుపోయినా ఆమె ప్రాణం 'ఉరికంబ' ఛాయల్లో ఊగిసలాడుతోంది. ఆమెకెవరు రక్ష. శిక్షల విషయంలో ప్రపంచమంతా ఒక ప్రాతిపదిక లేకపోవడాన్ని కూడా చర్చించాల్సిన సమయం ఆసన్నమైంది.

తొందరపడి నిర్ణయాలకు రావడం అనే వ్యాయామాన్ని మాత్రమే మూర్ఖులు చేస్తుంటారు.



విలియం కౌంటన్

ఏదైనా పనిలో లీనమైనప్పుడు ప్రపంచంలోని ఏ విషయమూ నీలో చొరబడకూడదు. చాలా మంది వినోద సమయాలలో కూడా దీనిని పాటించలేరు.



చార్లెస్ కింగ్స్‌లే

## ప్రజావాక్కు



### ఓటర్ల జాబితా పారదర్శకంగా జరగాలి

ఇటీవల బీహార్ రాష్ట్రంలో ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ తీవ్ర వివాదానికి దారి తీసింది. వేలాది మంది ఓటర్ల పేర్లు తొలగింపబడ్డాయన్న ఆరోపణలు, తప్పుడు చేర్పులు, ఒకే వ్యక్తికి బహుళ ఓటింగ్ హక్కులు లభించడం లాంటి విషయాలు ప్రజల్లో ఆందోళనకు దారి తీశాయి. ఒకవర్గం పేర్లు ఉద్దేశపూర్వకంగా తొలగించడమో, మరొక వర్గం పేర్లు చేర్చడమో జరిగితే ప్రజాస్వామ్యంలో విశ్వాసం నశిస్తుంది. ఈ నేపథ్యంలో, ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలి. జాబితా తయారీకిపూర్తి పారదర్శకత అవసరం. ఓటరు వివరాల ఆధార్ లింకింగ్, చిరునామా ధృవీకరణ వంటి ప్రక్రియలు నిబంధనల ప్రకారం, ప్రజల అవగాహనతో జరగాలి. ప్రతి మార్పుపై సంబంధిత వ్యక్తికి ముందుగానేసమాచారం ఇవ్వాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సాంకేతిక సమస్యలు సరిదిద్దాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రతీ నెల ఒకే రోజు క్లస్టర్ స్థాయిలో స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నది. అయితే సమావేశాల రోజున ఉపాధ్యాయుల హాజరు నమోదు, సమావేశపు ఫీడ్ బ్యాక్ విషయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో కూడా ఇదేవిధంగా జరిగింది. కానీ విద్యా శాఖ సరిదిద్దడంలేదు. జూన్ నెలలో 19వ తేదీన జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌లో సాయంత్రం ఐదు గంటలనుండిఉపాధ్యాయుల ఫేషియల్‌అటెండెన్స్ యాప్‌లో హాజరు పడక ఉపాధ్యాయ ఇబ్బందులుపడ్డారు. ఉపాధ్యాయులు ఫెసియల్ అటెండెన్స్ ఇన్ టైమ్ మధ్యాహ్నం ఒంటి గంటకు రిపోర్ట్ చేయాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

- వాసిలి సురేష్,నెల్లూరు జిల్లా

### వృథా ప్రయాస

నదీ జలాల పంపకం పైన బనకచర్ల ప్రాజెక్టు విషయం పైనా కేంద్రమంత్రి ద్వారా వివాద పరిష్కారం చేసుకుందామని రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులైన చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి,ఢిల్లీ వెళ్లి సమస్యను అలాగే వదిలి పెట్టి వచ్చేసారు. పరిష్కారానికి ఓ కమిటీని వేస్తారట. ఆ కమిటీ రిపోర్టు ఎప్పటికి వస్తుందో, వచ్చినా ఆమోదయోగ్యంగా ఉంటుందో లేదో చెప్పలేం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### హిందీ భాషపై స్టడీ అవర్స్ అవసరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అత్యధిక సీట్లు సాధించినప్పటికీసొంతంగా ప్రభుత్వాన్ని పెట్టుకోగలసత్తా ఉన్నప్పటికీ రాజకీయ అవసరాలు కారణంగా భారతీయ జనతా పార్టీ జనసేన పొత్తుపెట్టుకున్నది. సొంత నిర్ణయాలు తీసుకునే స్థితిలో పడిపోయింది. ఈ నేపథ్యంలో హిందీ భాషను దక్షిణాది మీదరుద్దడానికి పవన్ కళ్యాణ్‌ను పావుగా ఎంచుకున్నది. విద్యా శక్తి పేరుతో ఐఐటి కాన్సెప్టును నాలుగు నుండి ఐదు వరకు స్టడీ అవర్‌గా మ్యాథమెటిక్స్ సైన్స్ ఇంగ్లీష్‌లతో సక్సెస్ స్టోరీలను చెబుతూ, కెరీర్ గైడెన్స్ చేస్తూ మోటివేట్ చేయమని సూచించింది. ఈనేపథ్యంలో హిందీ భాష ఆరవతరగతి నుండి పదవ తరగతి వరకు చదివినప్పటికీ హిందీలో ఏ విద్యార్థిని విద్యార్థి అనర్గళంగా మాట్లాడలేక పోతున్నారు. విద్యాశాఖ పర్య వేక్షణా అధికారులు కూడా హిందీ వారికి రాక హిందీ టీచర్ ఏమి రాస్తాది రైట్ అని టిక్ పెట్టి వెళ్ళిపోతున్నారు.

-వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

### స్థానికులుగా నిరూపించుకోవాలి

బీహార్‌లో ఎన్నికల ఓటర్ లిస్ట్ సమగ్ర సవరణ పేరుతో ఎన్నికల సంగం చేపట్టిన విధానం విమర్శలకు దారితీస్తోంది. ఏ విలువలు అయితే టీఎన్ శేషన్‌కాలంలో ప్రవేశపెట్టబడ్డాయో తరవాత జెఎం లింగ్డో వంటి వారు కొనసాగించి దాన్ని పటిష్టం చేశారు. కానీ గత దశాబ్దకాలంగా ఆ సంస్థ తన స్వతంత్రతను కోల్పోయింది. బీహార్ అంటే ఒక సుసంపన్నం అయిన రాష్ట్రం కానీ ప్రభుత్వ పాలసీలు లోపంవల్ల బీహార్ దేశంలోని ఒక వలసల రాష్ట్రంగాపెరుపొందింది. మరిఎన్నికల అధికారి జూలై 15 నుండి జూలై 28 వరకు ఇచ్చిన టైం లోనే మేము బీహార్ గడ్డ మీదేపుట్టాంఅనిరుజువు చేసుకోవాల్సి నదుస్థితిలోకి నెట్టబడ్డారు.

- భారత అవినాష్, జనగామ

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

రైతులు తమ పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో పశువులకు లంపి స్కిన్ మిగతా వ్యాధులు మేకలు గొర్రెలకు కూడా రోగాలు వస్తాయి. ముద్దపు చర్మవ్యాధి సోకితే పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పాల దిగుబడి గణనీయంగా తగ్గి రైతుకు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది. పశు సంవర్ధక శాఖ గ్రామాల వారీగా పశువులకు ముందస్తు టీకాలు వేయాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు రాష్ట్రాల నీటి వాటాలు తేలేదెప్పుడు?

***70వేల టీఎంసీల నీటితో దేశాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పిన వారికి ఒక్క ప్రాజెక్టును కూడా సరిగ్గా కట్టడం చేతకాలేదు. తాను జాతీయ రాజకీయాల్లోకి వెళితే దేశం మొత్తం నీళ్ల ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం పాటుపడిన కెసిఆర్ వాటర్‌మ్యాన్ అయితే, రేవంత్‌రెడ్డి వాటామ్యాన్ అని హరీష్‌రావు విమర్శిస్తున్నారు. ఎవరు వాటర్ మ్యానో, వాటా మ్యానో లక్షకోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందు కు పనికిరాకుండాపోయి, వెక్కిరిస్తుండటం చూస్తే ప్రజలం దరికీ అర్థమవుతుంది. కాళేశ్వరం నిర్మించిన ఇద్దరు ఇంజి నీర్ల ఇళ్లల్లో సోదాలు చేస్తే రూ.300 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు ఏసీబీ దాడుల్లో గుర్తించారు. పిల్ల చేపల ఇళ్లల్లోనే ఇన్ని ఆస్తులు దొరికితే తిమింగలాలైన మీరు ఎన్నివేల కోట్లు కాళేశ్వరంలో దోచుకున్నారో ప్రజలకు అర్థమవుతున్నది.***

డా.కవ్వంపల్లి సత్యనారాయణ

ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ గోదావరి బనకచర్ల ప్రాజెక్టును తలపెట్టిన విషయాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దానిని ఆపటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి కేంద్రానికి ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలుమార్లు లేఖలు రాశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలవనరులశాఖ మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని వినతిపత్రాలు ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలు స్వీకరించింది. అవసరమైతే దీనిపై న్యాయపోరాటం చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులను ఒడ్డుతున్నది. ముఖ్యమంత్రి తెలంగాణ నీటి ప్రయోజనాలకు మరణశాసనం రాస్తున్నారని హరీష్‌రావు మాట్లాడుతున్నారు. బనకచర్లకు బీజం పడిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలించిన 2016 సంవత్సరంలో. అదే సంవత్సరం ఈప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ మొదట జీ.ఓ. ఇచ్చింది. అప్పుడు మౌనంగా ఉండి ఈరోజు అధికారం పోయింది కాబట్టి ఏదోవిధంగా వివాదం సృష్టించి రాజకీయ లబ్ది పొందటానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం విడిపోయిన తరువాత రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ విషయమై 2016, సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగిన తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడుతూ.. కృష్ణానదిలో రెండు రాష్ట్రాల్లో ఇప్పటికే ఉన్న, ప్రస్తుత నిర్మాణంలో ఉన్న ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం వెయ్యి టీఎంసీలకుపైగా నీరు అవసరమవుతుందని, అదే సమయంలో గోదావరినదిలో ప్రతీ సంవత్సరం 3వేల టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వృథాగా వెళుతోందని, ఆ నీటిని ఆంధ్రప్రదేశ్ ఎలా సమర్థంగా వినియోగించాలో నిర్ణయించుకోవాలని కెసిఆర్ పేర్కొన్నారు. దీనితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 మార్చిలో జీ.ఓ.ఆర్.టి.నం. 230జారీ చేసి గోదావరి వరద నీటిని కృష్ణానదిలోని ప్రకాశం బ్యారేజీకి తరలించి, ఆపై కొమ్మ మూరు కాలువ ద్వారా పెదగంజం వరకు, అక్కడి నుండి గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా పంపించి, అక్కడి నుండి పెన్నా నదిలోని సంగం బ్యారేజీకి చేర్చే పథకానికి డీపీఆర్ తయారీకి వ్యాప్కో సంస్థను నియమించింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదే సంవత్సరం జూన్ నెలలో జీ.ఓ.ఎం.ఎస్. నం.51 జారీ చేసి, గోదావరి పెన్నా నదుల అనుసంధానికి ఫేజ్ 1లోని పనులకు రూ. 6020.15 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఆ తర్వాత 2018 సెప్టెంబర్ 5న జీ.ఓ.ఎం.ఎస్. నం. 98 ద్వారా కొన్ని మార్పులతో ఫేజ్1లోని గోదావరి పెన్నా నదుల అనుసంధానం పనుల కోసం రూ.6020.15 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చింది. తదుపరి అక్టోబర్‌లో ఈ ప్రాజెక్టు కింద రెండు ప్యాకేజీలకు టెండర్లు ఆహ్వానించారు. దీనితో గోదావరి, పెన్నా లింక్ ప్రాజెక్టు కింద పనులు పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమయ్యారు. దానికి ఇరు రాష్ట్రాల మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర అధికారుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది. ఇది రహస్యంగా జరిగిన సమావేశం కాదు. ఇందులో రాష్ట్రాల మధ్య నీటివాటాల విషయం చర్చకు రాలేదు. రాయలసీమకు గోదావరి నీటిని జగన్ చేతిలో కెసిఆర్ పెట్టారనే విషయం వీడియోలు, వివిధ పత్రికల్లో వచ్చి అప్పటి వార్తలు బహిర్గతమవటంతో.. ప్రజల దగ్గర బీఆర్‌ఎస్‌కు ముఖం చెల్లటం లేదు. దీనిని కప్పిపుచ్చుకోవటం కోసం చంద్రబాబు



కు గోదావరి నీటిని రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేస్తున్నారు. దీనికి ఆధారాలు మాత్రం చూపటం లేదు. రాష్ట్రం విడిపోయిన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణాపై ఎటువంటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో ఆ నీటిని తెలంగాణ ఉపయోగించుకోలేకపోయింది. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో 1200 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్ అదనంగా తరలించుకుపోయింది. బీఆర్‌ఎస్ పాలనలో నీటిపారుదల రంగంపై పదేండ్లలో 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి, 199 టీఎంసీల నీటిని ఉపయోగించింది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చేనాటికి కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే.. ఎస్‌ఎల్‌బీసీకి 40 టీఎంసీలు, కల్వకుర్తికి 40, నెట్టెంపాడుకు 25, పాలమూరు రంగారెడ్డికి 95, డిండికి 30 టీఎంసీల నీళ్లు మనం ఉపయోగించుకునే అవకాశం ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో ఈప్రాజెక్టులు 70, 80శాతం పూర్తయ్యాయి. అయినా వాటిలో ఒక్క ప్రాజెక్టును కూడా బీఆర్‌ఎస్ పూర్తి చేయకపోవడంతో దక్షిణ తెలంగాణ తీవ్రంగా నష్టపోయింది. కృష్ణాలో ఆంధ్రప్రదేశ్‌కు 512టీఎంసీలు, తెలంగాణకు 299టీఎంసీల చొప్పున నీటి కేటాయింపులకు 2016వ సంవత్సరంలో కెసిఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆంధ్రా 66, తెలంగాణ 34 నిష్పత్తిలో నీటిని వాడుకోవాలి. కానీ, ఏ ఒక్క సంవత్సరం కూడా తెలంగాణ తనకు కేటాయించిన నీటిని వాడుకోలేదు. గత 10ఏళ్లలో ఆంధ్రా మాత్రం ప్రతీ సంవత్సరం తనకు కేటాయించిన నీటికన్నా ఎక్కువ నీటిని తరలించుకుపోతుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తుండిపోయింది. బీఆర్‌ఎస్ పాలనలో కృష్ణాపై ప్రాజెక్టులు పూర్తిచేయకపోవడంతోనే మనకు రావాల్సిన వాటా నీటిని కూడా ఉపయోగించుకోలేక పోయాము. నాడు అధికారంలో ఉండి అలయ్ బలయ్ చేసుకుంటూ ఇరు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలపై దృష్టిపెట్టలేదు. నేడు ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టగానే ఇరురాష్ట్రాల మధ్యజల వివాదాల పేరిట సెంటిమెంట్‌కు ఆజ్యం పోసి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. కృష్ణా నీటిని అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌కు కెసిఆర్ తాకట్టుపెట్టినందుకే కృష్ణా బేసిన్ జిల్లాల్లోని మొత్తం 36 సీట్లలో మూడింటిని మాత్రమే బీఆర్‌ఎస్ గెలిచింది. కృష్ణా పరివాహక ప్రాంతం 70శాతం తెలంగాణలో ఉంటే, 30శాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, కనుక కృష్ణా జలాల్లో 70శాతం వాటా తెలంగాణకు కావాలని, గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలను తేల్చిన తరువాతే ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం బనకచర్లపై నిరభ్యంతర పత్రం ఇవ్వాలని గతమార్చిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌ను కలిసి విన్నవించారు. సముద్రంలో కలుస్తున్న 70వేల టీఎంసీల నీళ్ల వృథాగా కలిసిపోతున్న 3వేల టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించి ఉపయోగించుకోవాలని కెసిఆర్ జగన్‌కు సలహా ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలోని నదులలో ప్రవహించే నీటిపైనే కాదు.. దేశం మొత్తం ప్రవహించే నీళ్లపై సైతం నీటిపారుదల ఇంజినీర్ కెసిఆర్ అధ్యయనం చేసి నిగ్గు తేల్చారు. దేశంలో నీటి వసతి లేక దాదాపు 44కోట్ల ఎకరాల భూమి సాగుయోగ్యం కావడం లేదు. కనీసం ప్రతి ఏటా సముద్రంలోకి పోతున్న 70వేల టీఎంసీల నీటిని వాడుకోలేకపోతున్నామని, తాగు, సాగునీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 2022వ సంవత్సరంలో టీఆర్‌ఎస్ పార్టీని బీఆర్‌ఎస్‌గా మార్చేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. జాతీయ పార్టీ పెట్టి దేశ రాజకీయాల్లో చక్రం తిప్పడం ద్వారా ఈ నీటిని పొలాలకు మళ్లిస్తానని ఆయన ప్రగల్భాలు పలికారు. రాష్ట్రంలో కట్టక కట్టక ఒకే ఒక్క కాళేశ్వరం లాంటి పనికిమాలిన ప్రాజెక్టు కట్టి తెలంగాణ ప్రజల నెత్తిన పెట్టారు. దేశ రాజకీయాల్లో చక్రంతిప్పు తానని అత్యాశకు పోయిన కెసిఆర్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా చుట్టి తెలంగాణ ప్రజలు ఆయనను ఫామ్ హౌస్‌కు పరిమితం చేశారు. 70వేల టీఎంసీల నీటితో దేశాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పిన వారికి ఒక్క ప్రాజెక్టును కూడా సరిగ్గా కట్టడం చేతకాలేదు. తాను జాతీయరాజకీయాల్లోకి వెళితే దేశం మొత్తం నీళ్ల ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం పాటుపడిన కెసిఆర్ వాటర్‌మ్యాన్ అయితే, రేవంత్‌రెడ్డి వాటామ్యాన్ అని హరీష్‌రావు విమర్శిస్తున్నారు. ఎవరు వాటర్ మ్యానో, వాటా మ్యానో లక్షకోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు పనికిరాకుండాపోయి, వెక్కిరిస్తుండటం చూస్తే ప్రజలందరికీ అర్థమవుతుంది. కాళేశ్వరం నిర్మించిన ఇద్దరు ఇంజినీర్ల ఇళ్లల్లో సోదాలు చేస్తే రూ.300 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు ఏసీబీ దాడుల్లో గుర్తించారు. పిల్ల చేపల ఇళ్లల్లోనే ఇన్ని ఆస్తులు దొరికితే తిమింగలాలైన మీరు ఎన్నివేల కోట్లు కాళేశ్వరంలో దోచుకున్నారో ప్రజలకు అర్థమవుతున్నది.

# ఇజ్రాయెల్ యుద్ధకాంక్షకు బలిపశువులెందరో!

మహమ్మద్ ఆరిఫ్

నేను ఎన్నో మృతదేహాల వాసనను భరించాను. ఇక భరించలేను..ఇది గాజా స్ట్రిప్, లెబనాన్ యుద్ధంలో సైనిక సేవల్లో పాల్గొన్న డానియర్ ఎడ్రీ అనే సైనికుడు తన సూసైడ్ నోట్‌లో రాసిన వ్యాఖ్యలివి. ఒక ఏడాది పాటు ఆపరేషనల్ డ్రైవర్‌గా పని చేసిన అతను తీవ్రమైన మానసిక ఒత్తిడితో 2025లో జూలైలో బిరియా ఫారెస్ట్‌లో తన ను తాను గన్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గాజాలో యుద్ధ అనుభవాల తర్వాత ఎలిరాన్ మిజ్రాహీ అనే సైనికుడు పోస్ట్‌ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్డీ) అనే మానసిక వ్యాధితో బాధపడుతూ మళ్లీ యుద్ధానికి పిలిచే ముందు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గోలానీ బ్రిగేడ్‌కు చెందిన మరో సైనికుడు స్దేతైమన్ సైనిక స్థావరంలో తన సహచరుడి రైఫిల్‌తో కాల్చుకొని సూసైడ్ చేసుకున్నాడు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. 2023 అక్టోబర్‌లో హమాస్, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎంతో మంది ఇజ్రాయెలీ సైనికులు మానసిక కుంగుబాటుతో ప్రాణాలు తీసుకున్నట్టు అనేక నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. యుద్ధకాంక్షతో గాజాలో మారణ హోమాన్ని సృష్టించడమే కాకుండా లెబనాన్ తోపాటు పలు దేశాలపై తరచూ దాడులకు పాల్పడుతూ సామాన్య ప్రజల ప్రాణాలు తీస్తున్న ఇజ్రాయెల్ సొంత సైనికుల ప్రాణాల గురించి కూడా పట్టించుకోవడం లేదని స్పష్టమవుతున్నది. గాజాలో 2023 అక్టోబర్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత సుమారు 390 మంది సైనికులు మరణించినట్టు స్వయంగా ఐడీఎఫ్ వెల్లడించింది. అయితే ఇవి దీనికి రెట్టింపు ఉండవచ్చని తెలుస్తున్నది. సైనికుల కొరత కారణంగా ఇజ్రాయెల్ రిజర్విస్టుల పేరుతో లక్షలాది మందిని బలవంతంగా యుద్ధ భూమిలోకి పంపిస్తున్నది. గాజాలో యుద్ధాన్ని విస్తరించడానికి ఇజ్రాయెల్ సుమారు మూడు లక్షల మంది రిజర్విస్టులను పిలిచింది. వీరిలో చాలా మందికి యుద్ధంలోకి వెళ్లడానికి ఇష్టం లేకపోయినా బలవంతంగా వెళ్లాల్సి వచ్చింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారినికూడా యుద్ధంలోకి తిరిగి పంపించినట్లు హారెట్జ్ అనే మీడియాసంస్థ తన నివేదికలో పేర్కొన్నది. మా సైనికులు యుద్ధం చేయడానికి నిబద్ధత చూపడం లేదు. అందుకే మేము మానసికంగా అస్థిరంగా ఉన్నవారిని కూడా నియమించుకోవాల్సి వస్తున్నది అని ఒక సైనిక అధికారి తమకు చెప్పినట్లు హారెట్జ్ తన నివేదికలో పేర్కొన్నది. సాధారణ పౌర జీవితంలో ఉన్న వారిని రిజర్విస్టులుగా, గాజా, లెబనాన్‌లో యుద్ధం కోసం ఇజ్రాయెల్ బలవంతంగా పంపించింది. యుద్ధ ఒత్తిడి, ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో ఈ రిజర్విస్టులు తీవ్ర మానసిక ఆరోగ్య సమస్యలకు గురయ్యారు. పదేపదే హింసాత్మక దృశ్యాలు, పౌర మరణాలు చూడడంతోపాటు మృతదేహాల రవాణా వంటి భయానక అనుభవాలను ఎదుర్కోవడంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. దీంతో సైనికుల్లో పోస్ట్‌ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీడీఎస్) బాధితుల సంఖ్య పెరిగినట్టు అనేక నివేదికలు చెబుతున్నాయి. బలవంతంగా యుద్ధంలోకి నెట్టడం, మానసిక ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడంతో ఇజ్రాయెల్ సైనికుల ఆత్మహత్యల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నది. ఇజ్రాయెలీ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఆత్మహత్యల గురించి అధికారికంగా ప్రకటించకపోయిన ప్పటికీ హారెట్జ్, అల్ మయాదీన్ వంటి మీడియా సంస్థలు పలు అంశాలను వెలుగులోకి తెస్తున్నాయి. గాజాలోయుద్ధం ప్రారంభమైన 2023 అక్టోబర్ నుండి 43 మంది సైనికులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఈ సంస్థలు నివేదించాయి. ఈసంఖ్య 2011 తర్వాత అత్యధికమని పేర్కొన్నాయి. కాగా, ఈ ఆత్మహత్యల్లో ఎక్కువ భాగం రిజర్విస్టులదని, వీరు గాజా, లెబనాన్‌లోని యుద్ధ రంగాల్లో తీవ్రమైన హింసను చూశారని పేర్కొన్నాయి. యుద్ధంలో ఇజ్రాయెల్ సైనికులు ప్రాణాలుకోల్పోతున్నా మానసిక సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, ఆ దేశ పాలకులు పట్టించుకోవడంలేదు. సైనికులకు మానసిక ఆరోగ్యం విషయంలో సహాయమందించడానికి 800మంది మానసిక ఆరోగ్య అధికారులను నియమించినప్పటికీ చాలా మంది సైనికులు తగినసమయంలో సహాయం పొందలేకపోతున్నారు. ఒక నివేదికప్రకారం సుమారు9వేలమంది సైనికులకు మానసికంగా అశక్తులుగా ఇజ్రాయెల్ వర్గీకరించింది.

# గురుకులాల్లో సౌకర్యాలొద్దా?

డాక్టర్ మోటె చిరంజీవి

నాలుగు గోడల తరగతి గది విజ్ఞానాన్ని అందించే నిధి. గురువులు కొలువుండే సన్నిధి, అజ్ఞాన అంధకారాన్ని తొలగించే దీపం, విజ్ఞాన కుసుమాలను వికసింపచేసే నందనవనం. క్రమశిక్షణను అలవరిచే కుటీరం, నల్లబోర్డు చూపును విశాల ప్రపంచం, సుద్దముక్క పంచును తరగని విజ్ఞానం. గురువు చేతి కర్ర నేర్పును విచక్షణా జ్ఞానం, కలలను సాకారం చేసే బృందావనం, గమ్యాన్ని నిర్దేశం చేసే గురుకులం, జీవితాలను నిలబెట్టే ఆలయం, ఒకప్పుడు గురుకులాలు అలా వుంటే, ఇప్పుడు గురుకులాలు మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. ఆహారం విషతుల్యమై కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, ఆత్మహత్యలు చేసుకుని మరికొందరు విద్యార్థులు మరణిస్తున్నారు. పిల్లల మరణాలు తల్లిదండ్రులకు తీరని కడుపు కోత మిగుల్చుతున్నాయి. పేద విద్యార్థులకు విద్యతో పాటు వసతి, ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీససౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కడ చూసినా నిర్లక్ష్యం తాండవిస్తున్నది. ఏడాదిగా హాస్టళ్లలో అనుమానాస్పద మరణాలు, బలవన్మరణాలు, అనారోగ్యం, కలుషిత ఆహారం తిని చనిపోవడం వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో విద్యార్థినులు వ్యాధుల బారిన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. దశాబ్దాలుగా సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులు మెరుగుపడకపోగా పాలకుల చిన్న చూపు కారణంగా దిగజారుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాటిలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతులు, సవాలక్ష



సమస్యలతో అస్తవ్యస్తంగా ప్రభుత్వ గురుకులాలు మారాయి. సరిపడా గదులు లేక కొన్ని, ఉన్నా శిథిలమై పెచ్చులూడే తరగతులు, కురుస్తున్న భవనాల కింద భయం భయంగా విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక చాలాచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానగదులు లేవు, వాటికి తలుపులు కూడా లేవు. మల విసర్జనకూ బాటిళ్లు తీసుకొని ఆరుబయటకు వెళ్లాల్సినదుస్థితి దాపురించింది. ఈక్రమంలోపాములు, తేళ్లు వంటి విషపురుగులూ కుట్టిన సందర్భాలూ లేకపోలేదు. చాలా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. గత ప్రభుత్వం గురుకులాలు, ఆశ్రమ పాఠశాలు, హాస్టళ్లకు సన్నబియ్యంతోపాటు బలవర్ధకమైన పౌష్టికాహారం సరఫరా చేసింది. విద్యార్థులు కూర్చునేందుకు కుర్చీలు, పడుకొనేందుకు గార్మెంట్స్ లేక నేలపైనే కూర్చోబెట్టి క్లాస్‌లు చెప్పడం, రాత్రివేళ్లల్లో అదే నేలపైనే పడుకోబెట్టడడంతో విద్యార్థులు భయాందోళనకు గురువుతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న రాత్రి సమయంలో విపరీతంగా కొడుతున్నాయి అంటున్నారు విద్యార్థులు. వీటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలి. కలుషిత నీటి వల్ల విద్యార్థులు పలుమార్లు జ్వరాల బారిన పడుతున్నారు. అలాగే మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యం కనిపిస్తోంది. అలాగే శుచి, రుచికరమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. డార్మెట్రీలో బెడ్స్ కూడా లేక నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. వసతి గృహంలో తలుపులు, కిటికీలు లేకపోవడంతో విద్యార్థులు రాత్రి సమయంలో భయపడుతున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. అరకొర ఉన్న వాటికి సైతం తలుపులు లేవు. ఇంకా తీవ్రమైన సమస్య ఏంటంటే నీటి వసతి కూడా లేదు. ఇక ఇతర సమస్యలు ఎలాగో తిష్టవేసి కూర్చుని ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తెలంగాణలో అంతంత మాత్రమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక గురుకులాలు ఏర్పడ్డాయి. ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 200 హాస్టల్‌లు కూడా లేవు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సుమారు 1100 వరకు గురుకులాలు ఏర్పాటు చేసి, 6 లక్షలకు పై చిలుకు విద్యార్థులు చదువుతున్నారు. విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రస్తుత ప్రభుత్వం గురుకులాల విషయంలో, అనేక మంది విద్యార్థులు అస్వస్తకు గురై చనిపోతున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కావలసిన నిధులను కుడా విడుదల చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన భోజనం, రక్షణ అందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుకుంటున్నారు.

# పహల్గాంపై చర్చ జరపవలసిందే




## లోక్‌సభ, రాజ్యసభలో పట్టుపట్టిన విపక్షాలు
### చర్చకు సిద్ధమేనన్న ఎన్డీయే పక్షం
### తొలిరోజే ఉభయసభల్లో వాడివేడి చర్చలు

**న్యూఢిల్లీ,జులై 21:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు లోక్ సభ, రాజ్యసభలో విపక్షాలు పట్టుపట్టాయి. భారత్ పాక్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 24 సార్లు చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డాయి. దీనిపై పార్లమెంటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ చీఫ్, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు ఇతర విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై చర్చ కోసం రూల్ 267 కింద వారు రాజ్యసభలో వాయిదా నోటీసులను అందించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాలపై చర్చలో పాల్గొనేందుకు నిరాకరించారు. పహల్గామ్ ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్'లపై రెండు రోజుల పాటు ఉభయ సభల్లో చర్చించాలని జీరో అవర్‌లో ఖర్గే డిమాండ్ చేశారు. దీనిపై విపక్ష ఎంపీలంతా పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. 12 గంటలకు రాజ్యసభలో క్వశ్చన్ అవర్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈక్రమంలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను నేటికీ గుర్తించలేదన్నారు. ఉగ్రదాడి జరిగిన రోజు ఏప్రిల్ 22న పహల్గాంలో భద్రతా లోపాలు ఉన్నాయని స్వయంగా జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఆ ఉగ్రదాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన కొన్ని వివరాలను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్), డిప్యూటీ ఆర్మీ చీఫ్, మరో సీనియర్ ఆర్మీ ఉన్నతాధికారి వెల్లడించారని ఖర్గే చెప్పారు.

మరోవైపు విపక్షాల డిమాండ్‌పై రాజ్యసభలో కేంద్ర మంత్రి జెపి నడ్డా స్పందించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర చర్చకు నరేంద్ర మోడీ సారథ్యంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అలాంటి సైనిక ఆపరేషన్ ఎన్నడూ జరగలేదన్నారు. పహల్గాం ఉగ్రదాడపైనా చర్చిస్తామని తెలిపారు. ఇంతకుముందు పార్లమెంటు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలోనూ ఈ వివరాలను విపక్షాలకు తాము తెలిపామని నడ్డా చెప్పారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై సభ్యులు కోరుకున్నన్ని రోజులు పూర్తిస్థాయి చర్చ జరుగుతుందని విపక్ష ఎంపీలకు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ కూడా హామీ ఇచ్చారు. దీనిపై తాను అన్ని పార్టీల నేతలతో మాట్లాడతానన్నారు. అయితే ఆలస్యం చేయకుండా ఆపరేషన్ సిందూర్‌పై వెంటనే చర్చను మొదలుపెట్టాలని ఖర్గే కోరారు. దీనిపై నడ్డా స్పందిస్తూ, తాము చర్చ నుంచి తప్పించుకునే యత్నం చేయడం లేదన్నారు. ఈక్రమంలో రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ కలుగజేసుకుంటూ, అన్ని పార్టీల ఎంపీలు పరస్పర గౌరవ భావంతో మెలగాలని కోరారు. పరుష పదజాలాన్ని, వ్యక్తిగత దూషణలను ఏ వేదికపైనా చేయొద్దన్నారు.

ఘర్షణలు, విమర్శలు అనేవి అర్థవంతమైన రాజకీయాలు కానే కావని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో ఏఒక్కరు కూడా భారత ప్రయోజనాలను వ్యతిరేకించరని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత నాగరికతలోని విలువలకు వ్యతిరేకంగా ఉండే నడవడిని వీడాలన్నారు. పార్లమెంటు సమావేశాలు అర్థవంతంగా జరగాలంటే, చర్చలు, సంప్రదింపులు మాత్రమే మార్గాలని జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. భారతదేశ చారిత్రక బలం కూడా చర్చలు, సంప్రదింపులు, సంభాషణలపైనే ఆధారపడి ఉందన్నారు. ఆ బాటలోనే పార్లమెంటు చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలకు ఆయన పిలుపునిచ్చారు. అంతర్గత కుమ్ములాటల వల్ల మన శత్రువులకు బలం వస్తుందని, మనల్ని విభజించే సామర్థం వాళ్లకు లభిస్తుందన్నారు. తన నివాసంలో నోట్ల కట్టలు లభ్యమైన వ్యవహారంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై 200 మందికిపైగా ఎంపీలు పార్లమెంటులో సోమవారం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 145 మంది ఎంపీలు, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసులు అందించారు. లోక్‌సభలో ఈ నోటీసులు అందించిన ఎంపీల్లో అనురాగ్ ఠాకూర్, రవిశంకర్ ప్రసాద్, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, రాజీవ్ ప్రతాప్ రూడీ, పిపి చౌదరి, సుప్రియా సూలే, కెసి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 124, 217, 218 కింద ఈ నోటీసులు అందించారు. జడ్జి తొలగింపునకు సంబంధించిన తీర్మానంపై కనీసం 100 మంది లోక్‌సభ ఎంపిలు, 50 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. 145 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేసినందుకు ఈ తీర్మానం తదుపరి దశకు చేరడం దాదాపు ఖాయమైంది. దీనిపై రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ తుది నిర్ణయాన్ని తీసుకోనున్నారు. నివాసంలో నోట్ల కట్టలు లభ్యమైన వ్యవహారంతో తనకు సంబంధం లేదని జస్టిస్ యశ్వంత్ వర్మ అంటున్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ విచారణ జరిపి, నోట్ల కట్టలు లభ్యమైన స్టోర్ రూంపై జడ్జి, ఆయన కుటుంబానికే పూర్తి పట్టు ఉందని తేల్చింది.



## గాజాలో అన్నార్తులపై ఆగని దాడులు
### తాజా కాల్పుల్లో 90 మంది మృత్యువాత

**డెయిర్ అల్‌బలా, జులై 21:** హమాస్ ఉగ్రవాదులను ఏరివేసేందుకు చేపట్టిన యుద్ధం కారణంగా గాజా మరుభూమిగా మారిపోయింది. ఎక్కడచూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. అక్కడక్కడా గాజా పౌరులు దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారు. తిండి, నీరులేక ఆకలితో అలమటిస్తున్నారు. ఇటు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు, అటు హమాస్ ఉగ్రవాదుల ఎదురుకాల్పుల మధ్య వారు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో గాజా పౌరుల ఆకలి తీర్చేందుకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు గాజాలో మానవతా సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశాయి. ఈ కేంద్రాలవద్ద ఇజ్రాయెల్‌సైన్యం కాపలా కాస్తోంది. ఆకలి తట్టుకోలేక జనం ఈ కేంద్రాల వద్ద పోటెత్తుతున్నారు. వారిని నియంత్రించేందుకు సైనికులు కాల్పులు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నార్త్ గాజాలోని ఓ ఆహార పంపిణీ కేంద్రం వద్ద గుమిగూడిన జనాలను నియంత్రించేందుకు ఇజ్రాయెల్ సైన్యం కాల్పులు జరిపిందని, ఈ ఘటనలో ఏకంగా 80 మంది మరణించారని గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ ఆరోపించింది. మరో రెండు కేంద్రాల వద్ద 10 మందికిపైగా గాజా పౌరులు మృత్యువాత పడ్డారని తెలిపింది. ఆకలి తట్టుకోలేక సాయం కోసం వచ్చిన అమాయకులపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) తూటాల వర్షం కురిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది.

కాగా, గాజాలో పౌరుల దీనస్థితికి అద్దంపట్టే సంఘటన గురించి ఐక్యరాజ్య సమితి అధికారులు వివరిస్తూ.. ఇటీవల గాజా సిటీలోకి ఐక్యరాజ్య సమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ కింద 25 ట్రక్కులనిండా ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులను పంపించిందనిచెప్పారు. సరిహద్దుల్లో తనిఖీల తర్వాత ట్రక్కులు ఇలా గాజా సిటీలోకి ప్రవేశించాయో లేదో వందలాది మంది పౌరులు వాటిని చుట్టుముట్టారని తెలిపారు.

## అక్రమ వలసదారులను బయటకు విసిరేయాల్సిందే!
### సిబిపి అధికారిపై కాల్పులతో ట్రంప్ ఆగ్రహం

**వాషింగ్టన్,జులై 21:** యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి) అధికారిపై అక్రమ వలసదారుడు కాల్పులు జరిపిన ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. అక్రమ వలసదారులను సరిహద్దు బయటకు విసిరేస్తామని చెప్పారు. దాడిచేసిన వ్యక్తిని 2023 ఏప్రిల్‌లో పట్టుకున్నప్పటికీ బహిష్కరించకుండా విడుదల చేశారని విమర్శించారు. కాల్పుల ఘటనపై ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ జో బైడెన్ పాలనలో విడుదలైన ఒక అక్రమ వలసదారుడు నిన్న రాత్రి న్యూయార్క్‌లో సిబిపి అధికారిపై కాల్పులు జరిపాడు. అతడిని 2023 ఏప్రిల్‌లో సరిహద్దు వద్ద పట్టుకున్నారు. కానీ బహిష్కరించకుండా విడుదల చేశారు. కాల్పుల్లో సిబిపి అధికారి గాయపడినప్పటికీ దాడి చేసిన వ్యక్తితో ధైర్యంగా పోరాడి ధైర్యాన్ని ప్రదర్శించాడు. డెమోక్రాట్లు మన దేశాన్ని నేరస్థుల ఆక్రమణలతో నింపారు. ఇప్పుడు వారందరినీ బయటకు విసిరివేయాలి, లేదా కేసులు నమోదు చేయాలి, ఎందుకంటే వారు మళ్లీ తిరిగి వచ్చే అవకాశం ఇవ్వకూడదు. వారు చాలా ప్రమాదకరమైన వారని ట్రంప్ ఆ పోస్టులో పేర్కొన్నారు.

న్యూయార్క్ పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ కథనం ప్రకారం.. ఈ ఘటన రాత్రి 11:50 గంటల సమయంలో ఫోర్ట్ వాషింగ్టన్ పార్క్‌లో జరిగింది. 42 ఏళ్ల ఫెడరల్ ఏజెంట్ ఒక మహిళతో కలిసి హడ్సన్ నది ఒడ్డున ఒక రాతిపై కూర్చొని ఉండగా ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై వచ్చారు. ఒక వ్యక్తి దిగి అధి కారి వద్దకు వచ్చాడు. అతడు దోపిడీకి గురవుతున్నట్టు గ్రహించి వెంటనే తన సర్వీస్ వెపన్‌ను బయటకు తీశాడు. ఇద్దరూ కాల్పులు జరిపారు. అధికారి ముఖం, ఎడమ చేతికి గాయాలయ్యాయి. దాడిచేసిన వ్యక్తి కూడా గాయపడ్డాడు. తర్వాత నిందితులిద్దరూ పారిపోయారు. పారిపోయిన వారిలో ఒకరిని 21 ఏళ్ల అక్రమ వలసదారుడు మిగ్యూల్ మోరాగా గుర్తించారు.



## టేకాఫ్‌కు రెడీ అయిన బ్రిటిష్ రాయల్ నేవీ జెట్!

**తిరువనంతపురం,జులై 21:** కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ నెల 14 నుంచి చిక్కుకుపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్35బి స్టెల్త్ యుద్ధ విమానం హైడ్రాలిక్ సిస్టమ్ లోపాన్ని ఎట్టకేలకు సరిచేశారు. ఈ విమానం యూకేకు బయలుదేరడానికి ముందు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రాయల్ నేవీకి చెందిన విమాన వాహక నౌక హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ నుంచి విమానాన్ని డైవర్ట్ చేసి ఈ నెల 14న కేరళలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానం ఖరీదు దాదాపు 115 మిలియన్ డాలర్లు. హైడ్రాలిక్ వైఫల్యం కారణంగా గత నెల రోజులుగా ఇది తిరువనంతపురంలోనే హ్యాంగర్‌కు ఉండిపోయింది. ఈ నెల 6న బ్రిటిష్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఎ400ఎం అట్లాస్‌లో వచ్చిన 25 మంది బ్రిటిష్ ఇంజనీర్ల బృందం ఎయిర్ ఇండియా మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) హ్యాంగర్‌లో ఈ విమానానికి మరమ్మతులు ప్రారంభించింది. ఈ ఉదయం ఎఫ్35బి విమానాన్ని హ్యాంగర్ నుంచి బయటకు తీసుకొచ్చారు, మరమ్మతులు విజయవంతం కావడంతో యూకేకు తిరిగి వెళ్లేముందు నేడు కానీ, రేపు కానీ ట్రయల్ ఫ్లైట్ నిర్వహించేందుకుసన్నాహాలు జరుగుతున్నాయి.

## ముంబయి రైళ్లలో పేలుడు కేసులో సంచలన తీర్పు
### ప్రాసిక్యూషన్ విఫలం అయిందని బాంబే హైకోర్టు వెల్లడి

**ముంబయి,జులై 21:** రెండుదశాబ్దాలనాటి ముంబయి రైళ్లలో పేలుళ్ల కేసులో 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2006లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి దోషులని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని జస్టిస్ అనిల్ కిలోర్ జస్టిస్ శ్యామ్ చందక్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టమని వివరించింది. అందువల్ల దిగువ కోర్టు విధించిన శిక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన బాంబే హైకోర్టు, వారిని నిర్దోషులుగా విడుదల చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతర్వాత వివిధజైళ్లనుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా కోర్టుముందుహాజరైన దోషులు తమ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనపై సుదీర్ఘ దర్యాప్తు అనంతరం 2015 అక్టోబరులో ప్రత్యేక కోర్టు 12 మందిని దోషులుగా నిర్ధారించింది.

వారిలో బాంబు అమర్చారన్న అభియోగాలపై ఐదుగురికి మరణ శిక్ష విధించింది. మిగతా ఏడుగురికి జీవితఖైదు విధిస్తూ తీర్పు అప్పట్లో వెలువరించింది. అందులో దోషుల్లో ఒకడైన కమల్ అన్సారీ అనే వ్యక్తి 2021లో కొవిడ్ కారణంగా నాగ్‌పూర్ జైల్లో మృతి చెందాడు. అయితే ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై దోషులు హైకోర్టును ఆశ్రయించారు. వాటిని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## కేవలం రూ. 100కే ఇల్లు..! ఎక్కడో తెలుసా?



**ప్యారిస్, జులై 21:** ఎప్పటికైనా సొంతిల్లు కొనుగోలు చేయాలనే ఆశ అందరికీ ఉంటుంది. తాము కలలు కనే నివాసం తక్కువ ధరకే.. విదేశాల్లో సొంతమయితే! ఇంకేముంది ఎగిరి గంతేస్తారు. ఇలా సొంతింటి కోసం కలలు కంటున్న ప్రజల కోసం ఫ్రాన్స్ ఓ సూపర్ ఆఫర్‌ను మన ముందుకు తీసుకువచ్చింది. ఆ దేశంలోని అంబర్ట్ అనే పట్టణంలో కేవలం ఒక్క యూరో (రూ. 100) చెల్లించి.. ఇల్లు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించింది. ఫ్రాన్స్‌లో పుయ్-డి-డోమ్ ప్రాంతంలో ఉన్న ప్రశాంతమైన పట్టణం అంబర్ట్‌లో రోజురోజుకు తగ్గిపోతున్న జనాభాను పునరుద్ధరించేందుకు ఈ వినూత్న ప్రయత్నం చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మెరుగైన మౌలిక సదుపాయాల కోసం ప్రజలు నగరాల వైపు తరలివెళ్లడంతో 19వ శతాబ్దం నుంచి ఈ ప్రాంతంలో జనాభా తగ్గుతూ వస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ పట్టణంలో 6,500 మంది నివసిస్తున్నారు. జనాభాను మరింత పెంచడానికి అక్కడి అధికారులు ఐదేళ్ల ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగానే ప్రజలకు రూ. 100కే ఇల్లు కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నారు. జనాభాను పునరుద్ధరించడం, స్థానిక పాఠశాలలు, వ్యాపారాలు వంటి వాటిని అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలతో ఈ ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇళ్లకొనుగోలుకు కేవలం వందరూపాయలు మాత్రమే అవుతున్నప్ప టికీ.. శతాబ్దాలనాటి అక్కడి భవనాలను పునరుద్ధరించడానికి దాదాపు రూ. 20నుంచి రూ. 50 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంటిని కొనుగోలుచేసే సమయంలోనే కొనుగోలు దారులు ఆ ఇంటి పునరుద్ధరణకు కట్టుబడి ఉంటామని తెలియ జేస్తూ.. హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఫ్రాన్స్ ప్రజలతోపాటు, విదేశీయులు కూడా అంబర్ట్‌లో ఇళ్లను కొనుగోలు చేయవచ్చు. భవనాల పునరుద్ధరణకు డబ్బు కావాలనుకుంటే అక్కడి ప్రభుత్వం తక్కువ వడ్డీకి రుణాలు, పునరు ద్ధరణ గ్రాంట్లు వంటి రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. అయితే ఇంటిని కొన్నాక కనీసం మూడేళ్లపాటు అక్కడే నివసించాల్సి ఉంటుంది. ఫ్రెంచ్‌భాష తెలిసిఉండడం తప్పనిసరి కానప్పటికీ అక్కడిస్థానికులు, వ్యాపారు లతో కమ్యూనికేట్ చేయగలిగితే బాగుంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అమెరికాలో గ్రీన్‌కార్డుకు రెడ్ సిగ్నల్..




**వాషింగ్టన్, జులై 21:** అమెరికాలో ట్రంప్ సర్కారు వచ్చిన తర్వాత గ్రీన్‌కార్డులు, వీసాల జారీ, వలసపోవడం కష్టతరంగా మారాయి. అయితే.. వీటిల్లో వీసాలు, గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల ఇప్పుడు ఆ దేశ కార్పొరేట్ రంగంపై దుష్ప్రభావం చూపడం మొదలుపెట్టింది. వివిధ రంగాల్లోని కార్పొరేట్ లీడర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల వర్క్ పర్మిట్లు ముగియడం.. వాటి పునరుద్ధరణ వెంటనే జరగకపోవడంతో వారు పదవుల నుంచి వైదొలగాల్సి వస్తోంది. ముఖ్యంగా శాశ్వత నివాసం కల్పించే గ్రీన్‌కార్డుల జారీలో జాప్యం వల్ల .. సక్రమమార్గంలో దేశంలోకి వచ్చి కొన్నేళ్లుగా వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న వారు కూడా వెళ్లిపోయేటట్లు చేస్తోంది. అమెరికాలోనే అతిపెద్దదైన మెట్రోపాలిటన్ ర్యాపిడ్ ట్రాన్సిట్ అథారిటీ (మార్టా) సిఇఒ కొల్లిన్ గ్రీన్‌వుడ్ జులై 17న పదవి నుంచి వైదొలిగారు. ఆయనకు వర్క్‌పర్మిట్ కాలవ్యవధి ముగిసిపోవడం.. గ్రీన్‌కార్డ్ జారీలో జాప్యంతో ఆయన తన పదవిలో కొనసాగడం అసాధ్యంగా మారింది. దీంతో ముందస్తు రిటైర్‌మెంట్‌ను ఆయన ఎంచుకొన్నారు. ఆయన స్వస్థలం కెనడా. తమ సిఇఒకు గ్రీన్‌కార్డ్ త్వరలోనే వస్తుందని మార్టా చెప్పినా.. పదవిని వీడేందుకే గ్రీన్‌వుడ్ మొగ్గు చూపారు.

**భారతీయులకు గ్రీన్‌కార్డుల్లో భారీ జాప్యం..**

అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్న భారతీయులు.. ప్రాసెసింగ్‌లో తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఇమిగ్రేషన్ బ్యాక్‌లాగ్‌లో 1.13 కోట్ల దరఖాస్తులున్నాయి. ఈ స్థాయిలో పెండింగ్‌లో ఉండటం ఓ రికార్డ్. ఇక ఈ యేడాది రెండో త్రైమాసికంలో మరో 16 లక్షల కొత్త దరఖాస్తులు వచ్చి చేరనున్నాయి. ఇటీవల యుఎస్ సిఐఎస్ ప్రచురించిన డేటాషీట్‌లో ఈ వివరాలున్నాయి. ఇక రెండో త్రైమాసికంలో ప్రాసెస్ చేసిన దరఖాస్తుల సంఖ్య కూడా తగ్గింది. గతేడాది 3.3 మిలియన్ల చేయగా.. ఈసారి 2.7 మిలియన్లకే పరిమితమైంది. ఇక గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారులు వాడే ఫారమ్ ఐ-90 సగటు వెయిటింగ్ టైమ్ 0.8 నెలల నుంచి 8 నెలలకు చేరింది. ఫారమ్ ఐ-765ల్లో దాదాపు 2 మిలియన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

## 'ఒబామా అరెస్టు'! ఎఐ విడియో పోస్టు చేసిన ట్రంప్



**వాషింగ్టన్, జులై 21:** డెమోక్రాట్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు సంబంధించి ఓ విడియో పోస్ట్ చేశారు. ఓవల్ ఆఫీసులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) అధికారులు ఒబామాను అరెస్టు చేస్తున్నట్లుగా ఎఐ సాయంతో రూపొందించిన విడియో అది. 'చట్టానికి ఎవరూ అతీతులు కారు' అనే మెసేజ్ ఇస్తూ మాజీ అధ్యక్షుడిపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఆ విడియోలో తొలుత ఒబామా మాట్లాడుతూ.. 'చట్టానికి అధ్యక్షుడు అతీతుడే' అని అన్నట్లుగా ఉంది. ఆ వెంటనే పలువురు రాజకీయ నాయకులు 'చట్టం కంటే ఎవరూ ఎక్కువ కాదు' అని మాట్లాడినట్లు ఉంది. చివరకు ఓవల్ ఆఫీసులో ట్రంప్, ఒబామా మాట్లాడుకుంటుండగా ఎఫ్‌బిఐ అధికారులు అక్కడికి వచ్చి మాజీ అధ్యక్షుడి చేతికి సంకెళ్లు వేసినట్లుగా ఈ విడియోను రూపొందించారు. ఆ సమయంలో ట్రంప్ నవ్వుతూ కన్పించడం గమనార్హం. తర్వాత ఒబామా ఖైదీ దుస్తుల్లో జైల్లో కూర్చుని ఉన్నట్లు చూపించడంతో విడియో ముగుస్తుంది. ఈ విడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేయగా..ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్‌గా మారింది. అధ్యక్ష ఎన్నికల్లో ఒబామా భారీఎత్తున మోసాలకు పాల్పడ్డారంటూ ట్రంప్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలి సిందే. దాన్ని ఉద్దేశిస్తూనే అధ్యక్షుడు తాజావిడియో పోస్టు చేసినట్లు తెలు స్తోంది. గత వారం యుఎస్ నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ సంచలన ఆరోపణలు చేశారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆతర్వాత ఆయనపాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని ఆమెఅన్నారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి తన వద్ద బలమైన సాక్ష్యాలున్నాయని పేర్కొన్నారు. ఒబామా హయాంలో పనిచేసిన వారందరినీ విచారించాలని తులసీ గబ్బార్డ్ పిలుపునిచ్చారు.

## సంక్షిప్తంగా..

### నన్ను మాట్లాడనీయడంలేదు: రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ,జులై 21:** కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేతనైన తనకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. సభలో అధికార పక్ష సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలోని మంత్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి... తనకు మాత్రం తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వకపోవడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమేనని రాహుల్ అన్నారు. లోక్ సభలో చర్చ ప్రారంభమైన వెంటనే ప్రధాని మోడీ వెళ్లిపోయారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అన్ని విషయల్లో వారికి అనుకూలమైన కొత్త విధానాలను సృష్టించుకుంటోందని విమర్శించారు.

### అమర్‌నాథ్ యాత్రకు పెరుగుతున్న భక్తులు

**శ్రీనగర్,జులై 21:** అమర్‌నాథ్ యాత్రకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఈ నెల 3న యాత్ర ప్రారంభం కాగా 18 రోజుల్లో మూడు లక్షలకు పైగా మంది భక్తులు హిమాలయాల్లోని మంచు శివలింగాన్ని దర్శించుకున్నారు. ఆదివారం నాటికి 3.07 లక్షల మంది యాత్రికులు పవిత్ర దర్శనం చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఆగస్టు 9న యాత్ర ముగియనుంది. ఇంకా 20 రోజులు మిగిలి ఉన్నందున ఈ ఏడాది 3.50 లక్షలకు పైగా మంది భక్తులు దర్శనం చేసుకునే అవకాశం ఉందని అధికారిక అంచనా. సోమవారం భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి రెండు ఎస్కార్ట్ కాన్వాయ్‌లలో 3,791 మంది యాత్రికులు లోయకు బయలుదేరారు. 1,208 మంది యాత్రికులతో బాల్టాల్ బేస్ క్యాంప్‌కు 52 వాహనాలతో కూడిన మొదటి ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 3.33 గంటలకు బయలుదేరగా, 2,583 మంది యాత్రికులతో పహల్గామ్ బేస్ క్యాంప్‌కు 96 వాహనాలతో కూడిన రెండవ ఎస్కార్ట్ కాన్వాయ్ తెల్లవారుజామున 4.06 గంటలకు బయలుదేరిందని అధికారులు తెలిపారు.

### డెల్టా ఎయిర్ విమానాన్ని ఢీకొట్టబోయిన యుద్ధ విమానం

**ప్యారిస్,జులై 21:** ఆకాశంలో పెను ప్రమాదం తప్పింది. ఒక ప్రయాణికుల విమానం.. యుద్ధ విమానాన్ని ఢీకొట్టే ఘటన త్రుటిలో తప్పింది. గత వారం జరిగిన ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పారిస్ నుంచి సిన్సినాటి నార్తర్న్ కెంటకీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న డెల్టా ఎయిర్ లైన్స్ విమానానికి అమెరికాకు చెందిన యుద్ధ విమానం బీ52 బాంబర్ అతి సమీపానికి వచ్చింది. అప్రమత్తమైన డెల్టా విమాన పైలట్ ఫ్లైట్‌ను వెంటనే కొన్ని అడుగుల కిందికి దించడంతో ప్రమాదం తప్పింది. యుద్ధ విమానం సమీపంలోకి వచ్చిన విషయాన్ని 'ఎవరూ మాకు చెప్పలేదు' అని పైలట్ చెప్పడం గమనార్హం. రాడార్ కంట్రోల్‌లో కమ్యూనికేషన్ లోపం కారణంగానే ఇది జరిగినట్టు తెలుస్తోంది. ఈ నెల 10న ఒక బీ52 హెచ్ స్ట్రాటోఫోర్ట్రస్ బాంబర్ సమీపంలోకి వచ్చి డెల్టా విమానాన్ని ఢీకొన్నంత పనిచేసింది. అప్పుడు డెల్టా విమానం 30 వేల అడుగుల ఎత్తులో ఎగురుతోంది. బీ52 విమానం సమీపంలో ఉందని గుర్తించిన పైలట్ వెంటనే అప్రమత్తమై అగ్రెసివ్ మాన్యువర్ చేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

### బోర్డును తప్పుగా ప్రదర్శించిన కండక్టర్ సస్పెన్షన్

**తిరువణ్ణామలై,జులై 21:** తిరువణ్ణామలై వెళ్లే బస్సులో తిరువణ్ణామలైకి బదులుగా అరుణాచలం అని బోర్డు ప్రదర్శించినందుకు తమిళనాడు ఆర్టీసీ యాజమాన్యం ఒక కండక్టర్‌ను సస్పెండ్ చేసింది. ఈ సంఘటన ఈ నెల 15వ తేదీన చోటు చేసుకుంది. కళ్లకురిచ్చి ప్రభుత్వ రవాణా సంస్థ డిపో నుంచి ఒక బస్సు బెంగళూరుకు బయలుదేరింది. ఈ బస్సు ముందుభాగంలో ఎల్‌ఈడీ తెరపై తిరువణ్ణామలైకు బదులుగా అరుణాచలం అని ఆంగ్ల అక్షరాలలో ప్రదర్శించారు. దీనిని గమనించిన కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఒక సామాజిక కార్యకర్త ఈ విషయంపై ప్రభుత్వ రవాణా సంస్థను ప్రశ్నించారు.

### సాంబార్‌లో విషం కలిపి భర్తను హత్యచేసిన భార్య

**చెన్నై,జులై 21:** దేశ వ్యాప్తంగా భర్తలను హతమారుస్తున్న భార్యల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతుంది. ఈ మధ్య కాలంలో ఈ ఘటనలు మరింత ఎక్కువయ్యాయి. తాజాగా తమిళనాడులో ఇదే కోవకు చెందిన ఘటన మరొకటి చోటుచేసుకుంది. తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో దారుణం జరిగింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య తన భర్తను సాంబారులో విషం కలిపి హతమార్చింది.

# రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలి



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి

### నేనే రాబోయే పదేళ్లు సిఎంనని రేవంత్ ఎందుకన్నారో రాజగోపాల్‌రెడ్డికి తెలియదు
### క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి సూచనలు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** 'నేనే రాబోయే పదేళ్ల ముఖ్య మంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఏ సందర్భంలో అన్నాడో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డికి తెలియదని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి అన్నారు. సోమవారం విలేకరు లతో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, దానిని కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని సూచించారు. పదేళ్లు సిఎంగా ఉంటాననే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు సంయమనంతో ఉండాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డిపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. పార్టీ విషయాలు బహిరంగంగా మాట్లాడొద్దు అని హితవు పలికారు. ముఖ్యమంత్రిగా మరో పదేళ్లు తానే ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన రాజకీయ దుమారం రేపింది. ముఖ్యమంత్రి పదవి ఆశించే కొంత మంది కాంగ్రెస్ నాయకులకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్షను కాదు స్వపక్ష నేతలను సవాల్ చేసేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని రాష్ట్రంలోని సీనియర్ నాయకులు వారి అంతరంగికుల వద్ద ఈ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ మండిపోతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏలాంటి భేషజాలు లేకుండా బహిరంగానే సామా జిక మాధ్య మాల వేదికగా తీవ్రంగా స్పందించారు. రేవంత్ ప్రక టన కాంగ్రెస్ విధా నాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత సాధ్యాసాధ్యాల మార్పులకు ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సహించరని రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతికి దారితీస్తున్నాయి. ఇప్పటికే కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పలువురు నేతలు స్పందించి కౌంటర్ ఇవ్వగా, తాజాగా మల్లు రవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడినతీరు మరింత అగ్గికి ఆజ్యం పోసేలా తయారైంది.

## రాజకీయ నాయకులు అసభ్యపదజాలం ఉపయోగించడం తగదు
### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** పెద్దల సభలోని సభ్యుల ప్రవర్తన వారి విజ్ఞతకు వదిలేస్తున్నానన్నారు. శాసనమండలి సభ్యులు ఇలా మాట్లాడవచ్చా? ఇలా దాడులు చేయవచ్చా అనే వారే ఆలోచన చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ అన్నారు. ఎమ్మెల్సీలు కవిత, తీన్మార్ మల్లన్న పరస్పర ఫిర్యాదులపై సోమవారం ఆయన స్పందించారు. సభలో జరిగే వ్యవహారాలపై తక్షణం చర్యలు ఉంటాయని కానీ బయట జరిగే అంశాలపై మన పరిధి మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఇలాంటి చర్యలతో వ్యక్తిగతంగా వారి గౌరవంతో పాటు పెద్దల సభ గౌరవం కూడా పోతుందన్నారు రాజకీయ నాయకులు అసభ్య పదజాలం వీడనాడాలని గుత్తా సుఖేందర్ సూచించారు. మాట్లాడే భాషపై ఎవరైనా కూడా వ్యక్తిగతంగా ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఈ పద్ధతి రాష్ట్ర రాజకీయాలకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు మంచిది కాదని మన భవిష్యత్ తరాలకు చెడుమాటలను నేర్పించే పరిస్థితి ఉండకూడదన్నారు. కొంత మంది మాట్లాడే అసభ్య మాటలకు పక్కనున్న వాళ్ళు కొంతమంది జిందాబాద్ కొట్టవచ్చు కానీ ప్రజలు హర్షించ రన్నారు. ఈ విధానం మార్చుకోవాల్సిన అవసరం ఉన్నారు. తిడితేనే రాజకీయ నాయకులం అవుతామనే పద్ధతి మార్చుకోవాలన్నారు. రాజకీయాల్లో అనుభవం ఉండి మంత్రులుగా పనిచేసిన వారు కూడా ఇలాంటి అసభ్యపదజాలం వాడటం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రతిపక్ష నేతలతోపాటు అధికారపక్షం కూడా హుందాతనంతో వ్యవహరించాలని సూచించారు.

## అల్లోపతి వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లపై టిఎంసి తనిఖీలు.. కేసులు నమోదు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** కొంతకాలంగా రాష్ట్రంలో నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ దాడులు కొనసాగిస్తోంది. ఎక్కడ అనుమానం వచ్చిన మెడికల్ కౌన్సిల్ అక్కడికి వెళ్లి దాడులను నిర్వహిస్తోంది. అందులో భాగంగా అల్లోపతి వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై టిఎంసి సోమవారం దాడులు నిర్వహించింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కె మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ డి లాలయ్య కుమార్ ఆదేశాల మేరకు సోమవారం హయత్‌నగర్ మండలం పరిధిలో అనధికారికంగా అల్లోపతి వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లపై నిర్దిష్ట స్థావరాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనధికారిక వైద్య నియంత్రణ పరిరక్షణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్టు టిఎంసి వైస్‌ఛైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్, డాక్టర్ కెయుఎన్ విష్ణు, విజిలెన్స్ అధికారి రాకేష్ తెలిపారు. సూర్యాస్ హాస్పిటల్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్ పేరుతో బిఎఎంఎస్ చదివిన డాక్టర్ ఉమాకాంత్ అల్లోపతి వైద్యం చేస్తున్నట్టు గుర్తించారు. శ్రీ విజయ బ్రహ్మేంద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో బ్రహ్మేంద్ర ఆధునిక వైద్య సేవలు నిబంధనలకు వ్యతిరేకంగా చికిత్స అందిస్తున్నారు. హనుమాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో ఇంటర్మీడియట్ చదివి అర్హతలేని వినోద్ ఆధునిక వైద్యసేవలు అందిస్తున్నట్టు టిఎంసి బృందం గుర్తించింది. శ్రీసాయి పాలీ క్లినిక్ పేరుతో బిహెచ్ఎంఎస్ చదివిన డాక్టర్ కెఎస్ ప్రసాద్ ఆధునిక వైద్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు. బాలాజీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో రాంబాబు వైద్యపరంగా అనధికారికంగా సేవలందిస్తున్నట్టు టిఎంసి వైద్యుల బృందం గుర్తించింది. నకిలీ వైద్యులపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఎన్ఎంసి 34,54, టిఎస్ ఎంపిఆర్ 22, బిఎన్ఎస్ 318, 319 చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు టిఎంసి వైస్‌ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల ద్వారా టిఎంసి ప్రజారోగ్య పరిరక్షణ కోసం కట్టుబడి ఉందని చాటిచెప్పినట్టయిందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై మరింత చట్టబద్ధ చర్యలు చేపట్టనున్నట్లు టిజిఎంసి స్పష్టం చేసింది.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి సిపిఐ నాయకుల సంతాపం
### సానుభూతి తెలిపిన నారాయణ, కూనంనేని

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుందని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతానందన్ బాల్యంలోనే చదువు మానేసి కార్మికుడిగా పని చేస్తూ కార్మిక ఉద్యమ నాయకుడిగా ఎదిగారన్నారు. ట్రావెన్ కోర్ సంస్థానంలో భూముల పోరాటం చేసి జైలుకెళ్ళి రాజకీయ జీవితంలో అడుగుపెట్టారని కూనంనేని అచ్యుతానందన్ సేవలను కొనియాడారు. కమ్యూనిస్టు యోధుడు, ఈతరానికి ఆదర్శవంతులు కేరళ మాజీ ముఖ్య మంత్రి కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం, వారికుటుంబసభ్యులకు నాసానుబూతిని తెలిపారు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ. కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సంతాపం తెలిపారు. కేరళలో నిరుపేద కుటుంబంలో జన్మించి లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు ప్రపంచంలోనే కీలక ఘట్టాలను చూసిన వ్యక్తి అచ్యుతానందన్ అనిని వారు గుర్తు చేసుకున్నారు. అచ్యుతానందన్ మృతి పట్ల సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## కల్లు దుకాణాలను బంద్ చేయాలని చూస్తే ఊరుకునేది లేదు
### బిఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 21:** కులవృత్తులను భూస్థాపితం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్తీ పేరిట పూర్తిగా గీత వృత్తిని రూపుమాపేయాలని దురాలోచన చేస్తోందని బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు దుకాణాలను బంద్ చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గౌడ సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. కుల వృత్తుల బాగోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఆయన ఆరోపించారు. మొదట ఔటర్ రింగు రోడ్డు లోపల, ఆ తర్వాత ఔటర్ రింగు రోడ్డు బయట కల్లును నిషేధించాలని భావిస్తున్నట్లు అర్థమవుతోందని అన్నారు.

కల్లు కాంపౌండుపై నిషేధం విధిస్తే లక్షలాది మంది రోడ్ల మీద పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్లును బంద్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లిక్కర్ కంపెనీలు, డిస్టిలరీలు అన్నీ ఒకరిద్దరు చేతుల్లోనే నడుస్తున్నాయని ఆయన అన్నారు. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని అన్నారు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కల్తీ కల్లును అరికట్టడంలో ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## బిజెపికి చిత్తశుద్ధి ఉంటే 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలి
### బిసిలపై మోడీ వివక్ష తగదు: మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇద్దరు బిసిలు కొట్టుకుంటే, అగ్రవర్ణకులాలవారికి కట్టబెట్టారని నిజమైన బిసి పక్షపాతి ఎవరో ప్రజలకు ఇప్పుడు తెలుస్తుందని మాజీ పిసిసి అధ్యక్షుడు మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్ష పదవినే ఇవ్వకుండా బిసిలపై అంత వివక్ష చూపి స్తున్న ప్రధాని మోడీ బిసి బిల్లును ఆమోదిస్తారా? అని అనుమానం వ్యక్తం చేశారు. షెడ్యూల్ 9 చట్టసవరణ చేసి 50శాతం రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ బిజెపి ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్ ఆమోదించాలి. వెనుకబడిన వర్గాలకు చెందిన మోదీ ప్రధానిగా ఉండి బిసి బిల్లుకు ఆమోదిస్తారా లేదా.?బిసి రిజర్వేషన్ లో బిజెపి ఎంపీల సంగతి, ప్రధాని మోదీ సంగతి ఏంటి అని ఈ పార్లమెంట్ సమావేశాల్లో చూస్తాం. బిసి పక్షపాతులు ఎవరు, వ్యతిరేకులు ఎవరు అనేది తేలిపోతుందని ఆయన అన్నారు. బిసి లు ఐక్యంగా ఉండాలి. కాంగ్రెస్ అధిష్ఠానం రిజర్వేషన్ పెంపుకు పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కులగణన జరుగదని కొందరు భావించారు కానీ శాస్త్రీయంగా నిర్వహించామని ఆయన తెలిపారు.

## ప్రమోషన్లకు అడ్డంకిగా ఉన్న అడ్వకసీ ఉత్తర్వులను ఉపసంహరించాలి

### ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి
### ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పనిచేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల ప్రమోషన్లకి అడ్డంకిగా ఉన్న అడ్వకసీ ఉత్తర్వులను వెంటనే ఉపసంహారించుకోవాలని ఎస్‌సి, ఎస్‌సి ఉపాధ్యాయ సంఘం టిఎస్ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాలు ఐక్యమై ఒకే బలమైన సంఘంగా ఏర్పడాలని భావించి సోమవారం హైదరాబాద్‌లో సమావేశమైన సంఘాలు ఎస్‌సి, ఎస్‌సి ఉపాధ్యాయ సంఘ: తెలంగాణ స్టేట్‌గా ఏర్పడినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులు ఐక్యంగా కలిసి పనిచేసి, సంఘాన్ని బలోపేతం చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించుకోవాలని నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ నూతన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెంట అంజయ్య తెలిపారు. రెండు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాలు ఐక్యమై, ఏకీకరణ చెంది, ఒకే బలమైన సంఘంగా ఏర్పడి.. మహానీయులు మహాత్మ జ్యోతిబాపూలే, భారతరత్న బాబా సాహెచ్ బిఆర్ అంబేద్కర్, సావిత్రి బాయి పూలేల ఆశయ సాధన కొరకు పనిచేయాలని తీర్మానించినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు వెంటనే ప్రమోషన్లు, ట్రాన్స్ ఫర్లు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయుల ప్రమోషన్లకు అడ్డంగా ఉన్న అడ్వకసీ ప్రభుత్వ ఉత్తర్వును నంబర్ 2ను, మెమో నంబర్ 26559ను రద్దు పర్చాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘాల ఏకీకరణ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని సామ్రాట్ అశోక భవనంలో నిర్వహించి ఏకగ్రీవంగా నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర అక్యక్షులుగా తొంట సత్యనారాయణ (యాదాద్రి భువనగిరి జిల్లా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్స్ గా సూర్యదేవర దానయ్య (రంగారెడ్డిజిల్లా), చాగంటి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెంట అంజయ్య(సిరిసిల్ల జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా నాంది సుశీల్ కుమార్(నిజామాబాద్ జిల్లా) రాష్ట్ర ప్రధాన సలహాదారుగా బండారు రవి వర్ధన్, రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పారునంది రామయ్య, మోతె సాయన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు నూతన రాష్ట్ర అధ్యక్షులు తొంట సత్యనారాయణ తెలిపారు.




జిఒ నంబర్ 49ను వ్యతిరేకిస్తూ ఆదిలాబాద్‌లోని ఉట్నూరులో బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ సంఘాల నేతలు

## ఆదిలాబాద్ బంద్ ప్రశాంతం
### జిఒ నంబర్ 49ను రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ అటవీ సంరక్షణ పేరిట కేంద్రం తీసుకువచ్చిన జిఒ 49ను వ్యతికేకిస్తూ ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు సోమవారం జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ సందర్భంగా ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. బంద్‌లో భాగంగా ఆదివాసీల హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) పలుచోట్ల శాంతియుతంగా ఆందోళనలు చేబట్టింది. బంద్ ప్రభావం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఉట్నూరులో ఎక్కువగా కనిపించింది. ఈ రెండు చోట్ల బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆదివాసీలు ఎక్కువగా వుండే ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల్, నిర్మల్‌లో బంద్ ప్రభావం పాక్షికంగా కనిపించింది. బంద్ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఆర్టీసీ బస్సులను డిపోల నుంచి బయటకు రాకుండా ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బంద్‌కు నాయకత్వం వహించిన ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జిఒ నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల ఆది వాసీలు తమ జీవనాధారాన్ని కోల్పోతారని వారు తెలిపారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పేరిట తమ జీవితాలను నాశనం చేయవద్దని వారు కేంద్రాన్ని కో రారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తమ విషయంలో అన్యాయంగా ఆలోచిస్తే పోరాటం ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. కాగా బంద్ సందర్భంగా వ్యాపారాలు, విద్యా సంస్థలు, హోటళ్లు స్వచ్ఛందంగా మూతపడ్డాయి.

# జిఒ 49ని నిలుపుదల చేసిన ప్రభుత్వం
## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 21:** రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందించింది. కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలును నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జీవో 49 ద్వారా కొమురంభీమ్ ఆసిఫాబాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది!

## 24న ఢిల్లీలో సిఎం రేవంత్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రెజంటేషన్
### డా. మల్లు రవి

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త :** రేవంత్‌రెడ్డి కులగణన, బిసి రిజర్వేషన్ అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఢిల్లీలో ఇవ్వబోతున్నారని ఎంపి మల్లు రవి తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిల కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపి డా. మల్లు రవి. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్లో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నాడు ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లి కార్జున ఖర్గేలతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు సమావేశమై రాష్ట్రంలో చేపట్టిన కులగణన,బీసీ లకు 42శాతం రిజర్వేషన్ అంశాలపై వారికి వివరించి వారి సలహాలను, సూచనలను స్వీకరించ నున్నారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కులగణన, బిసి రిజర్వేషన్లపై ఇందిరా భవన్ లో దేశంలోని కాంగ్రెస్ ఎంపీలందరికీ సిఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్ లో చర్చించాలని కోరనున్నారని తెలిపారు. పార్లమెంట్ లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరపాలని పట్టుబడితే పదేపదే సభను వాయిదా వేస్తున్నారని చెప్పారు.


## సిఎంగా రేవంత్ కనిష్టంగా పదేళ్లు.. గరిష్ఠంగా ఎన్నేళ్లయినా..!
### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** రేవంత్‌రెడ్డి కనిష్టంగా పదేళ్లు ముఖ్యమంత్రి గా ఉంటాడు గరిష్టం గా సిఎంగా గా ఎన్నేళ్లైనా ఆపదవిలో ఉండొచ్చు అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మాదే అని ధీమా వ్యక్తం చేశార.31 జిల్లాపరిషత్ లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. పాపం హరీష్ రావును చూస్తుం టే జాలేస్తుందని తుక్కు తుక్కై ఫామ్ హౌస్ గ్యారేజ్‌లో పడి ఉన్న కారు కు మళ్లీ గాలికొట్టేందుకు ఆయన అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో కారు టైర్లగాలిపోయింది, పార్లమెంట్ ఎన్నికల్లో ఇంజన్ పనికి రాకుండా పోయిందని భాష్యం చెప్పారు.బిఆర్ఎస్ పార్టీ బోరుకొచ్చింది దాన్ని బాగుచేయలేరు పాత ఇనుప సామాను కు కూడా పనికి రాదని అపహాస్యం చేశారు. హరీష్ రావు మాత్రం ఫామ్ హౌస్ లో మామతో కలిసి కూర్చుని దొంగ సర్వేలు తయారు చేసుకు వచ్చి ప్రచారం చేస్తున్నాడని ఆయన అన్నారు.31 జిల్లా పరిషత్ లకు 16 నుంచి 18 జిల్లా పరిషత్ లు బిఆర్ఎస్ గెలుస్తుందని హరీష్ రావు కాకమ్మ కబుర్లు చెపుతున్నాడని ఆయన అన్నారు. హరీష్ రావు ముందు సిద్ధిపేటజిల్లా పరిషత్ గెలువు అని సవాల్ విసిరారు. నీ దగ్గర జడ్పీటీసీలు గెలిపించుకో చాలు అని ఆయన అన్నారు. హరీష్ రావు కు గత అసెంబ్లీ ఎన్నికల్లో 82 వేల మెజార్టీ వచ్చిందని పార్లమెంటు ఎన్నికలకు వచ్చే సరికి సిద్ధిపేట లో బిఆర్ఎస్ అభ్యర్థి కి 40 వేల ఓట్లు తగ్గాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ సెగ్మెంట్లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఇప్పుడు 26,252 ఓట్లు తగ్గాయి.,అంటే పార్లమెంటు ఎన్నికల నాటికి మీ గ్రాఫ్ సగానికి సగం పడిపోయిందని అన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ పరిస్థితి ఏమిటో మీరే అర్థం చేసుకోండని అన్నారు. చచ్చిన పాము బిఆర్ఎస్ పార్టీ మీరెన్ని లేపనాలు పూసినా ఉపయోగం లేదు.. అది లేవదు అని అన్నారు. తెలంగాణ లో బిఆర్ఎస్ పార్టీకి ఒక్క జడ్పీ కూడా దక్కే అవకాశం లేదని ఆయన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని జడ్పీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని చెప్పారు.

## జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి
### పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను దూరం చేసేలా ఎన్ఇపి
### ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు అరుణ్‌కుమార్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ(బిజెపి) రూపొందించిన జాతీయ విద్యావిధానాని(ఎన్ఈపి)కి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాల్సి అవసరం ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మాజీ జాతీయ అధ్యక్షులు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్ అన్నారు. కొత్తగా రూపొందించిన ఎన్ఈపీ ద్వారా పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కానున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర కమిటీ నిర్వహించిన డైలాగ్ విత్ అరుణ్ కుమార్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు ఎం మమత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, బి శంకర్, అశోక్ రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్, లెనిన్, జె.రమేష్, అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో జాతీయ విద్యావిధానం 2020కు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించి, పోరాడాలని పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం పేరుతో దేశంలో విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ, వ్యాపారీకరణ కోసం బిజెపి పూనుకుందని.. పేద విద్యార్థులకు విద్యను మరింత దూరం చేసే కుట్రలో భాగంగానే ఎన్ఈపి-2020ని తీసుకొచ్చిందని విమర్శించారు. దేశంలో జాతీయ విద్యావిధానం పేరుతో ప్రజాస్వామిక హక్కులపై బిజెపి దాడి చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను విద్యలో అమలుచేసే చర్యలకు బిజెపి పాల్పడుతుందని అరుణ్ కుమార్ మండిపడ్డారు. విద్యా రుణాలు ఇచ్చిమరీ విదేశాలకు విద్యార్థులను వెళ్ళేలా ప్రోత్సహిస్తూ దేశ విద్యారంగాన్ని కార్పొరేట్, విదేశీ శక్తుల చేతుల్లోకి నెడుతుందన్నారు. విద్యార్థులు నిరంతరం వారి చదువులతో పాటు రాజకీయాలను కూడా అధ్యయనం చేయాలని.. అప్పుడే వ్యవస్థలో ఉన్న అసమానతలుకై పోరాడే తత్వాన్ని అలవర్చుకుంటారని చెప్పారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలను పరిష్కారించే దిశగా ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని పోరాటాలకి రావాలని అరుణ్ పిలుపునిచ్చారు.

## ఖర్గేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పిసిసి చీఫ్
### గాంధీభవన్‌లో బర్త్‌డే కేక్ కట్ చేసిన మాజీ ఎంపి విహెచ్



**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ సోమవారం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీకి వెళ్లి నేరుగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలి పారు. అయితే ఈ పర్యటన రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తిగా మారింది. ఖర్గే జన్మ దిన శుభాకాంక్షలు తెలిపేందుకే టిపిసిసి వెళ్ళినప్పటికి రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల దృష్ట్యా మహేశ్ కుమార్ ఢిల్లీకి రప్పించు కొన్నారని పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల రాబోయే పదేళ్ళు నేనే సిఎంగా ఉంటానని అనడం పార్టీలోని కాంగ్రెస్ నాయకులను ఇబ్బంది పెడుతోన్నది. అదే జిల్లా నుంచి చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ ఒక ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు రోజు రోజుకు పెరిగిపోతున్న క్రమశిక్షణా రాహిత్యం, స్థానిక సంస్థల వంటి అంశాలపై ఎఐసిసి పెద్దలతో మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించినట్లు తెలుస్తోంది. తెలం గాణలో త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం, నామినేటెడ్ పదవుల భర్తీ అంశంపై కసరత్తు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో టిపిసిసి అధ్యక్షుడి ఢిల్లీ పర్యటన ఆసక్తిగా మారింది. ఆర్డినెన్సు రూపంలో బిసి రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఆర్డినెన్స్ ను గవర్నర్ వద్దకు పంపగా దానిని గవర్నర్ న్యాయసలహా కోసం పంపించారు. గవర్నర్ వద్ద ఏదైనా ఆటంకం ఏర్పడితే రాజకీయంగా బిసి 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధం అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రె డ్డి గతంలోనే చెప్పారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల నాటికి నామినేటెడ్ పోస్టుల భర్తీ చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన శుభా కాంక్షలు తెలిపేందుకు ఢిల్లీ వెళ్ళిన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్ కుమారులకు ఢిల్లీ ఎయిర్ పోర్టుల తెలంగాణ పిసిసిఆన్ ఆర్గనైజ్డ్ వర్కర్స్ విభాగం చైర్మన్ కౌశల్ సమీర్, టిపిసిసి ఎన్నికల ప్రచార కమిటీ కో కన్వీనర్ పృథ్వీరాజ్ నాయక్‌లు ఘనస్వాగతం పలికారు.

మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. హన్మంతరావు బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి ఆయన నిండునూరేళ్ళు ప్రజసేవలో ఉండాలని శుభాకాంక్షలు తెలుపుతూ ఆశాభావం వ్యక్తంచేశారు. ఢిల్లీలో ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ ఖర్గేను కలిసి శుభకాంక్షలు తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి కెసివేణుగోపాల్, తెలంగాణ మంత్రులు వివేక్‌వెంకటస్వామి, ఎంపిలు కలిసి మల్లికార్జునఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు.

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వాహనంపై దాడి కేసులో నలుగురు అరెస్టు

**హైదరాబాద్ (తార్నాక, కంటోన్మెంట్) జూలై 21 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వాహనంపై ఆదివారం రాత్రి జరిగిన దాడి ఘటనలో పోలీసులు సోమవారం సాయంత్రం నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించడంతోనే తాము ఎమ్మెల్యే వాహనం ఆపి అడిగినట్లు అరెస్టు అయిన వారు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌తోపాటు మరో మూడు వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించారని ఈ విషయంపై తాము ఎమ్మెల్యే వాహనానికి అడ్డుగా వెళ్లి ఏమిటి ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తారా అని ప్రశ్నించామని చెప్పడం జరిగిందని అరెస్టు అయిన వారు చెప్పారు. తుకారాంగేట్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో శ్రీగణేష్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు తనపై ఉద్దేశ పూర్వకంగానే దాడి జరిపారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

## జెన్‌కోలో సమ్మె నిషేధం

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త :** తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజి జెన్కో) ఉద్యోగులకు బిగ్ షాక్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రానున్న ఆరు నెలల పాటు జెన్కో ఉద్యోగులు ఎలాంటి సమ్మెలు చేయడానికి వీల్లేదు. ఈ నెల 27 నుంచి ఈ నిషేధ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు సర్కార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా ప్రయోజనార్థం జెన్కోలో సమ్మెలను నిషేధించడం జరిగిందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్, 1971 ప్రకారం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్మయం తీసుకోవడం జరిగిందన్నారు. విద్యుత్ సరఫరా అనేది అత్యవసర సేవ కాబట్టి, సమ్మెల వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## యాంత్రీకరణ పట్ల రైతుల్లో ఆసక్తి

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త :** యాంత్రీకరణలో భాగంగా ట్రాక్టర్లు, ఇతర పరిక రాలతోనే సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కూలీల సమస్యను అధిగమించడంతోపాటు, పనులు త్వరగా పూర్తయ్యేం దుకు ఈ ప్రక్రియ దోహద పడుతుందని భావిస్తున్నారు. వ్యవసాయ యంత్రాలపై రాయితీ తో వారికి ఊరట లభించినట్లయింది. ఈ సీజన్‌లో వివిధ పంటల సాగుకు యంత్ర పరికరాలు అవసరమవుతుంటాయి. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంలో గతంలో ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్ర సామగ్రి అందజేశారు. ముఖ్యంగా రోటోవేటర్, మూడు కాళ్ల నాగళ్లు, దమ్ము చక్రాలు, చిన్న స్టౌవ్, పెద్ద స్టౌవ్, పురుగు మందు పిచికారి చేసే డబ్బాలు రైతులకు ఈ పథకం ద్వారా సమకూర్చారు. ఇవి గతంలో 50 శాతం రాయితీపై అందుబాటులో ఉండేవి. అయితే నాలుగు సంవత్సరాలుగా పూర్తిగా నిలిపివేశారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించింది.

మరోపక్క వ్యవసాయ యంత్ర పరికరాల ఉపయోగాలపై అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. మొదట వ్యవసాయ పరికరాలు, యం త్రాలతో జిల్లాలో సదుస్సులు నిర్వహించనున్నారు. వీటిలో పరికరాల ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు, నిపుణులు పాల్గొని వాటి ఉపయోగం, పనిచేసే విధానం, ధరలు, రాయితీ అంశాలపై వివరించనున్నారు. అదే సమయంలో అవసరమున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకొని అర్హులకు ఇవ్వడానికి కసరత్తులు చేస్తున్నారు.

## ఆసిఫ్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామీద్‌పై దుండగుల దాడి

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** నాంపల్లి ఆసిఫ్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామీద్‌పై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుండగులు దాడికి పాల్పడ్డారు.


దాడిలో తీవ్రగాయాలపాలైన కాంగ్రెస్ అధ్యక్షుడు హామీద్

ఈ ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హామిద్ తమ పార్టీ కార్యా లయంలో కార్య కర్తలు, నేతలతో చర్చి స్తుండడంతో ఒక్కసారిగా సుమా రు పదిహేను మంది ముకు మ్మడిగా దూసు కువచ్చి ఆయనపై విచక్షణ రహితంగా దాడి చేయడం తో రక్తపు మరకలతో తీవ్రగాయ పడ్డాడు. అంతటితో ఆగ కుండా హంగామా చేస్తూ లోపల ఫర్నిచర్, శ్రేణుల బైక్‌లను సైతం ధ్వంసం చేయడం తో నేరుగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటీన కార్యాలయానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల గుర్తించేందుకు సీసీకెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## తెలంగాణలో పెరిగిన తలసరి వ్యయం

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త :** తెలంగాణలో ఏడాది కాలంలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పెరిగిందని కేంద్రం వెల్లడించింది. పట్టణాల్లో తలసరి సగటు వినియోగ వ్యయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, గ్రామీణంలో కేరళ తలసరి ఆదాయంలో (రూ.6,611) అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. తెలంగాణలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పట్టణాల్లో రూ.820, గ్రామాల్లో రూ.633లకు పెరిగిందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర కుటుంబ వినియోగ వ్యయం సర్వే 2023-24లో తలసరి నెలవారీ ఖర్చు గ్రామాల్లో రూ.5,435కి, పట్టణాల్లో రూ.8,978కి చేరినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో వ్యయం చూసుకుంటే రూ.4,122 ఉండగా, పట్టణాల్లో రూ.6,199గా ఉంది. ఆదాయ వర్గాల వారీగా చూస్తే తెలంగాణలో గరిష్ఠంగా నెలకు రూ.12,619 ఖర్చు అవుతుంది. ఇక తెలంగణాలో విద్యపై గ్రామీణ ప్రాంతాల్లో నెలకు తలసరి రూ.183, పట్టణాల్లో రూ.713.89 ఖర్చు చేస్తున్నారు. పట్టణాల్లో చదువుల కోసం తెలంగాణలోనే అత్యధిక వ్యయం అవుతోందని నివేదిక తెలిపింది.

# జస్టిస్ వర్మ మీకు స్నేహితుడా?



## న్యాయసూత్రాలు మాకు చెప్పకండి

## న్యాయవాదిపై సుప్రీం చీఫ్‌జస్టిస్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, జూలై 21:** ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారంతో అభిశంసన ముప్పు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో సుప్రీంకోర్టు సీరియస్ గా స్పందించింది. జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్ ను తోసిపుచ్చింది. ఈ పిటిషన్ ను అత్యవసరంగా విచారించాలని దరఖాస్తుదారుడి తరఫు న్యాయవాది చేసిన వినతిని తోసిపుచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ యశ్వంత్ వర్మను 'వర్మ' అంటూ సంబోధించిన లాయర్ పై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.'జస్టిస్ యశ్వంత్ వర్మను, వర్మ అని సంబోధిస్తున్నారు. ఆయన మీ స్నేహితుడా' అని సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రశ్నించారు. జస్టిస్ వర్మ ఇప్పటికీ న్యాయమూర్తేనని గుర్తుచేశారు. ఓ హైకోర్టు న్యాయమూర్తిని ఎలా సంబోధించాలో తెలియదా అంటూ సీరియస్ అయ్యారు. దీంతో న్యాయవాది మాథ్యూస్ నెడుంపర స్పందిస్తూ.. జస్టిస్ యశ్వంత్ వర్మ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. ఈ ఆరోపణల కారణంగా న్యాయమూర్తి స్థానానికి ఆయన సరితూగరని అన్నారు. ఈ వివరణతో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ మరింత సీరియస్ గా స్పందించారు. తమకు న్యాయ సూత్రాలు బోధించే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషనర్ తరఫు న్యాయ వాదిని సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ మందలించారు. ఆయన ఇంట్లో నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంలో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదే అంశంలో ఈ పిటిషన్ మూడోదని, దీన్ని అత్యవసర విచారణ కోసం జాబితా చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్ ధర్మాసనం ఎదుట న్యాయవాది మాథ్యూస్ నెడుంపారా కోరారు. ఇప్పుడు కొట్టివేయమంటారా అని ప్రశ్నించారు. పిటిషన్‌ను తగిన సమయంలోనే జాబితా చేస్తామని సీజేఐ తెలిపారు. న్యాయవాది నెడుంపారా మాట్లాడుతూ పిటిషన్‌ను కొట్టివేయడం అసాధ్యమని ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందేనన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు జరపాలన్నారు. అయితే, హైకోర్టు న్యాయమూర్తిని వర్మ అని ఏకవచనంతో న్యాయవాది సంబోధించడంతో ధర్మాసనం సీనియస్‌గా తీసుకుంది. 'ఆయనకు మీకు స్నేహితుడా? ఆయన ఇప్పటికీ జస్టిస్ వర్మే. మీరు ఆయనను అలా ఎలా సంబోంధిస్తున్నారు? కొంత మర్యాద ఇవ్వండి. మీరు ఓ న్యాయమూర్తిని అలా సూచిస్తున్నారు.

అతను ఇప్పటికీ న్యాయ మూర్తే' అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. దానికి న్యాయవాది బదులిస్తూ 'ఈ గొప్పదనం ఆయనకు వర్తించదని అనుకుంటున్నా. పిటిషన్‌ను జాబితా చేయండి' అని పేర్కొనడంతో సీజేఐ స్పందిస్తూ 'మీరు కోర్టుకు దిశానిర్దేశం చేయొద్దు' అంటూ తీవ్ర హెచ్చరికలుచేసారు. ఇదిలా ఉండగా అంతర్గత దర్యాప్తు కమిటీ నివేదికను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ సర్వో న్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ముగ్గురు న్యాయ మూర్తులతో కూడిన విచారణ కమిటీ నివేదికను కొట్టివేయాలని జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును కోరారు. కమిటీ నివేదిక తన హక్కులను ఉల్లంఘించిందని, కమిటీ రిపోర్టు ఆధారంగా తనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభించాలన్న మాజీ చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచనను పక్కన పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వాస్త వాలను పరిశీలించకుండానే విచారణ కమిటీ తుది నిర్ణయానికి వచ్చిందని, బర్డెన్ ఆఫ్ ప్రూఫ్‌ను తనపై మోపడం తప్పని పేర్కొన్నారు.

కమిటీ అభిప్రాయాలను తప్పని నిరూపించాల్సిన బాధ్యతను తప్పుగా తనపై మోపారని ఆరోపించారు. తనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభించాలన్న సూచనపై అభ్యంతరం వ్యక్తం చేశా రు. ఇదిలా ఉండగా పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలైన విషయం తెలిసిందే. ఆయనపై అభిశంసనకు మార్గం సుగమమైంది. అభిశంసనకు సం బంధించిన తీర్మానంపై 160 మందికిపైగా ఎంపిలు సంతకాలు చేసి స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌లకు అందచేసారు.

## అచ్యుతానందన్ మృతికి సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 21:** కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ రాజకీయ నాయకులు వి.ఎస్. అచ్యుతానందన్ మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కార్మిక ఉద్యమాల నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగిన అచ్యుతానందన్, ముఖ్యమంత్రిగా కేరళ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. అచ్యుతానందన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆదర్శ నేతగా నిలిచిన అచ్యుతానందన్: కెటిఆర్

సీపీఎం జాతీయ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు.

నిజాయితీగా, ప్రజాహితం కోసం పనిచేసి, ఆదర్శ నేతగా నిలిచిన అచ్యుతానందన్.. రాజకీయ జీవితాన్ని ఎంతో స్ఫూర్తివంతంగా గడిపారని అన్నారు. మూడుసార్లు ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా ప్రజలకు అందించిన ఆయన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని కేటీఆర్ కొనియాడారు. సీపీఎం వ్యవస్థాపక సభ్యుడిగా ప్రజల పక్షాన పోరాడిన ఆయన జీవితం, అనేక తరాలకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. అచ్యుతానందన్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మచ్చలేని మహానేత విఎస్ అచ్యుతానందన్

### ప్రజాఉద్యమాల నిర్మాణంలో ఆయనది కీలకపాత్ర

### సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత విఎస్ అచ్చుతానందన్ అని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యుడు బివి రాఘవులు అన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆదర్శాలను పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అచ్యుతా నందన్ చిత్ర పటానికి రాఘవులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, పి.ప్రభాకర్, బండారు రవికుమార్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బాబూరావు, స్కైలాబ్‌బాబు, ఆశయ్య, ఉడుత రవీందర్, సీనియర్ నాయకులు రాజారావు, అరిబండి ప్రసాదరావు, వంగూరు రాములు పాల్గొన్నారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ… సిపిఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన వారిలో ఆయనొకరని గుర్తుచేశారు. పార్టీ ఏర్పడినప్పుడు ఉన్న 32 మందిలో చివరన మరణించిన వారు వీఎస్‌నే అన్నారు. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా సైద్ధాంతిక, ప్రజా పోరాటాల్లో రాజీపడని వ్యక్తి వీఎస్ అని చెప్పారు. దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో తనదంటూ ఒక ముద్ర వేసిన నేత అనీ, సైద్ధాంతిక అంశాలపై రివిజనిస్టుల ధోరణిని ప్రశ్నించి పోరాడిన వారిలో ఒకరన్నారు.

## అన్నవరం దేవేందర్‌కు దాశరథి అవార్డు

### శతజయంతి సందర్భంగా మహాకవిని స్మరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 21:** తెలంగాణ రైతాంగ సాయధ పోరాటంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి.. నిజాం నిరంకుశ పాలనపై ధిక్కార స్వరం వినిపించిన మహనీయుడు ఉద్యమ వైతాళికుడు, మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతి సందర్భంగా తెలంగాణకు, సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి నిరంకుశ పాలన మీదికి ఎక్కు పెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అన్నారు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ కోసం ఉద్యమించిన దాశరథి చిరస్మరణీయుడని కొనియాడారు.

ప్రజల్లో చైతన్యం నింపిన ధిశాలి. తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి. అనునిత్యం సమ సమాజం కోసం తపించిన గొప్ప వ్యక్తి దాశరథి అన్నారు.

కథలు, నాటికలు, సినిమా పాటల రచనల ద్వారా తెలుగు భాషకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలోనూ విశేషంగా కృషి చేశారన్నారు. తెలుగు సినిమా సాహిత్యం లోను విశిష్ట స్థానం సంపాదించారన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో దశారథి రచించిన పద్యాలు, పాటలు ఇప్పటికీ ప్రజలందరికీ ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. దశారథి స్ఫూర్తితోనే తెలంగాణ తొలి, మలి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలను ప్రజా ప్రభుత్వం ఘనంగా సన్మానించి, చేయూత అందించడం జరిగిందన్నారు. ప్రతి యేడాది దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ప్రకటించే దాశరథి కృష్ణమాచార్య అవార్డు-2025ను కవి, వ్యాసకర్త అన్నవరం దేవేందర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయనకు రూ.1,01,116ను నగదును, ఒక మెమోంటోను, శాలువాను అందజేయనున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా ప్రపంచానికి తెలిసింది

### పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జూలై 21:** దేశవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా జరగాలని ఆకాంక్షించారు. దేశ ప్రగతి కోసం అందరూ కలిసి నడవాల్సిన సమయమిదంటూ అభిప్రాయపడ్డారు. శుభాంశు శుక్లా రోదసి యాత్ర, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రధాని ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ సైనికుల సత్తా చూశామని, అందులో వందశాతం లక్ష్యాలను సాధించామని మోదీ తెలిపారు. కచ్చితమైన లక్ష్యంతో కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని అన్నారు. ఆ ఆపరేషన్‌తో మేడిన్ ఇండియా సైనిక సామర్థ్యం, గొప్పతనం ఏంటో ప్రపంచం చూసిందని వ్యాఖ్యానించారు. తాను ఎవరిని కలిసినా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతున్నారని చెప్పారు. మన ఆయుధాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోందని, అందుకే దేశ ప్రగతి కోసం అందరూ కలిసి నడవాల్సిన సమయమిదని తెలిపారు. ఉగ్రవాదం, నక్సలిజాన్ని తుదముట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని. మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయిని మోదీ వెల్లడించారు. అయితే ఆపరేషన్ సిందూర్‌పై మన ఎంపీలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పర్యటించి వివరించారని ప్రధాని గుర్తు చేశారు. దాయాది దేశం పాల్పడిన దుష్ట చర్యలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టారని తెలిపారు. తుపాకులు, బాంబుల ముందు మన రాజ్యాంగం బలంగా నిలబడిందని వ్యాఖ్యానించారు. అందుకే పార్లమెంట్ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వేడుక చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఐక్యత చాలా అవసరమని అన్నారు. ఎంపీలు, రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. మరోవైపు, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశానికి చాలా గర్వకారణంగా నిలవబోతున్నాయని మోదీ తెలిపారు.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని చెప్పారు. ముఖ్యంగా అంతరిక్ష యాత్రలో ఇదో ప్రేరణ అని, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుందిని మోదీ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తుండడం వల్ల, ఇది రైతులకు లాభదాయకమని చెప్పారు.

## జూరాలకు స్వల్పంగా తగ్గిన వరద

### 8 గేట్లు ఎత్తి నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 21, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. కర్ణాటక నుంచి భారీగా వరద ప్రవాహం నమోదు కావడంతో జూరాలకు జలకళను సంతరించుకున్నది. జలాశయానికి 72,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 3.956 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 31,806 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 31,464 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 600 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 67,001 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## ఆర్థికలోటు..'ఆన్‌లైన్ల' కాటు!

### రాక్షసక్రీడకు అదొక పరిచయవేదిక

### హైదరాబాద్‌లో ఆరు నెలల్లో 20 మంది ఆత్మహత్య

### తాజాగా రంగంలోకి దిగిన ఇడి..

### విచారణ నోటీసులు అందజేత

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** ఆర్థికమాంధ్య ప్రభావం..ఈజీ సంపాదన అలవాటుపడి బెట్టింగ్‌యాప్‌లతో ఎంతోమంది డబ్బులు పోగొట్టుకొని చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో నిషేదమున్న యధేచ్ఛగా అక్రమార్కులు నడపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాప్‌లపై సినీ నటులతో ప్రమోట్ చేయడంతో పోలీసులు కేసు నమోదు చేయగా ఈడీ విచారణ నోటీసులు జారీ చేసింది. అయితే హైదరాబాద్‌లో పదుల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకోగా ఏప్రిల్ ఒక నెలలోనే ఆరుమంది తనవుచాలించారు. దీనిపై పబ్లిక్ రెస్పాన్స్ అగనెస్ట్ హెల్ప్ లెస్నిస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెసల్ (ప్రహార్) జరిపిన సర్వేలో డబ్బు సంపాదించేందుకు అధికశాతం ఆడుతున్నారని పేర్కొంది.

**ఎనిమిదేళ్ల క్రితమే రాష్ట్రంలో నిషేధం..**

రాష్ట్రంలో ఎనిమిదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపింది. కట్టడి చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టిన ఎక్కడో ఒకచోట అక్రమంగా బెట్టింగ్‌కు పాల్పడుతూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినోలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఆడేందుకు ఎక్కువగా సోషల్‌మీడియానే వాడుతున్నారు. గేమింగ్ వల్ల యువతే ఎక్కువగా నష్టపోతున్నారు. రెండు నెలల క్రితం ఏప్రిల్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఆరుమంది యువకులు యాప్‌కు బలికాగా.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో గత ఆరునెలల్లో పదుల సంఖ్యలో మృతిచెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. సరిగా ఆరు రోజుల క్రితమే హైదరాబాద్‌లోని దుండిగల్‌కు చెందిన ఇరవై ఏళ్ల రమాకాంత్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. చిన్నపాటి ఫైనాన్షియల్ సమస్యతో ఆన్‌లోన్‌లో లోన్ తీసుకొని చెల్లించలేదు. దీంతో వేధింపులతో బెట్టింగ్‌యాప్‌లను ఆశ్రయించగా నష్టపోవడంతో చివరకు మరణశాసనం రాసుకున్నాడు.

కొంత అక్రమార్కులు డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ గేమ్స్ యాప్‌లో కూడా సెట్టింగ్‌లకు మార్పులు చేస్తూ ఒకరికోఇద్దరికో డబ్బుల రాబడి ఆశ చూపి యువత నుంచి రూ.లక్షలు, కోట్లు కొల్లగొడుతున్నారు. ఇది యువత తెలుసుకోకపోవడంతో వ్యసనంగా మారి ఊబిలోకి దిగుతున్నారు. బయటకు రాలేక ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. టాస్క్‌ఫోర్సు, ఎస్ఓటీ పోలీసులు బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులపై గట్టి నిఘా ఏర్పాటు చేసిన వెలుగులోకి రావడం లేదు.

**ఓ ప్రైవేటు సర్వేలో '97శాతం డబ్బులక్షే.. ఆసక్తి**

పబ్లిక్ రెస్పాన్స్ అగనెస్ట్ హెల్ప్ లెస్నిస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెసల్ (ప్రహార్) జాతీయ సంస్థ నెలల క్రితం బెట్టింగ్ యాప్‌ల వినియోగంపై సర్వే చేపట్టింది. అయితే ఇందులో ంచలన నిజాలు వెలుగుచూశాయి. పలు అంశాలపై ప్రశ్నించగా.. రియల్ మనీ గేమ్స్ చట్టవిరుద్ధమని తెలిసినా మానేయలేం అని 96 శాతం ఉండగా…డబ్బు సంపాదించడానికి 97 శాతం, వినోదం కోసం 61 శాతం, 87 శాతం మంది ప్రతి రోజు ఆడుతున్నారని తేలింది. మూడింట రెండు వంతుల వరకు 30 ఏళ్ల లోపు వారు ఉంటే 18 నుంచి 25 వయస్సుల వారు 45 శాతం, 26-30 ఏళ్ల వయస్సు వారు 17 శతం మంది రాక్షక్రీడకు బలయ్యారు. పురుషులు 78, మహిళలు 22 శాతం మంది ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది.

## ఆరునెలల్లో ఎయిర్‌ఇండియాకు 9 షోకాజ్ నోటీసులు

### పార్లమెంటులో కేంద్రమంత్రుల వెల్లడి

**న్యూఢిల్లీ, జూలై 21:** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఎయిర్‌ఇండియాకు ఆరునెలల్లో తొమ్మిది షోకాజ్‌నోటీసులు జారీ అయ్యాయి. భద్రతా నిబంధనలు ఉల్లంఘన కింద పౌర విమానయాన శాఖ పరిధిలోని డిజిసిఎ, సేఫ్టీ సంస్థలు ఈనోటీసులు జారీచేసినట్లు పౌరవిమానయానశాఖమంత్రి మురళీధర్ మోహోల్ రాజ్యసభలోప్రకటించారు. ఒక తీవ్రస్థాయి ఉల్లంఘన పరిధిలో చట్టపరమైన చర్యలు కూడా తీసుకున్నట్లు మంత్రిత్వశాఖ వెల్లడించింది. కూలిన సంఘటనకు సంబంధించి ఎలాంటిప్రతికూలమైన నివేదికలు ఇప్పటివరకూ అందలేదని వెల్లడించారు. అయితే భద్రతా ఉల్లంఘనల కింద నోటీసులు మాత్రం జారీచేసామన్నారు. సిపిఎం సభ్యుడు జాన్‌బ్రిట్టాస్ అడిన ప్రశ్నలపై మంత్రి సమాధానం ఇచ్చారు. అహ్మదాబాద్ విమానప్రమాదం జరిగిన వెనువెంటనే డిజిసిఎ విచారణకు ఆదేశించింది. మొత్తం 33 విమానాల్లో 31 విమానాలు కొనసాగుతున్నాయి. వీటిని తనిఖీచేయగా స్వల్ప లోపాలు ఎనిమిది విమానాల్లో కనిపించాయి. వీటిని సవరించిన తర్వాతనే కార్యకలాపాలకు అనుమతులిచ్చామన్నారు. మిగిలిన రెండు విమానాలు ప్రస్తుతం మెయింటెనెన్స్‌లో ఉన్నట్లు పౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు బిజెపి సభ్యుడు అశోక్‌రావ్ శంకర్‌రావు చవాన్ అడిన ప్రశ్నకు జవాబు ఇచ్చారు. ఈ విమానప్రమాదంపై విద్రోహచర్యలు ఉన్నాయా అన్న డిఎంకె ఎంపి కణిమొళి ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ అన్ని కోణాల్లోకూడా విచారణచేస్తున్నట్లు తెలిపారు. డిజిసిఎ డైరెక్టర్‌జనరల్ ఈ ఏడాది ఏప్రిల్‌వరకూ 254 క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని, గత ఏడాది 673 కార్యాచరణ చర్యలు చేపట్టారని, అలాగే 2023లో 542 సార్లు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. హెచ్చరికలు చేయడం, సస్పెన్షన్, రద్దు, ఆర్థికంగా భారీ జరిమానాలు విధించడం వంటివి ఈచర్యల్లో ఉన్నట్లు మంత్రి వివరించారు.



## జగన్మోహన్‌రావు ఎంపికకు బ్యూరోక్రాట్లు సహకరించినట్లు నిర్ధారణ

### రాజకీయ ఒత్తిడితోనే హెచ్‌సిఎ ఎన్నికల్లో వారు ఓట్లు వేశారు

### హెచ్‌సిఎ అక్రమాలపై సిఐడి విచారణలో సంచలన అంశాలు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాలపై సిఐడి విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. హెచ్‌సిఎ అధ్యక్షుడుగా జగన్‌మోహన్‌రావు ఎన్నికయ్యేందుకు రాష్ట్రంలోని కొందరు బ్యూరోక్రాట్లు (ఐఎస్, ఐపిఎస్‌లు) చట్ట వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని సిఐడి విచారణలో వెలుగు చూసింది. జగన్‌మోహన్‌రావు మొదట శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌లో సభ్యుడుగా చేరి ఆరు నెలలకే హె చ్‌సిఎ అధ్యక్ష పదవికి పోటీ చేశాడని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఇప్పటికే నిర్ధారించిన సిఐడి తాజాగా 23 ఇన్‌స్టిట్యూషన్లకు చెందిన ఓట్లను దొడ్డిదారిన వేయించుకున్నాడని తేల్చింది. 23 ఇన్‌స్టిట్యూషన్లకు చెందిన ఓట్ల స్థానంలో అసలైన వారికి బదులు కొందరు బ్యూరోక్రాట్లను ఓటర్లుగా చే ర్చి వారిచేత జగన్‌మోహన్‌రావు ఓట్లు వేయించుకున్నట్లు సిఐడి తాజా విచారణలో తేలింది. నిబంధనల ప్రకారం ఇన్‌స్టిట్యూషన్ల తరపున నిర్వాహ కులకు మాత్రమే ఓట్లు వుంటాయి. హెచ్‌సిఎ ఎన్నికల్లో వీరు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనాల్సి వుండగా గత ఎన్నికల సమయంలో దీనికి విరుద్ధంగా జగన్‌మోహన్‌రావు తనకున్న రాజకీయ పలుకుబడితో అసలైన ఓటర్లకు బదులు బ్యూరోక్రాట్లను ఓటర్లుగా చేయించి వారిచేత ఓట్లు వేయించు కున్నాడని సిఐడి విచారణలో తేలింది. ఓట్లు వేసిన బ్యూరోక్రాట్లలో సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు వున్నట్లు సిఐడి విచారణలో తేలింది. హెచ్‌సిఎ ఎన్నికల్లో బ్యూరోక్రాట్లు ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది? ఒకరికి అనుకూలంగా ఎందుకు ఓటు వేయాల్సి వచ్చింది? దీని వెనుక గల కారణాలు ఏమిటీ…? ఎవరైనా రాజకీయ నేతల ఒత్తిడితో బ్యూరోక్రాట్లు హెచ్‌సిఎ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రావుకు అనుకూలంగా ఓట్లువేశారా? ఒకవేళ రాజకీయ ఒత్తిళ్లు వుంటే? వారు ఎవరు? అనే కోణంలో సిఐడి అధికారులు విచారణ చేస్తున్నారు. దీనిపై అప్పట్లో జగన్ మోహన్‌రావుకు అనుకూలంగా ఓట్లు వేసిన బ్యూరోక్రాట్లను విచారించాలని సిఐడి భావిస్తోంది. హెచ్‌సిఎ అక్రమాలకు సంబంధించిన కేసులో అధ్య క్షుడు జగన్ మోహన్‌రావు, కోశాధికారి శ్రీనివాసరావు, సిఈఓ సునీల్ కంటే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్ర టరీ రాజేందర్ యాదవ్, అధ్యక్షురాలు కవితను అరెస్టు చేసిన సిఐడి వీరిని ఐదురోజులుగా కస్టడీలోకి తీసుకుని విచారిస్తుండడం తెలిసిందే.

### ఆసియా జూ.ఛాంపియన్‌షిప్‌లో

# భారత్ ఓటమి

## 104-110 తేడాతో జపాన్ విక్టరీ



**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్-2025, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది. జూనియర్ ప్రపంచ నంబర్ 1 తన్వి శర్మ నేతృత్వంలోని భారత జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌తో సోమవారం జరిగిన హోరాహోరీ పోరులో 104-110 తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమితో బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లలో మిక్స్‌డ్ టీమ్ పతకం కోసం భారత్ ఆశలు ఆవిరయ్యాయి. దశాబ్దం క్రితం 2011లో ఈ ఈవెంట్‌లో చివరిసారిగా భారత్ పతకం సాధించింది. సెమీఫైనల్స్‌లో, తన్వి తొలి మ్యాచ్‌ను 9-11 తేడాతో యుజునో వటనాబే చేతిలో ఓడించడంతో భారత్ అత్యుత్తమ ఆరంభాలను పొందలేదు. అయితే, పురుషుల డబుల్స్ జత భార్గవ్‌విశ్వ తేజ్, మహిళల డబుల్స్ జత వెన్నలరేషిక, మిక్స్‌డ్ డబుల్స్ జత భవ్యరేషిక అందరూ తమ తమ మ్యాచ్‌లను గెలిచి భారత్ 44-35 ఆధిక్యంలోకి వెళ్లడానికి సహాయపడటంతో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. డబుల్స్ మ్యాచ్‌లలో ఆధిపత్యంతో భారత్ సునాయాస విజయం సాధించాలని చూస్తుండగా, సింగిల్స్ విభాగంలో జపాన్ మరోసారి పరాభవం ఎదురైంది.. ఐదవ మ్యాచ్‌లో హ్యూగ్ టకానో రౌనక్ చౌహాన్‌పై విజయం సాధించగా, వటనాబే మరోసారి తన్విని ఓడించి జపాన్ 66-60 ఆధిక్యంలోకి వెళ్లడానికి సహాయపడింది. అప్పటి నుండి, భారతదేశం తిరిగి వచ్చే అవకాశం లేదు. పదవ మరియు చివరి మ్యాచ్‌లో చౌహాన్ సాహసోపేతమైన ప్రయత్నం చేసినప్పటికీ, భారత్ 104-110తో వెనుకబడి అంతరం పూడ్చడం సాధ్యం కాలేదు. ఈ పోటీలో ముందుగా, భారతదేశం మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది.
వారు శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మరియు హాంకాంగ్‌లను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.

### హంగేరీ సిరీస్‌లో భారత్ మహిళల జట్టుకు

# 10 పతకాలు



**న్యూఢిల్లీ:** హంగేరీ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత్ 10 పతకాలతో తన ప్రచారాన్ని ముగించింది. బుడాపెస్ట్‌లో జరిగిన పొలియాక్ మెమోరియల్ ర్యాంకింగ్ సిరీస్-2025లో భారత్ మహిళల జట్టు టైటిల్‌తో పాటు, రెజ్లింగ్‌లో మొత్తం పది పతకాలతో (మూడు స్వర్ణాలు, మూడు రజతాలు మరియు నాలుగు కాంస్యాలతో) విజయవంతమైన ప్రచారాన్ని ముగించింది. పోటీల చివరి రోజున, అండర్ 23 ఆసియా ఛాంపియన్ సుమిత్ 60 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా తన తొలి సీనియర్ అంతర్జాతీయ పతకాన్ని సాధించాడు. సెమీఫైనల్‌లో అతను కజకిస్తాన్‌కు చెందిన గాలిమ్ కబ్దునస్సారోవ్‌ను 10-1 తేడాతో ఓడించాడు. అయితే, ఫైనల్‌లో, సుమిత్ 1-5 తేడాతో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అజర్‌బైజాన్‌కు చెందిన నిహత్ మమ్మద్లి చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంతకుముందు జరిగిన 55 కిలోల కాంస్య పతక పోరులో అనిల్ మోర్ 7-4 తేడాతో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఇఖ్తియోర్ బొటిరోవ్‌ను ఓడించి, టోర్నమెంట్‌లో భారతదేశానికి తొలి గ్రీకో రోమన్ పతకాన్ని అందించాడు. మహిళల రెజ్లింగ్ జట్టు ఒక రోజు ముందే తమ ఈవెంట్లను ముగించి, 130 పాయింట్లతో జట్టు స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. వారి ప్రచారానికి అంతిమ్ పంఘల్ నాయకత్వం వహించారు, ఆమె 53 కిలోల టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా తన స్వర్ణ పరంపరను కొనసాగించింది. 20 ఏళ్ల ఒలింపియన్ గత నెలలో మంగోలియాలోని ఉలాన్‌బాతర్‌లో విజయం సాధించిన తర్వాత, ఫైనల్‌లో రష్యాకు చెందిన నటాలియా మలిషేవాను 7-4 తేడాతో ఓడించి తన వరుసగా రెండవ ర్యాంకింగ్ సిరీస్ స్వర్ణాన్ని గెలుచుకుంది. 72 కిలోల ఫైనల్లో హర్షిత అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది, నాలుగుసార్లు ఆసియా ఛాంపియన్ కజకిస్తాన్‌కు చెందిన జామిలా బక్‌బెర్గెనోవాను 100 తేడాతో ఓడించి బంగారు పతకాన్ని సాధించింది.



# ఆస్ట్రేలియా జయభేరి

## టి 20లో 3 వికెట్ల తేడాతో వెస్టిండీస్ ఓటమి

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో తొలి టీ20లో ఆస్ట్రేలియా జయభేరి మోగించింది. టెస్టు సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన కంగారూలు టీ20లోనూ సుభారంభం చేశారు. జమైకా వేదికగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్లును మూడు వికెట్ల తేఊడాతో ఓడించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముదంజ వేసింది. సబీనా పార్కులో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన విండీస్ ఆదిలోనే ఓపెనర్ బ్రాండన్ కింగ్ (18) వికెట్ కోల్పోయింది. అయితే మరో ఓపెనర్, కెప్టెన్ షాయి హోప్ (39 బంతుల్లో 55), వన్‌డౌన్ బ్యాటర్ రోస్టన్ ఛేజ్ (60) అర్ధ శతకాలతో రాణించారు. సిమ్రన్ హెట్‌మెయిర్ (19 బంతుల్లో 38) తనదైన శైలిలో ధనాధన్ దంచికొట్టగా, మిగిలిన వారంతా విఫలమయ్యారు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో వెస్టిండీస్ 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో ద్వార్షుయిస్ 4 వికెట్లుతో చెలరేగగా, సీన్ అబాట్, కూపర్ కన్నోలి, నాథన్ ఎల్లిస్, ఆరంగేట్ర ప్లేయర్ మిచెల్ ఓవెన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక లక్ష్య ఛేదనకు దిగిన మార్షల్ బృందం 18.5 ఓవర్లలోనే పని పూర్తి చేసింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (24) ఫర్వాలేదనిపించగా, మరో ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెగర్క్ (2), వన్‌డౌన్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ (18) నిరాశపరిచారు. గ్లెన్ మాక్స్‌వెల్ (11) సైతం విఫలం కాగా, కామెరాన్ గ్రీన్, మిచే ఓవెన్ మెరుపు అర్ధ శతకాలతో చెలరేగారు. గ్రీస్ 6 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 51 పరుగులు చేయగా, మిచెల్ ఓవెన్ 6 సిక్సర్లు బాది 50 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో కూపర్ కన్నోలి (13), దార్షున్ (5)తో పేలవ ప్రదర్శన చేయగా, సీన్ అబాట్ (5) అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఫలితంగా 18.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసిన ఆస్ట్రేలియా వెస్టిండీస్‌పై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

### ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు:

# టీమిండియాకు బిగ్‌షాక్

## కీలక ప్లేయర్లకు గాయాలు.. ఆల్‌రౌండర్ సహా ఫాస్ట్ బౌలర్ల ఔట్



**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత్ ను ఆటగాళ్ల గాయాలు వేధిస్తున్నాయి. ఇప్పటికే సిరీస్ లో వెనుకంజలో నిలిచిన టీమిండియా ఇప్పుడు గాయాలతో ఆటగాళ్లు దూరం కావడంతో కాస్త డీలా పడింది. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నాల్గో టెస్టు మ్యాచ్ మాంచెస్టర్ వేదికగా ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే మూడు టెస్టు మ్యాచ్‌లలో 21తో ఇంగ్లాండ్ జట్టు ఆధిక్యంలో ఉంది. నాల్గో టెస్టులో విజయం సాధించి ఇంగ్లాండ్ జట్టుకు ధీటైన పోటీ ఇవ్వాలని భారత జట్టు ప్లేయర్లు భావిస్తున్నారు. అయితే, నాల్గో టెస్టుకు ముందు టీమిండియాకు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇంగ్లాండ్ జట్టుతో నాల్గో టెస్టుకు ముందు భారత జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఓ ఆల్‌రౌండర్ సహా ఇద్దరు ఫాస్ట్ బౌలర్లకు గాయాలు కావటంతో టీమిండియా పరిస్థితి ఆందోళనక రంగా మారింది. ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ అర్ధంతరంగా ఇంగ్లాండ్ పర్యటనను ముగించుకొని స్వదేశానికి వచ్చేస్తున్నట్లు సమాచారం. జిమ్ లో ట్రెనింగ్ సందర్భంగా నితీశ్ గాయపడినట్లు తెలిసింది. అతడి లిగమెంట్ దెబ్బతిన్నట్లు స్కానింగ్ లో తేలింది. దీంతో సిరీస్ లో మిగిలిన రెండు టెస్టులకు దూరంకాక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ పర్యటనలో నితీశ్ రెండు టెస్టులు ఆడాడు. 45 పరుగులు చేశాడు. మూడు వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే గాయాలతో వర్క్ లోడ్ మేనేజ్మెంట్ కారణంగా నాలుగో టెస్టులో జస్ప్రీత్ బుమ్రా ఆడతాడో లేదో అన్న సందిగ్ధత నెలకొంది. దీనికి తోడు నితీశ్ గాయం కూడా టీమ్ మేనేజ్మెంట్ ను కలవరపెడుతోంది. మరోవైపు లెఫ్టార్మ్ పేసర్ బర్మింగ్‌హామ్ టెస్టులో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆకాశ్ దీప్ కూడా గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో అతను కూడా నాల్గో టెస్టులో ఆడే అవకాశం లేదని తెలుస్తోంది. ప్రాక్టీస్ సెషన్ లో బంతిని ఆపుతుండగా, బౌలింగ్ చేసే ఎడమ చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. గాయం తీవ్రత దృష్ట్యా అతడిని పక్కన పెట్టాలని టీమ్ మేనేజ్మెంట్ భావిస్తోంది. అతని స్థానంలో మరో ఆల్ రౌండర్ అన్షుల్ కాంబోజ్ ను టీమ్ లోకి ఎంపిక చేశారు. దేశవాళీల్లో అదరగొట్టిన అన్షుల్ అన్నీ అనుకున్నట్లు జరిగితే నాలుగో టెస్టులో అరంగేట్రం చేసే అవకాశముంది.

# ఫ్రీస్టైల్ చెస్ ప్లే ఆఫ్‌లో అర్జున్ ఓటమి

## ఏడోస్థానానికి ప్రజ్ఞానంద పరిమితం



**న్యూఢిల్లీ:** ఫ్రీస్టైల్ చెస్ ఎట్టకేలకు భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగేసి అర్జున్ ఓటమిపాలయ్యాడు. మరో గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంత తదుపరి స్థానానికి పరిమితమయ్యాడు. లాస్ వెగాస్‌లో సోమవారం జరిగిన 2025 ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్‌లో భారతదేశానికి చెందిన అర్జున్ ఎరిగైసి మరియు ప్రజ్ఞానంద రమేష్‌బాబు వరుసగా ఆరవ మరియు ఏడవ స్థానాల్లో నిలిచారు. టోర్నమెంట్ ప్రారంభంలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి, ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా నిలిచిన అర్జున్, ఐదవ, ఆరవ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో ఫాబియానో కరువానా చేతిలో 0-2 తేడాతో ఓడిపోయాడు. 21 ఏళ్ల ఈ భారత ఆటగాడు నాకౌట్ దశలోనే తన లక్ష్యాన్ని కోల్పోయి, సెమీఫైనల్లో విజేత లెవాన్ అరోనియన్ చేతిలో, లోయర్ బ్రాకెట్ సెమీఫైనల్లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ చేతిలో మరియు కరువానా చేతిలో వరుసగా మూడు ఓటములతో టోర్నమెంట్‌ను ముగించాడు. ఎరియాగిసి తన అత్యుత్తమ ప్రదర్శనను కనబరచలేకపోయాడు. కరువానా పోటీ నుండి రాజీనామా చేసే ముందు భారత రాణిని ట్రాప్ చేస్తూ మ్యాచ్‌ను ముగించాడు. మరోపక్క ప్రజ్ఞానందకు కఠినమైన టోర్నమెంట్ అయినప్పటికీ, ఏడో-ఎనిమిదో స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్‌లో వెస్లీ సోపై విజయం సాధించాడు. చెన్నైకి చెందిన ఈ 19 ఏళ్ల యువకుడు సోతో జరిగిన మొదటి గేమ్‌లో బ్లాక్ పావులతో అద్భుతమైన డ్రాతో నిష్క్రమించాడు. దీనితో అతను తెల్లవారితో విజయం కోసం ఒత్తిడి తెచ్చే అవకాశం లభించింది. ఎనిమిదో ఎత్తుగడలోనే సో తప్పు చేయడంతో, ప్రజ్ఞానంద ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుని విజయాన్ని నమోదు చేసుకుని ఏడో స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్‌లో ఆరో స్థానంలో నిలిచినందుకు ఎరిగైసి 40,000 డాలర్లు (రూపాయల్లో 34,50,580) గెలుచుకోగా, ప్రజ్ఞానంద 30,000 డాలర్లు (రూ.25,87,935) గెలుచుకున్నాడు.

# జేన్‌స్ట్రీట్ రీఎంట్రీకి సెబి ఓకే

**ముంబై, జూలై 21:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో అక్రమ పద్ధతుల ద్వారా వేల కోట్లు కొల్లగొట్టిన అమెరికా హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్‌పై విధించిన నిషేధాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఎత్తివేసింది. తాము విధించిన రూ.4,800 కోట్ల జరిమానాను ఆ సంస్థ ఎస్క్రో ఖాతాలో డిపాజిట్ చేసిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లోకి మళ్లీ ప్రవేశించేందుకు అనుమతిచ్చినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. నిషేధం ఎత్తివేసిన విషయాన్ని అటు జేన్‌స్ట్రీట్‌తో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలకు, డిపాజిటరీలకు, కస్టోడియన్లకు సెబి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. జరిమానా మొత్తాన్ని ఎస్క్రో ఖాతాలో జమ చేసిన సందర్భంగా తమపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని ఆ సంస్థ కోరిన





నేపథ్యంలో సెబీ నిషేధం ఎత్తివేయడం గమనార్హం. ఒకసారి జేన్‌స్ట్రీట్ ఉదంతం బహిర్గతమైన నేపథ్యంలో ఆ సంస్థ రోజువారీ కార్యకలాపాలపై ఎక్స్ఛేంజీలు నిఘా ఉంచే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అక్రమ పద్ధతులకు పాల్పడిన జేన్‌స్ట్రీట్ సంస్థపై సెబి జులై 3న చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ సంస్థ దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు నిర్ధారించింది. అదే సమయంలో స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, నగదు విభాగంలో రూ.288 కోట్లు పోగొట్టుకుంది. ఈ నష్టాలను మినహాయిస్తే, నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించారు. అందులో రూ.4,843 కోట్ల సొమ్మును జరిమానాగా చెల్లించాలని సెబి ఆదేశించింది. దేశీయ స్టాక్‌మార్కెట్ల చరిత్రలో సెబి ఇంత పెద్దమొత్తాన్ని పెనాల్టీ విధించడం ఇదే ప్రథమం. ఆ మొత్తాన్ని గతవారం జేన్‌స్ట్రీట్ డిపాజిట్ చేసింది.

# యుపిఐ చెల్లింపుల్లో అగ్రగామి భారత్!

**న్యూఢిల్లీ, జూలై 21:** ఇప్పుడంతా డిజిటల్ కాలం అయిపోయింది. ఫిజికల్ క్యాష్ తీసుకోవడం ఇవ్వడం చాలా వరకు తగ్గిపోయిందనే చెప్పాలి. చిన్నా పెద్దా అన్ని అవసరాలకు కూడా యూపీఐనే వాడేస్తున్నారు. ప్రస్తుతం ఇండియాలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు పెరిగిపోయారు. అందుకు తగ్గట్టే డిజిటల్ చెల్లింపులు కూడా భారీగా పెరిగాయి. ఎంతలా అంటే యూపీఐ లావాదేవీల్లో ప్రపంచంలోనే ఇండియా నంబర్ వన్‌గా నిలిచింది. ఈ విషయాన్ని ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) తన నివేదికలో వెల్లడించింది. నేడు మన దేశంలో ప్రతి నెలా 1800 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని ఐఎంఎఫ్ తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో రూ.24.03 లక్షల కోట్లు యూపీఐ ద్వారా బదిలీ అయ్యాయి. మొత్తం 18.39 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి. 2024లో ఇదే నెలలో 13.88 బిలియన్ లావాదేవీలు కాగా, ప్రస్తుతం 32 శాతం వృద్ధి నమోదైంది. ప్రస్తుతం 49.1 కోట్ల మంది సామాన్య ప్రజలు, 6.5 కోట్ల మంది వ్యాపా





రులు ఈ యూపీఐ సేవలను వినియోగిస్తున్నారు. 675 బ్యాంకులు యూపీఐ సేవలను అందిస్తున్నాయి. దేశంలో మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 85 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయి. ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 50 శాతం ఒక్క మన దేశంలోనే జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. భారత్‌తో పాటు యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్ వంటి ఏడు దేశాల్లో యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. బ్రిక్స్ సభ్యత్వ దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వ్‌బ్యాంకు యోచిస్తోంది. సురక్షితమైన, వేగవం తమైన లావాదేవీల వల్ల యూపీఐ చెల్లింపులు ప్రజల్లో ఇంత ఆదరణ పొందాయి.

# ఇన్‌స్టా స్క్రోలింగ్ ఆపి ఎఐ టూల్స్‌పై ఫోకస్ పెంచండి..

## యువతకు పర్‌ప్లెక్సిటీ సిఇఒ సందేశం

**ముంబై, జూలై 21:** ఇన్‌స్టాగ్రామ్‌లో నిరంతరం స్క్రోలింగ్ చేయడం తగ్గించి, దానికి బదులుగా ఏఐ టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సంపాదించడంపై దృష్టి పెట్టాలని పర్‌ప్లెక్సిటీ సీఈవో అరవింద్ శ్రీనివాస్ యువతకు సూచించారు. ఇటీవల ప్రముఖ టెక్ జర్నలిస్ట్ మాథ్యూ బెర్మాన్‌తో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐని సరిగా ఉపయోగించడం తెలిసిన వారికి జాబ్ మార్కెట్‌లో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత ఏఐ యుగంలో మూడు నుంచి ఆరు నెలల వ్యవధి లోనే భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని శ్రీనివాస్ అన్నారు. దాంతో పోటీ పడకపోతే ఉద్యోగ అవకాశాల పరంగా వెనకబడి పోతామని పేర్కొన్నారు. సాంకేతికతతో పాటు వృద్ధి చెందడం అంతతేలికైన పని కాదు. ఇప్పటి వరకూ చూసుకుంటే మానవాళి ఇలా పెద్ద స్థాయిలో మార్పులకు త్వరగా సర్దుబాటు కాలేదన్న ఉదాహరణలెన్నో ఉన్నాయి అని శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్‌ప్లెక్సిటీకి చెందిన ఏఐ కామెట్ బ్రౌజర్ మానవ రిక్రూటర్ల పనిని పూర్తిగా భర్తీ చేసే స్థాయికి ఎదగవచ్చని



అభిప్రాయ పడ్డారు. ఒక రిక్రూటర్ వారం రోజుల పాటు చేసే పని, ఒక్క మంచి ప్రాంప్ట్‌తోనే పూర్తవు తుంది. సదరు అభ్యర్థుల వివరాలు సేకరించడం, వారికి మెయిల్ పంపించడం, వారి స్పందనలను ట్రాక్ చేయడం, గూగుల్ షీట్‌లో స్టేటస్ అప్‌డేట్ చేయ డం, ఫాలోఅప్‌లు ఇవ్వడం, గూగుల్ క్యాలెం డర్‌తో సింక్ చేయడం, మీటింగ్‌కుముందు బ్రీఫింగ్ పంపడం.. ఇవన్నీ ఆటోమేటిక్‌గా జరగాలి. ఇదే వచ్చే తరంలోని ఏఐ టూల్స్ లక్ష్యం అని చెప్పారు. ప్రస్తుతం కామెట్ బ్రౌజర్‌ను పెర్‌ప్లెక్సిటీ సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకే పరిమితం చేశారు.

# ఫండ్స్ రికవర్ చేస్తే 25% మీకే!

**న్యూఢిల్లీ, జూలై 21:** సైబర్ దాడి కారణంగా సుమారు 44.2 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.378 కోట్లు) పోగొట్టుకున్న దేశీయ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీ కాయిన్‌డీసీఎక్స్ బౌంటీ ప్రోగ్రామ్ ప్రకటించింది. ఈ సొమ్ము రికవరీలో సహకరించిన వారికి రాబట్టిన మొత్తంలో 25 శాతం వరకు రివార్డుగా ఇస్తామని వెల్లడించింది. ఈ మేరకు ఎథికల్ హ్యాకర్స్, వైట్‌హ్యాట్ రీసెర్చర్లు, ఇతర భాగస్వాములకు సోమవారం పిలుపునిచ్చింది. అంతేకాదు సైబర్ క్రైమ్‌పై వెబ్3 కమ్యూనిటీ పోరాడాలని సూచించింది. కాయిన్‌డీసీఎక్స్‌లో ఈనెల 19న ఉదయం 4 గంటలకు సైబర్ దాడి చోటుచేసుకుంది. భాగస్వామి ఎక్స్ఛేంజీలోని తమ ఖాతాల్లో, ఒకదాంట్లో ధ్రువీకరణ లేని చొరబాటు జరిగిందని కాయిన్‌డీసీఎక్స్ భద్రతా వ్యవస్థలు గుర్తించాయి. ఈ ఘటనలో దాదాపు రూ.378 కోట్ల నష్టం వాటిల్లింది. వినియోగదారుల నిధులు భద్రంగా ఉన్నాయని, వీటిపై ఎటువంటి ప్రభావం పడలేదని సంస్థ సహవ్యవస్థాపకులు సుమిత్ గుప్తా, నీరజ్ ఖండేల్‌వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రకటించారు. సైబర్ దాడి వల్ల నష్టపోయిన మొత్తాన్ని కాయిన్‌డీసీఎక్స్ భరిస్తుందని, అంతర్గత నిల్వలను ఇందుకు వినియోగిస్తుందని కంపెనీ తెలిపింది. గతేడాది క్రిప్టో ఎక్స్ఛేంజీ వజీర్‌ఎక్స్‌లో కూడా 230 మి.డాలర్ల సైబర్ చోరీ జరిగిన విషయం తెలిసిందే.





# ఇండియా మార్కెట్‌కు కొత్త ఇ-స్కూటర్లు!

**ముంబై, జూలై 21:** రాబోయే నెలల్లో ఏథర్, కైనెటిక్ వంటి ఎలక్ట్రిక్ వాహనాల బ్రాండ్లు అలాగే యమహా, సుజుకి, టివిఎస్ వంటి తయారీదారులు కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేస్తారు. ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐదు రాబోయే ఎలక్ట్రిక్ స్కూటర్ల గురించి తెలుసుకుందాం. సుజుకి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈయాక్సెస్ స్కూటర్‌ను జనవరి 2025లో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రవేశపెట్టారు. దీని మీడియా టెస్ట్ రైడ్‌లు పూర్తయ్యాయి. అలాగే మే 2025 నుండి గురుగ్రామ్ ప్లాంట్‌లో దీని సీరియల్ ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. ఇది 3.07 కెడబ్ల్యూహెచ్ లిథియంఅయాన్ బ్యాటరీని కలిగి ఉంది. ఇది ఒకే ఛార్జ్‌పై దాదాపు 95 కి.మీ.ల పరిధిని ఇస్తుంది. దీని ప్రధాన లక్షణాలలో ఫాస్ట్ ఛార్జింగ్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్, 12అంగుళాల చక్రాలు, ఆల్‌లినిదీ లైటింగ్, బ్లూటూత్‌ఎనేబుల్డ్ టిఎఫ్‌టి ఎల్‌సిడి డిస్‌ప్లే, 2ఎ యుఎస్‌బి స్మార్ట్‌ఫోన్ ఛార్జర్, సైడ్ స్టాండ్ ఇంటర్‌లాక్ సిస్టమ్ ఉన్నాయి. టీవీఎస్ మోటార్ కంపెనీ కొత్త బడ్జెట్ ఈస్కూటర్‌ను విడుదల చేయనుంది. దీనిని టీవీఎస్ ఆర్బిటర్ అని పిలుస్తారు. దీని ధర రూ.లక్ష లోపు ఉండవచ్చు. ఈ స్కూటర్ 2.2 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ, ఐక్యూబ్ ఎంట్రీ వెర్షన్ నుండి బాష్ యొక్క హబ్ మోంటెడ్ మోటారును పంచుకోవచ్చు. ఇది 75, 80కి.మీ మధ్య రేంజ్ కలిగి ఉంటుందని, గరిష్ట వేగం గంటకు 70 కి.మీ. ఉంటుందని భావిస్తున్నారు. రాబోయే నెలల్లో కైనెటిక్ డిఎక్స్ రానుంది. ఇది పాత యుగం ప్రసిద్ధ స్కూటర్‌ను ఎలక్ట్రిక్ అవతార్‌లో తిరిగి తీసుకువస్తుంది. ఈ స్కూటర్‌ను 2025 దీపావళికి ముందు ప్రారంభించవచ్చు. ఇది టిఎఫ్‌టి డిస్‌ప్లే,



ఎల్‌ఓటి ఆధారిత స్మార్ట్ ఫీచర్లు, జియో థింగ్స్‌తో కలిసి అభివృద్ధి చేసిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను అందిస్తుంది. అలాగే, ఇది బహుళ బ్యాటరీ ఎంపికలు, ఫాస్ట్ ఛార్జింగ్ సౌకర్యాన్ని కలిగి ఉంటుంది. యమహా తన మొదటి ఎలక్ట్రిక్ స్కూటర్ ఆర్‌వై01ను 2025 చివరిలో, 2026 ప్రారంభంలో భారతదేశంలో విడుదల చేయవచ్చు. దీనిని బెంగళూరుకు చెందినస్టార్టప్ రివర్ అభివృద్ధి చేసింది. రివర్ ఇండీ ఆధారంగా ఉంటుంది. ఇటీవల దాని పరీక్షా రిపోర్ట్ కూడా వెల్లడైంది. దీనిలో దాని డిజైన్‌అంశాలు రివర్‌ఇండీని పోలి ఉన్నాయి. దీనికి 4 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఉంటుంది. ఇది దాదాపు 100కి.మీ.ల పరిధిని ఇస్తుంది.

# వాణిజ్యం

## ఈక్విటీ సూచీలకు బ్యాంకింగ్ మద్దతు

**ముంబై, జూలై 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. విశ్లేషకుల అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో రెండ్రోజుల వరుస నష్టాల తర్వాత సూచీలు బయటపడ్డాయి. మరోవైపు రికార్డు త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 81,918.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,757.73) స్వల్ప లాభాల్లో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకుంది. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,274.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన



సూచీ.. చివరికి 442.61 పాయింట్ల లాభంతో 82,200.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.30గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు రాణించాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, ఐటీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 69.04 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3374 డాలర్ల వద్ద ట్రేడయింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.